శ్రీ వేంకటేశ్వరవచనములు

శ్రీ వేంకటేశ్వరప్రభాతస్తవము

కర్త

శ్రీ తాళ్లపాక పెదతిరుమలాచార్యులు

పరిష్కర్త

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

ప్రచురణ

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2013

SRI VENKATESWARA VACHANAMULU

SRI VENKATESWARAPRABHATASTAVAMU

By Tallapaka Pedatirumalacharyulu

T.T.D. Religious Publications Series No.

© All Rights Reserved

2013

Copies : 1000

Price.Rs...............

Published by

M.G. Gopal., I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati -517 501

D.T.P. SVPSVP., T.T.D. Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams, Press.
Tirupati.

ఓం నమో వేంకటేశాయ

ముందుమాట

యం.జి.గోపాల్ ఐ.ఏ.ఎస్.
కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు,
తిరుపతి.

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రజల్లో ధార్మిక చింతనను కలిగించడంతో పాటు ధార్మిక సాహిత్యాన్ని ముద్రించి విశేషంగా ప్రచారం చేస్తున్నది. తిరుమలలో వెలసిన అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ వేంకటేశ్వరస్వామిపై భక్తిభావనతో రచనలు చేసినవారెందరో ఉన్నారు. వారిలో అన్నమయ్య ప్రప్రథముడు. అన్నమయ్య రచించిన తాళపత్రగ్రంథాలనేగాక ప్రాచీనకవుల తాళపత్రగ్రంథాలను కూడా సేకరించి పరిశీలించి, పరిష్కరించి అచ్చువేసిన పరిశోధకులలో అగ్రగణ్యులు శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు.

కీ.శే. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు క్రీ.శ. 1888 ఫిబ్రవరి 7వ తేదీన కృష్ణాజిల్లా పెదకళ్లేపల్లిలో శేషమ్మ, సుందరశాస్త్రి అనే పుణ్యదంపతులకు జన్మించారు. సంస్కృతాంధ్రభాషలో విశేషపాండిత్యాన్ని సంపాదించిన శాస్త్రిగారు మద్రాసులో కొంతకాలం తెలుగుపండితునిగా పనిచేశారు. తర్వాత మద్రాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారంలో పరిశోధక పండితునిగా పనిచేసి అనేక గ్రంథాలను వెలుగులోనికి తెచ్చారు. ఉత్తమ పరిశోధన గ్రంథాలను పరిష్కరించి ముద్రించారు. తిరుపతిలోని తి.తి.దే ఓరియంటల్ కళాశాలలో ఆచార్యులుగా పనిచేస్తూ తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనల రాగిరేకులను పరిష్కరించి వెలుగులోనికి తెచ్చారు. ఎంతోమంది శిష్యులను ఉద్దండపండితులుగా తీర్చిదిద్దారు.

యోగివర్యులు, ఉత్తమపరిశోధకులు, బహుముఖప్రజ్ఞాశాలి, కవి, ఆత్మదర్శనులైన శ్రీ శాస్త్రిగారి సాహిత్యసేవను గుర్తించి తి.తి.దేవస్థానంవారు 2007వ సం॥లో శ్వేతభవనంలో "శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠాన్ని" స్థాపించారు. ఈ పీఠం స్థాపించిన నాటినుండి వారు పరిష్కరించి రచించిన గ్రంథాలను ముద్రించి ఆంధ్రసాహితీ లోకాని కందించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం., శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే ఇప్పటికి సుమారు పది గ్రంథాలకుపైగా ముద్రించింది. ఈ వరుస క్రమంలో వచ్చిందే **"శ్రీ వేంకటేశ్వర వచనములు'** అనే గ్రంథం. ఈ గ్రంథాన్ని తెలుగు సాహిత్యాభిమానులందరు తప్పక ఆదరించి పఠించగలరని ఆశిస్తున్నాము.

(యం.జి.గోపాల్)

పీఠిక

1. వచనరచన

ఆంధ్రవాఙ్మయమునఁ బ్రాచీనకాలమున వచన కావ్యరచన మంతగాఁ గానరాదు. భారతాదికృతులలోఁ బద్యరచనముల నడుమ నెడనెడఁ గానవచ్చు వచన రచనలే కాని, వచనైకరచనలు చాలఁదక్కువ. పద్యైక రచనలంత కింకను జాలఁ దక్కువ. తిక్కన నిర్వచనోత్తరరామాయణ మొక్కటే యట్టిది పేర్కొనఁదగినది. సంస్కృతమునఁ బద్యైకరచనలే యెక్కువ. చంపూరచనలంతకుఁ దక్కువ. గద్యైకరచనలును దక్కువే. దక్షిణ దేశభాష లలోఁ గర్ణాటకమున నొకతీరు గద్యరచనలు చాలఁగలవు. అవి ప్రాయికముగా వీరశైవులు భగవత్ప్రార్థనాతత్త్వార్థ నిరూపణ పరములుగా రచించినవి. అట్టిరచనలఁ బెక్కింటిని జేర్చి కర్ణాటకుల 'వచనశాస్త్రము' అనుపేర బేర్కొనిరి. కొన్ని సంపుటములుగా నిటీవల వానినిఁ బ్రకటించిరి. కన్నడమున నాయా రచనము లించుమించుగాఁ బండ్రెండవశతాబ్దినుండి యారంభమయిన వనవచ్చును. ద్రవిడమునఁ బ్రాచీనకాలమున వచనైకరచనలు లేనే లేవఁట! వ్యాఖ్యాన రూపవచనరచనములుండుఁగాక. యవి వచన కావ్యరచనలనఁ దగినవి.

సంస్కృతమున వచన రచన ముత్తెఱఁగులని వామనుఁడు కావ్యాలంకారసూత్రమున నిట్లు చెప్పినాఁడు.

"కావ్యం గద్యం పద్యం చ. గద్యం వృత్తగన్ధి చూర్ణ ముత్కలికా ప్రాయం చ. పద్యభాగవ ద్వృత్తగన్ధి. అనావిద్ధలలితపదం చూర్ణమ్. విపరీత ముత్కకలికాప్రాయమ్ " అని.

పద్యపాదభాగముల కలయికతో వృత్తముల వాసనఁ దోఁపించు చుండు వచనరచనము వృత్తగన్ధి. దీర్ఘసమాసముల గడబిడలు లేక తేలికపలుకులతో నుండు పొడిపొడివచనము చూర్ణము. దీర్ఘసమాసముల గడబిడలు గలిగి యుద్ధతోక్తులతో నుండురచన ముత్కలికాప్రాయము నని.

వామనునికిఁ దర్వాతివాఁడగు విశ్వనాథకవిరాజు వచనము నాల్గుదెఱఁగుల విభాగించెను. "వృత్తలేశవిహీనమయినగద్యము ముక్తకము

వృత్తగంధి ఉత్కలికాప్రాయము చూర్ణకము నని నాలుగు విధములు.. తొలిది సమాసరహితము. రెండవది వృత్తభాగములతోఁ గూడుకొన్నట్టిది. మూఁడవది దీర్ఘసమాసాఢ్యము. నాల్గవది యల్పసమాసకము.

పయి రచనాప్రభేదములలో రెండింటికి మాత్రము తెలుఁగున భారతాది కృతులలోని వచనభాగములనుండి లక్ష్యములెత్తి చూపవచ్చును. ప్రాయికముగాఁ గవిత్రయమువారి రచనలలోని వచనరచనములు చూర్ణకములనఁదగినవి. నాచనసోమన, పోతన ప్రభృతుల రచనలు గొన్ని యుత్కలికాప్రాయములనవచ్చును. వృత్తగంధి రచనలు తెనుఁగునఁ బ్రాచీనకాలమున నంతగా లేవు. ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసమున వృత్తగంధి వచనరచనలున్నవి. నేఁటికాలమున శ్రీగిడుగు రామమూర్తి పంతులుగారు రచించిన* 'ప్రాఁదెనుగుఁగమ్మ' వృత్తగంధియే. మచ్చుతునుక–

'సిరిఁదాల్చుఱేఁ డొగిఁజిన్ని చూడ్కులఁ జూచు తెనుఁగుఁ జదువుల రచ్చ తీర్పరులారఁ గ్రిందను గైవ్రాలుసేసిన నే నయా! యణకువ మెఱయుచు నాయొపు కొలఁదిఁ దెనుఁగుఁజదువులగుటిచి జాను మివులంగఁ దొలితెనుఁగు నుదులనఁ దేటతెల్లగను విన్నపమొక్కండు వినిపింతు మిమ్ము మోడ్చియు నిరుచేయి మ్రోఁకరిలఁబడియు నెఱఁగియుఁ గైవార మొనరంగఁ జేసి తద్దయు వేఁడుదు నాలింపుఁడయ్య మీరపోలెను నేను బ్రాఁబొత్తములు సాలఁజదువలేన'

కర్ణాటకమున గూడ వృత్తగంధి రచనములున్నవి. రామాశ్వమేధాదు లందు లక్ష్యములు చూడనగును.

సంస్కృతమున వామనుఁడు పేర్కొన్నముత్తెఱఁగుల రచనము లున్నవి. కాదంబరీ, దశకుమారచరిత్ర, యశస్తిలక చంపూ ప్రభృతు లందును, శ్రీభగవద్రామానుజాచార్యులవారి గద్యత్రయమునందును, పాల్కురికి సోమనాథుని గద్య గ్రంథమునందును వీనికి లక్ష్యములున్నవి. శ్రీభగవ ద్రామానుజాచార్యులవారి గద్యత్రయముననుండి ముత్తెఱఁగుల రచనలకు మచ్చుతునుకలఁ జూపుచున్నాఁడను. చూర్ణమునకు –

అపారకరుణామ్బుధే, అనాలోచితవిశేషా విశేష లోకశరణ్య, ప్రణతార్తిహర, ఆశ్రితవాత్సల్యైక మహోదధే, అనవరతవిదితనిఖిలభూతజాత

*చూ– ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక సంపుటము 2 సంచిక 3

యాథాత్మ్య, సత్యకామ, సత్యసఙ్కల్ప, ఆపత్సఖ, కాకుత్స్థ, శ్రీమన్నారాయణ, పురుషోత్తమ, శ్రీరఙ్గనాథ, మమ నాథ నమోఽ స్తుతే.
(శ్రీరఙ్గగద్యమ్)

ఉత్కలికాప్రాయమునకు –

స్వచ్ఛన్దానువర్తి స్వరూపస్థితిప్రవర్తిభేదా శేష శేషతైకరతిరూపనిత్య నిరవద్య నిరతిశయ జ్ఞానక్రియైశ్వర్యాద్యనన్త కల్యాణగుణగణ శేషాసన గరుడ ప్రముఖ నానావిధానన్తపరిజన పరిచారికా పరిచితచరణయుగల పరమ యోగివాఙ్మానసాపరిచ్ఛేద్య స్వరూపస్వభావ స్వాభిమత వివిధవిచిత్రానన్త భోగ్యభోగోపకరణ భోగస్థాన సమృద్ధానన్తాశ్చర్యానన్త మహావిభవానన్త పరిమాణ నిత్యనిరతిశయ శ్రీవైకుణ్ఠనాథ – (శరణాగతిగద్యమ్)

వృత్తగంధికి–

ప్రత్యగ్రోన్మీలిత సరసిజసదృశ నయనయుగలం – స్వచ్ఛనీలజీమూత సఙ్కాశమ్ –అత్యుజ్జ్వల పీతవాససం – స్వయంప్రభయా అతినిర్మలయా అతిశీతలయా స్వచ్ఛయా మాణిక్యాభయా – కృత్స్నం జగద్భాసయన్తమ్ –అచిన్త్య దివ్యాద్భుత నిత్యయౌవన స్వభావ లావణ్యమయామృత సాగరమ్ – అతిసౌకుమార్యా దీషత్ప్రస్విన్నవదాలక్ష్యమాణ లలాటఫలక దివ్యాలకావలీ విరాజితం – ప్రబుద్ధముగ్ధాంబుజచారులోచనం – సవిభ్రమభ్రూలతమ్– ఉజ్జ్వలాధరమ్ – శుచిస్మితం – కోమలగణ్డమ్ – ఉన్నసమ్ – ఉదగ్రపీనాంస విలమ్బికుణ్డలాలకావలీబన్ధురకమ్బుకన్ధరం – ప్రియావతం – సోత్పల కర్ణభూషణ శ్లథాలకా విమర్దశంసిభి శ్చతుర్భి రాజానువిలమ్బిభి ర్భుజై ర్విరాజితం – అతికోమలదివ్యరేఖాలఙ్కృతాతామ్రకరతలం, దివ్యాఙ్గులీయకవిరాజితమ్, అతికోమలనఖావలీవిరాజితం, అనురక్తాఙ్గులీభిరలంకృతమ్, తత్క్షణోన్మీలిత పుణ్డరీక సదృశ చరణయుగళమ్. *(శ్రీ వైకుణ్ఠగద్యమ్)

తెలుగునఁ లక్షణగ్రంథకర్తలు వచనరచనలనిట్లు పేర్కొనిరి.

"క॥ కనుఁగొనఁ బాదరహితమై
పనుపడి హరిగద్దెవోలె బహుముఖ రచనం
బున మెఱయు గద్యమది దాఁ
దెనుఁగు కృతుల వచనమనఁగ దీపించుఁగడు౯ .

*ఇందు ఆళవందార్లస్తోత్రరత్నశ్లోకముల తునుకలున్నవి.

గద్యము – స్వస్తి సమస్తభువనరక్షాదక్ష శ్రీపుండరీకాక్ష భుజగపతి సింహాసనారూఢ సురనికరమకుటతటఘటిత సురుచిరమణిగణప్రభావిభాసిత పాదపీఠ వేదనినాదానుకార గౌరవలలితనూపురాలంకృత చరణసరసిజయుగళ నవ్యపదాంగుష్ఠనఖమయూఖరేఖాయిత సురసరిత్ప్రవాహ పీతాంబరధర నూత్న మేఖలాకలితకటితటప్రదేశ చతురానన జనకనాళీకశోభితనాభిసరోవర యఖండ బ్రహ్మాండకలాపగోపననిపుణోదర క్షీరసాగరతనయా మనోజ్ఞ గేహీకృతవిపుల వక్షస్స్థల కనత్కనక కటక కేయూర ప్రముఖభూషణభూషిత చతుర్భుజ శంఖ పంకజసుదర్శనగదాధర కిరీటకుండలాభిరామ యనవరత ప్రసన్న వదన కౌండిన్యవరద శ్రీయనంతపద్మనాభ నమస్తే నమస్తే నమః–" (అనంతుని ఛందము)

'ఇఁక నందు గద్యలక్షణం – మఱియు నందు గద్యయు నైదుభేదంబుల విహరించు – నయ్యవి యేవంటేను గద్యయు, బిరుదుగద్యయు, చూర్ణికయు, వచనంబును, విన్నపంబులు నన గద్యభేదంబు లైదును ప్రమోదంబున వివిధమ్ములై వినోదించు నందు గద్యక్రమంబెటువలె నంటేని 1 గద్య – అనుకరణ శబ్దయుక్తంబై యొప్పు నందు 2 బిరుదుగద్య – సంబోధనాంత పదబంధురంబునై వర్తిల్లు నందు 3 చూర్ణిక – ద్వివచన బహువచన సందర్భములగు విభక్త్యనుశాసన సమాసాది సమాసాదిత కల్పనానల్పజల్పితంబై వెలయు నందు 4 వచనంబులు – బహుప్రకార రచనానిచయ ప్రాచుర్యమ్ములై సంచరించు నందు 5 విన్నపంబు – లెన్న విన్ననై ఋజుమార్గమ్ముల ననుగమించి మించు నీపంచవిధమ్ములు మితివిరహితమ్ములై స్వేచ్ఛాకల్పనాగౌరవమ్ముల కొలందుల విలసిల్లు" (లక్షణశిరోమణి)

మీఁది లక్షణగ్రంథకర్తలలో ననంతుఁడు పదునైదవ శతాబ్దివాఁడు. ఆతఁడు చెప్పినగద్యలక్షణమున కనుగుణముగానే కర్ణాటాంధ్రభాషలలోని ప్రాచీనవచనైకరచనలున్నవి. లక్షణశిరోమణికారుఁడు పొత్తపి వెంకటరమణ కవి పదునేడవశతాబ్దివాఁడు గాఁబోలును. ఆతఁడు వచనరచనల నైదు విధముల విభజించినాఁడు. అతఁడు పేర్కొన్న 'విన్నపములే' యనంతామాత్యుఁడు చెప్పినగద్యములగును. ఇట్టి రచనములొకటి రెండు నిమిషములకు మించనికాలమునఁ జదువఁదగినవై స్తుత్యదేవతా సంబోధక పదాంతములై

యుండును. వీనినే తాళ్ళపాకవారు వచనగీతములని, తాళగంధిచూర్ణకములని కూడఁ బేర్కొనిరి. ఈ విషయమిఁక ముందు వివరింతును. అనంతామాత్యుని నాఁటికిఁ దెలుఁగున భారతభాగవతాది గ్రంథముల వచనైకరచనలు లేవు గాఁబోలును! అట్టివాని నాతఁడు పేర్కొనలేదు. పదునాఱవ శతాబ్దినుండియే భారతభాగవతాదుల వచనైక రచనలు తెలుఁగున వెలసినట్లున్నవి. లక్షణశిరోమణికారుఁ డట్టి వానిని దాను విభజించిన పంచవిధవిభాగములలో నాలుగవ భేదమగు 'వచనముగా' నిర్వచించినాఁడు. ఈతని నాఁటికిఁ జూర్ణిక 'పొడిపొడి పలుకుల ప్రసన్నరచన గాక' సంస్కృతపుటుత్కలికా ప్రాయ రచనగా మాఱినది. ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసాదులందింకను సర్వలఘు వచనములు, అంత్యానుప్రాస చతుర్దళ చూర్ణికలు మొదలగు వచనచిత్రరచనా ప్రభేదములు చూడఁదగును. మఱియు నంధ్రమున నన్నయాదికవుల కృతులలోని యాశ్వాసాంత వచనరచనలను 'ఆశ్వాసాంతగద్యము' లని పేర్కొనుట కలదు. అవి లక్షణశిరోమణికారుఁడు చెప్పిన 'బిరుదు గద్యము' లగు ననుకొనవచ్చును. అట్టి బిరుదగద్యములు సంబోధనాంతములుగా నుండవలెనని యాతఁడు చెప్పినాఁడు. అట్లే ప్రాచీనరాజుల బిరుదుగద్యములు నున్నవి గాని యా గద్యముల కెల్ల సంబోధనాంతత నియతముగా నుండునన్న నిర్ణయము నిలువదేమో! ఆశ్వాసాంత బిరుదగద్యములు సంబోధనాంతములుగా నుండవు గదా!

అనంతామాత్యుఁడు (వచన) గద్య మనియు, లక్షణశిరోమణికారుఁడు విన్నపమనియుఁ బేర్కొన్నతీరు రచనములవి సంస్కృతమున శ్రీభగవద్రామానుజాచార్యులవారు రచించిన గద్యత్రయమును బాల్కురికి సోమనాథుఁడు రచించిన పంచప్రకారగద్యాదులును బురస్కరించుకొని కర్ణాటాంధ్రములలో వైష్ణవ,శైవభక్తులు సాగించిన రచనములయి యుండునని నే ననుమానించు చున్నాఁడను. తెలుఁగున నాకుఁ గానవచ్చిన యిట్టి రచనలలోఁ బ్రాచీన మనఁదగినవి 'సింహగిరి వచనములు' వీనికిఁ గృష్ణమాచార్య సంకీర్తనము లని నామాంతరము.*

*ఆ వచనములు రచియించిన కృష్ణమాచార్యుఁడు కాకతీయ ప్రతాపరుద్రుని నాఁటి వాఁడని యేకశిలానగరచరిత్రాదులవలనఁ దెలియనగును.

మచ్చున కాతని వచన మొకటి :-

"దేవా! పదికోట్ల యజ్ఞాదిక్రతువులు నడపంగానేమి, తొమ్మిదికోట్ల తులాభారంబులు తూఁగంగానేమి, యెనిమిదికోట్ల సువర్ణదానంబులు, నేడు కోట్ల గోదానంబులు, నాఱుకోట్ల భూదానంబులు, నయిదు కోట్ల కన్యాదానంబులు, నాలుగుకోట్ల వస్త్రదానంబులు సేయంగానేమి, మూఁడుకోట్ల సత్యాది వ్రతంబులు సలుపంగా నేమి, రెండుకోట్ల యన్నదానంబులు గావింపఁగా నేమి, కోటిస్నానంబులు సేయంగా నేమి, మీ నామోచ్చారణంబు సేయక! పదివేల యజ్ఞాదిక్రతువులు నడిపిన దేవేంద్రుండు నిలువెల్ల యోనులయ్యెను. తొమ్మిదికోట్ల తులాభారంబులు తూఁగిన దుర్యోధనుండు యమపురికేఁగెను. ఎనిమిదికోట్ల సువర్ణదానంబులు సేసిన కర్ణుండు పసిండికొండమీఁది యన్నంబుల కపేక్షించెను. ఏడుకోట్ల గోదానంబులు చేసిన కార్తవీర్యార్జునుండు గోహత్యా బ్రహ్మహత్యా పాతకంబులఁ బొందెను. ఆఱుకోట్ల భూదానంబులు చేసిన బలి విష్ణు పాదంబునఁ బాతాళంబున కేఁగెను. అయిదుకోట్ల కన్యాదానంబులు చేసిన ధ్రువుండు కాశీక్షేత్రంబునఁ బండ్రెండువేల యేండ్లు భిక్షంబెత్తెను. నాలుగుకోట్ల వస్త్రదానంబులు చేసిన మార్కండేయుండు మతిహీనుండాయెను. రెండుకోట్ల అన్నదానంబులు చేసిన ధర్మజుండు యమపురి తొంగిచూచెను. కోటిస్నానంబులు చేసిన కుమారస్వామి కోరిక సిద్ధించదాయెను. దేవా! మీ నామోచ్చారణంబు చేసి ప్రహ్లాదనారద పుండరీక వ్యాసశుక శౌనక భీష్మ దాల్భ్యరుక్మాంగదార్జున బలివిభీషణ భృగుగాంగేయాక్రూర విదురాదులగు పరమ భాగవతోత్తములు కృతార్థులైరి. కావున, యతిరామానుజ మునిపరం దాతారు (?) అనాథపతియైన స్వామీ సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ." (సింహగిరి నరహరి వచనములు)*కృష్ణమాచార్య సంకీర్తనములు.

*సీ. కటకేంద్రుకూఁతురి కౌగిటిలోఁ దక్కెఁ
జెళ్ళపిళ్ళస్వామి చేతఁగాదు
కృష్ణమాచార్య సంకీర్తనంబులఁ జొక్కె
సింహాద్రి యప్పని చేతఁ గాదు
కవ్వంపుఁగొండ సంఘర్షణోద్ధతిఁ జిక్కె
శ్రీ కూర్మనాథుని చేతఁగాదు
శాక్యతొండని ఊలజడికెంతయును స్రుక్కెఁ
జెన్నమల్లేశునిచేతఁ గాదు

ఇంకను నిట్టివి శంకరవచనములని, శఠకోప విన్నపములని, కాలజ్ఞాన వచనములని, కాశికావచనములని, భవానీమనోహర వచనములని, శివరాజయోగ వచనములని, లక్ష్మీవల్లభ వచనములని, శేషగిరినాథ వచనములని మఱియుఁ గొన్ని పేళ్ళతో వచనరచనలు ప్రాచీనములు గానవచ్చుచున్నవి. అవి యెల్ల నించుమించుగాఁ బదునాలుగవ శతాబ్దికిఁ దరువాతివే కాఁదగు ననుకొందును. ఇప్పటికి నా యెఱుక కందినంతలోఁగాల నిర్ణయముఁజెప్పఁదగిన ప్రాచీనవచనరచనలలోఁ గృష్ణమాచార్య సంకీర్తనముల తర్వాత 'వేంకటేశ్వర వచనములే' పేర్కొనఁదగినవి. ఈ రెంటిలోఁ దొలిది పదుమూఁడవశతాబ్ది తొలిది. రెండవది పదునైదవ శతాబ్ది తుదిది. ఇక్కడఁ బ్రసక్తములు శ్రీ వేంకటేశ్వర వచనములు.

పవనజవననిరాఘాటయవనఘోట
హరణజయధాటి మీచేతనౌనె మేటి
వౌదు వౌకసన్నఁ జూడు మేలా పరాకు
శత్రుసంహార! వేంకటాచలవిహార!

సీ. తాళ్ళపాక చిన్నన్న దండెమీటులు గావు
గోమాంసభుగ్ధనుర్గుణరవంబు
బంటొసంగిన బంకమంటి పువ్వులు గావు
యవనాధముల చిలుకంపగములు
[1]సాముడిగ్గియనీటి చల్లులాటలు గావు
పాశ్చాత్త్యభటుల తుపాకిగుండ్లు
సంపెంగబాకులు జరగించుటలు గావు
రిపులపాళెములు దర్లించుపగలు
బంటుపంతము తగదంచుఁ బంటకాఁపుఁ
దనము గైకొంటివిది మంచిగుణమె దినము
జనము దెచ్చిన ధనము లప్పనములిచ్చి
శత్రుసంహార! వేంకటాచల విహార !

సీ. పొట్టేళ్ళగతిఁ బట్టి బోడిసన్న్యాసుల
ఢీయని తాఁకు లాడించునొకఁడు
సోమయాజుల బ్రహ్మసూత్రముల్ ద్రెంచి సిం
గాణివిండ్లకు నల్లె గట్టు నొకడు
ఖూబుఘోడాయంచు గుడికీలు గుఱ్ఱము
నెక్కి ధేయని తఱటెత్తు నొకఁడు

1. శ్రీ వేంకటేశ్వర లఘుకృతులు లో 'చల్లని పన్నీటి' అని పాఠాంతరం.

2. తాళగంధి చూర్ణకములు

ఇవి తిరుపతి క్షేత్రమున శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దివ్యాస్థానమున సంకీర్తనాచార్యులుగ సుప్రఖ్యాతులయిన తాళ్ళపాకవారు రచించిన వానిలోనివి. ఏతత్కర్త తాళ్ళపాక పెదతిరుమలాచార్యుఁడు. పదునైదవ శతాబ్ది చతుర్థ పాదమున జనించి పదునాఱవ శతాబ్ది పూర్వార్ధమున వర్తిల్లినవాఁడు. [1]ఈ పెదతిరుమలాచార్యులవారికిఁ గుమారుఁడయిన చినతిరుమలాచార్యుఁడు తన తండ్రి పెదతిరుమలాచార్యులు వ్యాఖ్యానించిన తీరుననుసరించి తన తాత తాళ్ళపాక యన్నమాచార్యుఁడు సంస్కృతమున రచించిన 'సంకీర్తన లక్షణమును' దెలుఁగునకుఁ బరివర్తనము చేసెను. అందీ వచనరచనల నిర్వచన మిట్లున్నది.

'మఱియుఁ జూర్ణాఖ్యపదంబెట్టిదంటేని –

కII ధరఁ గృష్ణాచార్యాదిక
పరికల్పితపదము తాళబంధచ్ఛందో
విరహితమై చూర్ణాఖ్యం
బరఁగు నది నిరుక్తనామ భాసితమగుచున్.

పై కాలుగొమ్మని బల్మిఁగోమటివారి
చెలువపైఁబడి బూతుసేయునొకఁడు
యవనసమ్మర్ద దుర్దినంబైన దిగువ
తిరుపతిని జూడు మిటువంటితఱిని నిదుర
పోవుచున్నాఁడు మీయన్న లేవలేక
శత్రుసంహార! వేంకటాచల విహార!

1.ఆతని కాలముననే యీ వచనములు రాగిరేకులమీఁదఁ జెక్కింపఁబడి తిరుపతి దేవస్థానమున భద్రపఱుపఁబడినవి. ఈ వచనములేకాక తాళ్ళపాకవారి పద్యగద్యగేయ రచనములనేకములు రాగిరేకులపైఁ జెక్కబడి భద్రపఱుపఁబడినవి. అందుఁగొన్నిఱేకులు అహోబలమునకు శ్రీరంగమునకును గూడఁజేర్చఁబడినవఁట; ఇటీవల నహోబలములోని రాగిరేకులు కొన్ని రాగిపాత్రలకై యమ్మ బడినవనియు, నట్లమ్మఁబడినవి నాలుగయిదు వందల రూపాయల విలువఁగల రాగిరేకులనియు, వింటిని. తిరుపతి ఱేకులమీఁది సంకీర్తనాదులు శ్రీ తిరుపతి దేవస్థానమువారిప్పటికి గొన్నింటి ముద్రించిరి.

మఱియుఁదచ్చూర్ణవిధంబెట్టిదనిన –

కII ఛందోగణముల నియతిం
బొందక తాళప్రమాణమునఁ గడుఁ జెలువై
కొందఱిచేఁ దచ్చూర్ణం
బందముగాఁ దాళగంధి యనఁబొగడొందున్'.

పూర్వోదాహృతమైన సంకీర్తనలక్షణ గ్రంథ నిర్వచనము చొప్పున దాళగంధిచూర్ణము లనఁదగిన యీ వచనములను రచించి శ్రీ స్వామివారి సన్నిధిని శ్రీ తాళ్ళపాక పెదతిరుమలాచార్యుఁడు రాగతాళములతో నాలాపించువాఁడు కాఁబోలును ! రాగిరేకులనుండి యెత్తి శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానమువారింతకు ముందు ముద్రింపించిన వచనములు నలువదేడింటికి రాగతాళములు నిర్ణీతములయి యున్నవి[1]. మఱియు నందీ వచనములు 'వైరాగ్యవచనమాలికాగీతము' లను పేరఁబేర్కొనఁబడినవి. అనఁగా నివి వచనములే యయినను గీతములుగాఁ బాడఁదగిన వన్నమాట! అందుచేతనే యివి సంకీర్తనలక్షణమున 'తాళగంధిచూర్ణకపదము' లని పేర్కొనఁబడినవి. సంస్కృతమున వామనుఁడు వృత్తగంధి, ఉత్కలికాప్రాయము, చూర్ణము, నని ముత్తెఱఁగుగల వచనరచన చెప్పఁగా నితఁ డా చూర్ణమును వచన విభాగముననే తాళగంధి యని పదరచనా విభాగముగాఁ గల్పించినాఁడు. ఈ తెఱఁగు వచనరచనలకుఁ జూర్ణమను పేరు పొడిపలుకులతో నుండుటచే నేర్పడినదగుట నీతఁడు సూచించినాఁడు. మన యీ వేంకటేశ్వరవచనములు పొడిపొడిపలుకుల కూర్పే కాని, యిందుద్ధతోక్తులు, ప్రౌఢసమాసములు లేవు. ఇట్టి పదరచనములకుఁ గృష్ణాచార్యాదులు పరికల్పకులని యా సంకీర్తన లక్షణపద్యమున నున్నది. ఇంతకుముందు నే నుదాహరించిన కృష్ణమాచార్య సంకీర్తనములకర్త కృష్ణాచార్యుఁడే సంకీర్తనలక్షణకారుఁడు పేర్కొన్న కృష్ణాచార్యుఁడు కాఁగలడు. ఇట్టి రచనములకుఁ గృష్ణమాచార్య సంకీర్తనములనఁబడు సింహగిరి నరహరివచనములే ప్రప్రథమ రచనములని యీ సంకీర్తనలక్షణ గ్రంథోక్తిని బట్టి గుర్తింపనగును. దీనిని లక్ష్యీకరించుకొనియే యనంతామాత్యుఁడు గద్యనిర్వచనము నట్లు చేసియుండును. తర్వాతికాలమున నిట్టి వచనములు 'విన్నపము' లనియుఁ బేర్కొనఁబడినవి.

1. గ్రంథావసానమున ముద్రింపఁబడినవి.

వేంకటేశ్వరవచనములు – వాని యోగ్యత

ఈ వచనములకు రచనములో నామపూర్వి యేదియుఁగానరాదు. వస్తువిన్యాసమునఁగూడఁ గ్రమపద్ధతి యేదియుఁదోఁపదు. కవి యప్పు డప్పుడు తనకుఁ దోఁచిన తత్త్వవిషయముల నీశ్వరస్తుతిపరములు గావించి విడివిడిగనే వచనములుగా రచించినాఁడు గాఁబోలును! ఇందు విశిష్టాద్వైత సిద్ధాంతవిషయములు సర్వత్ర కరడుగట్టియున్నవి. గ్రంథకర్త స్మార్తనందవరీక బ్రాహ్మణుఁడైనను వైష్ణవమతము స్వీకరించినవాఁడు. జాలిజాలిగాఁ గొసరి కొసరి శ్రీ వేంకటేశ్వరస్వామిని గవి యేతద్వచన రచనలలోఁ బలుదెఱఁగులఁ బరమార్థలబ్ధికై ప్రార్థించును. విశిష్టాద్వైతసిద్ధాంతపు జీవగఱ్ఱయగు 'శరణాగతి' యిందుఁ జాలఁజక్కఁగా సవదరింపఁబడినది. కవి యిందు స్వామిని బలుచోట్ల నేకవచనముననే తేలికగా 'నీ' వని యెచ్చరించును. తోడ్తోఁగొన్నిపట్టుల 'మీ' రని గొప్పగా బహూకరించును. తండ్రియొడిలో నాటవేడ్కలతో నుండు ముద్దులబిడ్డఁడు తండ్రిని నెయ్యంపుమురుపునఁ దొక్కుబల్కులతో నీవని తుంకరించుట, యంతలోనే పెద్దఱికపు హద్దుతోపగా మరల మీరని బహూకరించుట, యందందనుభూయమానమే కదా! ఆ యనుభూతి నా కీ తీరునకు సమర్థకముగాఁ దోఁచినది. అన్నిచోట్ల నేకవచనమునో, బహువచనమునో యొక్క దానినే యుంపవచ్చునుగాని పయిసమర్థనము ననుసరించి నేనట్లు మార్పుచేయలేదు.

ఇందు 147 వచనమున నూటయెనిమిది తిరుపతుల పేళ్ళు పేర్కొనఁ బడినవి. నిత్యానుసంధానాదులగు నర్వాచీన ద్రావిడవైష్ణవ సంప్రదాయ గ్రంథములలో నూటయెనిమిది తిరుపతుల (దివ్యస్థలముల) పేళ్ళు ముద్రితములయి యున్నవి. వాని పరిగణన మా తీరుగా నే నాఁడు జరిగెనో గుర్తింపఁజాలనయితిని. ఆ పేళ్ళకు నిందున్న పేళ్ళకుఁ జాల భేదమున్నది. క్రీ.1480 ప్రాంతముల నూటయెనిమిది తిరుపతులపేళ్ళీ విధముగా నుండె నని దీనిఁబట్టి తెలియనగును. కాని యీ పేళ్లుగల వచనపుప్రాఁతప్రతి యొక్కటే తప్పులతో నుండుటచే నీ ముద్రణమున ప్రాఁతలోగల యా తీరేయున్నది. ఇందుఁగొన్ని స్థలములపేళ్ళు తప్పులుగా నున్నట్టున్నవి. ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసమునను, హంసవింశతిలోను నూటయెన్మిది తిరుపతుల పేళ్ళు నిందున్న తీరుననుసరించియున్నవి. ఏతన్ముద్రణానంతర మా పేళ్ళనందుఁజూచితిని.

ఇందు వచనరచనారీతిలో ననంతుఁడు చెప్పిన గద్య (వచన) లక్షణము చక్కగా ససిపడినది. లక్షణశిరోమణికారుని 'విన్నపము' రచన కీ వచనములు మంచి లక్ష్యములనఁదగును. దూరాన్వయము, సమాసక్లేశము నను ప్రాసవిన్యాసపరిశ్రమము నిందు లేవు. సూటిగా మనసున నాటునట్లు భావములున్నవి. కొన్ని వచనములు టాగోరుగారి గీతాంజలిరచనములఁ దలఁపించునవిగాఁ గూడనున్నవి. కృష్ణమాచార్యసంకీర్తనములు సరిగా నిట్టివే, వీనికి మూలకల్పములే కాని, యందు భాషాప్రాచీనత యింతకంటె విస్పష్టముగా గోచరించుచున్నది. ఈ వచనములను రాగతాళములతోఁ బ్రాచీనకాలమునఁ బలువురు పాడెడివారు గావలయు; కవియే భావాను గుణముగా వీనికి రాగతాళములఁ గల్పించినాఁడు.

తాళ్ళపాకవారు

ఏతద్ గ్రంథకర్త తాళ్ళపాక పెదతిరుమలాచార్యుఁడు నందవరీక స్మార్తబ్రాహ్మణుఁడంటిని. తాళ్ళపాక నేఁటి రాజంపేట తాలూకాలోనున్నది. అది వీరి నివాసగ్రామము. ఈ కవి తండ్రి.

అన్నమాచార్యుఁడు

ఈతఁడు వైష్ణవమతమును స్వీకరించినవాఁడు. గొప్పభక్తుఁడు. కవి. మహిమలు గలవాఁడు. ఈతఁడు తొమ్మిదియాఱేండ్లు జీవించెను. ఈ యన్నమాచార్యుఁడు దినమున కొక్కదానికేని తక్కువకాని చొప్పున గేయములు రచించుచు శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిని సంకీర్తనము చేయుచుండువాఁడట! ఈతనికిఁ బదునాఱవయేట స్వామి ప్రత్యక్షమయ్యెనట! తదాది యెనుబది యేండ్లదాక నీతఁడు సంకీర్తనములు రచించుచునే యుండెను.

ఈతనికి సంకీర్తనాచార్యుఁడని, ద్రావిడాగమ సార్వభౌముఁడని, పంచ మాగమచక్రవర్తి యని బిరుదులు. శ్రీ వేంకటేశ్వరస్వామి కీతఁడు మామ. అలమేలు మంగాంబ కీతఁడు తండ్రివరుసవాడు. ఇతని సంకీర్తనలను వినిన చెవిని మఱొకరి సంకీర్తనముల విననొల్లనని శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రతిజ్ఞఁ గావించె నఁట! ఈతఁడు రచించిన గ్రంథములు 1 ఆధ్యాత్మ సంకీర్తనలు. 2 శృంగారసంకీర్తనలు. 3 శృంగారమంజరి, 4 సంకీర్తన లక్షణము (సంస్కృతము; ఇది దొరకలేదు). ఈ కవికి సంబంధించిన చరిత్రము శాసనాదులందుఁ

గానరాదు.[1] కాని తాళ్ళపాక చిన్నన్న ద్విపదకృతిగా నితని చరిత్రము రచించినాఁడు. ఈతని కుమారుఁడు –

[2]పెదతిరుమలాచార్యుఁడు

ఈతఁడే ప్రస్తుత శ్రీవేంకటేశ్వరవచనములకుఁగర్త. శ్రీ తిరుపతి దేవస్థానమున నున్న రాగిరేకులమీఁద నీ వచనములు తిరుమలాచార్య రచితము లని గ్రంథారంభమునఁ జెప్పఁబడినది. ఈతఁడు మహైశ్వర్య మహితుఁడుగా వెలసెను. శ్రీ వేంకటేశ్వరస్వామి కీతఁడనేక కైంకర్యముల జరపించెను. శ్రీ స్వామి యీతనితోఁ దరువాతి మూఁడుతరములదాఁకాఁ బ్రత్యక్షమును, నేడుతరములదాఁకఁ బరమపదమును ననుగ్రహించెనఁట! ఈతని యితర కృతులు 1 శృంగార సంకీర్తనలు 2 శృంగారదండకము 3 చక్రవాళమంజరి 4 శృంగార వృత్తశతకము 5 శ్రీ వేంకటేశోదాహరణము 6 నీతి సీసశతకము 7 సుదర్శనరగడ 8 రేఫఱకారనిర్ణయము 9 ఆంధ్రవేదాంతము (ద్విపద) 10 ఆంధ్రహరివంశము 11 భగవద్గీత (వచనము) 12 శ్రీ వేంకటేశ్వర ప్రభాతస్తవము 13 ఆధ్యాత్మసంకీర్తనలు. ఈతనికి వేదమార్గప్రతిష్ఠాపనాచార్య, శ్రీరామానుజసిద్ధాంతస్థాపనాచార్య, వేదాంతాచార్య, కవితార్కికకేసరి, శరణాగత వజ్రపంజర బిరుదములు కలవు. స్వామి కీతఁడు జరిపిన కైంకర్యముల సారము :–[3]

పెదతిరుమలయ్యంగారు క్రీ. 1517 నుండి 1552 దాఁక శ్రీ వేంకటేశ్వరస్వామివారికిని, నింక నితరస్థలములలోని దేవరలకును నైవేద్యప్రసాదోత్సవాది కైంకర్యములకై పదునాల్గు గ్రామముల నర్పించిరి. ఆ గ్రామములు

---

1 ఇది తిరుపతి ఓరియంటల్ యిన్‌స్టిట్యూట్ లైబ్రరిలో నున్నది.

2. ఈతఁడు పెరియ తిరుమలాచార్యుఁడని, పెద తిరుమలయ్య యని, తిరుమలార్యదేశికుఁడని పలుదెఱఁగుల బేర్కొనఁబడుచున్నాఁడు.

3. తాళ్ళపాకవారి చరిత్రాంశములు శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ప్రకటించిన తిరుపతి దేవస్థానము ఎపిగ్రాఫికల్ రిపోర్ట్ (పేజీలు 382 –391) ననుసరించి వ్రాసినవి.

అచ్యుతరాయఁడు, బుక్కయ తిమ్మరాజు మొదలగువారు తనకు దానము చేసినవి. అంతేకాక యేన్నోవేల పణములను గూడ నాయా పుణ్యకార్యములకై వారర్పించిరి. తిరుమలమీఁదఁ దమ సంకీర్తనములు చెక్కించిన రాగిరేకులు దాఁచియుంచిన సంకీర్తనభాండారము రక్షించుటకై, యర్చించుటకై కూడ గొప్పదానములు చేసిరి. తండ్రిగారును, దామును రచించిన సంకీర్తనములను స్వామివారి సన్నిధిని బ్రతిదినముఁ బాడుటకై యిద్దరు వైష్ణవుల నియోగించిరి. స్వామివారి కోనేటిని, గోపురములను, మంటపములను బెక్కింటిని జక్కఁ బఱిపించిరి. కోనేటినడుమ నీరాడుమంటపమును గట్టించిరి. ఇట్లెన్నో పుణ్యకార్యముల జరిపిరి. తండ్రివలె నీతఁడు గూడఁ బూర్ణపురుషాయుష జీవితము గల్గిన ధన్యచరిత్రుఁడయి యుండును. ఏలనఁగా నీతని తండ్రి క్రీ. 1408 నుండి క్రీ. 1503 దాఁక జీవించెను. అన్నమార్యున కీతఁ డఱువదవ యేఁట జన్మించినాఁడనుకొన్నను నీతని జన్మకాలము క్రీ. 1468 అగును. అప్పటినుండి క్రీ. 1552 తర్వాతిదాఁక నీతఁడు జీవించినాఁడనఁగా నెనుబదియేండ్లించుమించుగా జీవించినవాఁడగును. ఈతనికి సాతానివైష్ణవు లిద్దరు శిష్యులుండెడివారఁట! వారుకూడ నీతని వలె స్వామికిఁ గొన్ని కైంకర్యములు జరిపిరి. ఈతని కుమారుఁడగు చిన్నన్న (చిన తిరువేంగళనాథుఁడు) రచించిన యన్నమాచార్యచరిత్రమున నన్నమాచార్యుఁడు వైష్ణవుఁడయినట్లున్నది.

ఈతనికిఁగుమాళ్ళు, 1 చినతిరుమలాచార్యుఁడు 2 అన్నయ, 3 పెద తిరువేంగళనాథుఁడు, 4 తిరువేంగళనాథుఁడు (చిన్నన్న), 5 కోనేటి తిరువేంగళనాథుఁడు.

ఇందు నాల్గవ కుమారుఁడయిన తిరువేంగళనాథుఁడు రచించిన యష్టమహిషీకల్యాణమున వీరి వంశవృక్షమిట్లున్నది.



1. మూలపురుషుఁడు శృంగార సంకీర్తనాదిగ్రంథకర్త.
2. వేంకటేశ్వరోదాహరణాది బహుగ్రంథకర్త. వేంకటేశ్వరవచనకర్త కూడ.
3. సంకీర్తనలక్షణాది గ్రంథకర్త.
4. అష్టమహిషీకల్యాణ పరమయోగివిలాసోషాపరిణ యాన్నమాచార్య చరిత్ర గ్రంథకర్త.
5. ఆంధ్రామరుకామరవ్యాఖ్యా కావ్యప్రకాశవ్యాఖ్యాకర్త.
6. శకుంతలాపరిణయము, శ్రీపాదరేణుమాహాత్మ్యము ఇతని కృతులు.

ఈ తాళ్ళపాకవారికి రేవణూరివారు జామాతృ వంశమువారు. రేవణూరి వేంకటకవి తన శకుంతలాపరిణయమున నిట్లు చెప్పినాఁడు.

శ్రీవత్సాన్వయ రేవణూరికులజున్ శ్రీపాదరేణుప్రభా
సౌవర్ణస్ఫుట కావ్యకల్పక కవిన్ సంకీర్తనాచార్యపు
త్రీవంశోత్తము నందవైదికబుధాతిప్రోక్తవృత్తిస్వయం
భావుం దిర్మల కొండయార్యసుతు శుంభద్వేంకటాభిఖ్యునిన్.

శ్రీ వేంకటరమణునకు....సమర్పణంబుగా సమర్పించెద నిహపర సాధనములకు నింక నేమి కొదవ, యదియునుంగాక యమ్మహాదేవుండు మదీయమాతామహవంశ శిఖారత్నంబగు నన్నయాచార్యునకు జామాతరుం డనిపించుకొని భవదీయసంకీర్తనంబు లాలించిన కర్ణంబుల నితర సంకీర్తనంబు లాలించనని ప్రతిజ్ఞఁగావించెఁ దత్తనూజుండగు పెద్దతిరుమలాచార్య బిడౌజకు నకుఁ ద్రిపురుషపర్యంతముగాఁబ్రత్యక్షంబును, సప్తపురుష పర్యంతముగా మోక్షంబు నొసంగెదనని వరమిచ్చె; సచ్చరిత్రులగు తదీయపౌత్రులకుఁ జినతిరుమల దీక్షితాన్నయాచార్య తిరువేంగళనాథ కోనేటి తిరువేంగళనాథ వెంగళార్యులకు విచిత్రముక్తాతపత్ర రత్నకిరీట ముద్రికా ప్రచండమణిమండిత మకరకుండలోత్కరాహః కరదీపికా పాదుకాది బహూకరణంబులఁ గరుణించె; విశేషించియు నత్తిరువేంగళనాథుండు సంకీర్తనంబుఁ బాడిన నాదం దొడంగె నేతత్ప్రకారంబున నమ్మహామహునకుఁ బాండవసహాయుండైన శ్రీకృష్ణదేవునింబలె సహాయుండై.......... ధన్యుఁడ నయ్యెద నని నిశ్చయించి"

ఈ గ్రంథమునుబట్టి చూడఁగా నీ వేంకటాచార్యకవి సంకీర్తనాచార్యుఁడగు నన్నమాచార్యునికి దౌహిత్ర వంశములోనివాఁడని యేర్పడును.

రచనమును జాలఁదర్వాతిదిగానే యున్నది. కాని యాతనిదే యగు [1] శ్రీపాద రేణుమాహాత్మ్యముగద్య మాతఁడు సంకీర్తనాచార్యుని మనుమఁడే యనఁదగిన ట్లున్నది :–

'ఇది సంకీర్తనాచార్య దౌహిత్ర రేవణూరి తిరుమలకొండ యాచార్య పుత్ర వేంకటాచార్య ప్రణీతంబైన శ్రీపాదరేణుప్రభావంబను నిస్పహాయ కావ్యంబునందు రంభాపురందరసంవాదంబనునది తృతీయోల్లాసము.' ఇది తప్పయి యుండునేమో ! 'సంకీర్తనాచార్య దౌహిత్ర వంశ్య' అని యుండఁ దగునేమో !

గ్రంథముద్రణము

ఇప్పటి కిరువది యేండ్ల క్రిందట నే నీ వేంకటేశ్వర వచనములను బ్రాచ్యలిఖిత పుస్తకశాలలోని ప్రతులఁబట్టి యుద్ధరించి 'భారతి' పత్రికలోఁ బ్రకటింపఁబూనితిని. అప్పటికి తాళ్ళపాకవారు రచించినవయి యుండునని నే ననుమానించితినే కాని దాని కాధారమేదియు నాకు గానరాలేదు. అప్పుడు ప్రకటించుటలో నే నిట్లు వ్రాసితిని.

"ఇవి తాళ్ళపాకవారు రచించినవై యుండవలెను. వీనిలో విష్ణుభక్తి యూటలూరుచున్నది. ప్రాచీనములలో నింత రసవంతము, భక్తిభరితము నగు వచనరచన యసాధారణముగా నున్నది. కృష్ణమాచార్య సంకీర్తనములు శంకరవచనములు మొదలగునవి వ్రేళ్ళలెక్కకుఁ జాలినవి, యిట్టివి, కొన్ని యున్నవి. వీనినెల్లఁగ్రమముగా వెల్లడింపఁ గోరికపడుచున్నాను. సహృదయు లివి చవిగొందురుగాక!" (భారతి – క్రోధన వైశాఖము)

'భారతి'లో నట్లు ప్రకటించుచుండుటఁజూచిన సహృదయులు గొందఱు నన్నా వచనములెల్ల గ్రంథముగా ముద్రింపఁగోరిరి. అట్లే నేను వానిని మదరాసులో 'నాంధ్రపత్రిక ముద్రణాలయము' ననే ముద్రింపఁ బూనితిని. నూటయిర్వది వచనములు 80 పుటలు ముద్రితములయ్యెను. అప్పుడు తిరుపతి శ్రీ వేంకటేశ్వర దేవస్థానోద్యోగులొకరిద్దఱు నా మిత్రు లా గ్రంథము తిరుపతి దేవస్థానమువారు ముద్రించుచుండుట నా కెఱింగించిరి. రాగిరేకులపైఁ గవికాలమునఁ జెక్కఁబడియున్న యా వచనముల నుద్ధరించి

1 ఇది తిరుపతి ప్రాచ్యపరిశోధనశాల లైబ్రరీలో నున్నది. కృత్యవతరణిక లేదు.

దేవస్థానమువారు ముద్రించునప్పుడవి మిక్కిలి నిర్దుష్టముగా నుండగలవని, వారు ముద్రించుచుండఁగానే నాత్రపడి ముద్రించుట వ్యర్థమని వెఱచి యా గ్రంథము బయల్పడిన తర్వాత నా ప్రకటన విషయమే యోజించుకొన వచ్చునని యుపేక్షించితిని. అచ్చుపడిన యా ఫారములెల్ల నాంధ్రపత్రికా కార్యాలయము ననే యుండెను. 1935 తర్వాతనే తిరుపతి దేవస్థానమువారి ముద్రణము ముగిసెను. అటు తర్వాతఁ గొన్నాళ్ళకుఁ జూతునుగదా ! అందు నలువదియేడు వచనములే ముద్రితములయి యుండెను. మఱిమూఁడేండ్లకు నేను తిరుపతివచ్చి పరిశీలింపఁగా తర్వాతి వచనములయునికి యెఱుఁగ రాలేదు. అవి యహోబిలముననో శ్రీరంగముననో యడఁగి యుండఁబోలును! ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోను, దంజావూరి సరస్వతీభాండాగారములోను నున్న వచనములు సమకూర్చికొని చూడఁగా 175 వచనములున్నవి. ఇంకఁగొన్ని లోపించియు నుండఁబోలును ! నేను రెండు లైబ్రరీలలోని వచనములను సమకూర్చుకొని యుంటిని. తిరుపతి దేవస్థానముద్రణము తప్పులతో నసమగ్రముగానే యుండెను. ఈ విషయము వివరించి తెలుపఁగా నప్పుడు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య విద్యాలయమున డైరెక్టరుగా నున్న సరస్వతీ హృదయాలంకారులు శ్రీమాన్ యమ్. కృష్ణమాచార్యులుగారు నా ముద్రణము పూరింపఁగోరిరి. వెదకఁగా మదరాసులోని యచ్చుఫారములెట్లో యెక్కడో చెల్లిపోయినట్లు తెలిసెను. నా దగ్గఱ మిగిలియున్న యచ్చుఫారములబట్టి 120 వచనముల మరలనిపుడు ముద్రించుట, కడమయముద్రితములఁ బూరించుట, జరపితిని. ఇట్లు దీనిని వెల్లడింపఁజూచునాఁటికి శ్రీకృష్ణమా చార్యులుగారు కీర్తిశేషులయిరి. శ్రీమాన్ పరవస్తు వేంకట రామానుజస్వామి యమ్.ఏ. డైరెక్టరుగారు దీని ముద్రణ యత్నము సాగించిరి. ఇట్లు శ్రీస్వామి వారు స్తుతిగ్రంథము శ్రీ స్వామివారి యాస్థానకవి రచించినది. యీనాఁటి కిట్లు శ్రీస్వామివారి యాస్థాని లోనే ప్రకటితమగుట సంఘటిల్లినది. ఆనాఁటి తాళ్ళపాక వంశమువారు మహనీయులు. వారి రచనము లింకనెన్నో ప్రకటితములు గావలసియున్నవి. వారు శ్రీస్వామి వారికెన్నో కైంకర్యముల జరపిరి. తన భక్తులగు నట్టి యా మహనీయుల సత్కృతులను శ్రీస్వామివారు సంరక్షించుకొందురనియే యాశించుచున్నాఁడను.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా
పరిశోధనాలయము, వేటూరి ప్రభాకరశాస్త్రి
తిరుపతి., తారణ ఫాల్గుణము.

శ్రీ వేంకటేశ్వరవచనములు

1

శ్రీవేంకటగిరిదేవా! నా దేహంబు నీ వుండెడి నిత్యనివాసంబు; నా జ్ఞానవిజ్ఞానంబులు నీ యుభయపార్శ్వంబుల దీపంబులు; నా ముకుఁజెఱమలయూర్పులు నీ యిరుదెసలంబట్టెడి యాలవట్టంబులు; నా మనోరాగంబు నీకుఁజెంద్రకావి వలువ; నీకు మ్రొక్క నెత్తిన నా చేతులు రెండును మకరతోరణంబులు; నా భక్తియె నీకు సింహాసనంబు; నా మేనం బొడమిన పులకలు నీకు గుదులుగ్రుచ్చి యర్పించిన పూదండలు; నే నిన్ను నుతియించిన నుతుల యక్షరరవంబులు నీకు భేరీభాంకార ఘంటా నినాదంబులు; నా పుణ్య పరిపాకంబులు నీకు నైవేద్య తాంబూలాదులు; మదీయ నిత్యసేవాసమయ నిరీక్షణంబు నీకు సర్వాంగంబుల నలందిన తట్టు పునుంగు; నా సాత్త్వికగుణంబు నీకు ధూపపరిమళంబు; నీవు దేవుండవు; నే నర్చకుండను. ఈ రీతి నిత్యోత్సవంబు నాయందు నవధరింపవే శ్రీ వేంకటేశ్వరా! మఱియును;

2

నందకాయుధధరా! నీ యాయుధంబులకు జయజయ; నీ వాహనంబులకు శుభమస్తు; నీ పరివారంబులకు క్షేమంబు గోరెద; నీ కళ్యాణగుణంబులకు నిరంతరాభివృద్ధియగుఁగాక; నీ సత్త్వంబులకు శోభనపరంపరావాప్తి యెసగవలయు; నీ దేవులకు మంగళ మహాశ్రీలగు; నీ మహిమకు ననంతవివిధార్చనము; నీ భుజాబలమునకు నపరిమిత స్తోత్రము; నీ చక్కఁదనంబునకుఁ బుష్పాంజలి; నీ యుదారతకు శరణంబు; నీ శ్రీవత్సకౌస్తుభాది చిహ్నంబులకు సంతతప్రార్థన; నీ పాదంబులకు సాష్టాంగ నమస్కారంబు చేసెద. ఏమి నిమిత్తంబు చేసెదవంటివా? నాలుగు యుగంబుల ధర్మంబులు, సకలజంతువుల పరిణామంబులు, కమలాసనాదిదేవతల బ్రదుకులు, నీ మూలంబునఁగావున నీవు శుభంబున నుండుటే మేలు; శ్రీ వేంకటేశ్వరా!

3

అలమేలుమంగాపతీ! నిన్ను వెదకి వెదకి కనియెదమన నే మెంతవారము? నీ సుద్దులు పెద్దల నడిగి వైకుంఠవాసుండవనఁగా నీ యూరెఱింగితిమి. విష్ణువాసుదేవ నారాయణ నామంబులు విని నీ పేరెఱింగితిమి. శరణాగత రక్షకత్వము నీకుఁగలదనఁగా నీ గుణంబెఱిఁగితిమి. నీలమేఘశ్యామ లక్షణంబులు గలుగంగా నీ వర్ణంబెఱింగితిమి. శ్రీవత్సకౌస్తుభాది చిహ్నంబులు చూచి నీ గుఱుతెఱింగితిమి. శేషాచలనివాసంబుకతన నీ గోత్రంబెఱింగితిమి. పురుషోత్తమఖ్యాతిచేత నీ పౌరుషంబెఱింగితిమి. వేణునాదవినోదివని చెప్పంగా నీ వంశంబెఱింగితిమి.మత్స్య కూర్మ వరాహ నారసింహ వామనాద్య వతారంబులు విని నీ పుట్టువెఱింగితిమి. నీకు మ్రొక్కెదము. అన్నింట నధికుండవని నిన్నుంగొలిచితిమి. ఇంక నీ మహిమలంగొనియాడెదము. పాడెదము. శ్రీ వేంకటేశ్వరా!

4

క్షీరాబ్ధిశయనా! కమలంబు సూర్యునికెదురు సూచినయట్లు నా హృదయ పద్మంబు రవిమండలమధ్యవర్తియైన నీ కెదురు చూచుచున్నది. కుముదంబులు చంద్రోదయంబపేక్షించినట్లు నా కన్నుంగలువలు భవద్దివ్యముఖచంద్రదర్శనం బపేక్షించుచున్నవి. మయూరంబులు మేఘాగమనంబునకుంజెలంగినట్లు నా మనోమయూరంబు నీలమేఘవర్ణంబైన నీ తిరుమేను దలంచి యానందించు చున్నది. ముత్యపుఁజిప్పలు స్వాతిచినుకులకు నోరు దెఱచినట్లు నా వదనశుక్తి మీ పాదతీర్థంబునకు వికసించుచున్నది. సర్పంబులు గానంబులు గోరి చొక్కి పడగలెత్తి యాడినట్లు నా వీనులు నీ కథల నాలకించుచున్నవి. నీవు పరాత్పరమూర్తివి; నేను ప్రకృతిసంబంధంబులైన యంగంబులు ధరియించినవాఁడ; నది యెట్లు గూడు ననవలదు. ఆ ప్రకృతికి నీవు చైతన్యమవు. ఈ చుట్టఱికము తొల్లి కలుగఁగానే దీని కీ యనురాగము గలిగియున్నది. కన్నెఱుఁగకున్నఁ గదుపెఱుంగు నండ్రు లోకులు. ఇంతియకాని నిన్ను నెఱుంగ నే మెంతటివారము. నా యాస విన్నవించితి నింతియ కాని నిన్ను నేఁగక్కసించినవాఁడఁ గాను జుమీ. శ్రీ వేంకటేశ్వరా!

5

దామోదరా! సకలతీర్థంబులు మీ కోనేటనే యాడితి. సకల తిరుపతుల విగ్రహంబులు మీ మూర్తియందే సేవించితి. సకలదానంబులు మీకు నొక కాసు కానుకవెట్టినయందె ఫలియించె. విహిత యజ్ఞాదికర్మంబులు మీ కైంకర్యంబుననే తీర్చితి. జపంబులన్ని మీ తిరుమంత్రమందె జపించితి. వేదపాఠంబులు మీ సంకీర్తమందె యభ్యసించితి. తపములు వైష్ణవాచారముల లభించె, నింక నేమిటంగడమలేదు. నా హృదయకమలంబున నీవున్నాఁడవు. నా మనంబు శోధింపం బనిలేదు. నాణెంబైన టంకంబునకు వట్టంబు గొనరాదు. భండారంబునంబడిన లెక్కకుఁ బరులు చాడిచెప్పంజోటులేదు. ఆ రీతినే నీ సుముద్ర ధరించినవాఁడ, నగుటంజేసి, యే దోషంబులు నన్నుఁ బైకొనకుండఁజేసి, రక్షింపవే శ్రీ వేంకటేశ్వరా!

6

హృషీకేశా! యేను బెక్కు జన్మంబులెత్తి యలసి పూర్వజాతిస్మరత్వంబు గలిగి యీ పుట్టువున నిన్నుంగొలువవలయునని తలంచిన యుద్యోగంబునఁగాదు; శృంగారంబునకు నొసలఁదిరుమణి వెట్టితి. మఱియు నా యుబ్బరితనంబున నీ సంకీర్తనలు నేర్చుకొంటి, నీ రీతి ప్రయత్నంబు లేక ఘుణాక్షర న్యాయంబున నా చేఁతలు నీ దాస్యంబునకెక్కె. నీవు చక్కని మూర్తివిగావున నీ విగ్రహంబు నా యింటిలోపల నిడికొని నా వేడుకలకు దేవరంగాఁగొల్చితిని. నా మీఁద దయదలంచి యకారణబంధుండవై యొక్కొక్క యుపాయంబున నన్ను నీడేర్చుకొఱకు నీ మీఁదభక్తి పుట్టించితివి. నా జడత్వంబును నీ సర్వజ్ఞత్వంబును నిందులోనే చూపితివి. భళిభళీ శ్రీ వేంకటేశ్వరా!

7

కమలనాభా! మోక్షంబు గోరెడువారికి నీపై నిరంతర ధ్యానంబు గారణంబు. ఈ రీతి ధ్యానంబు సేయుటకు నిర్మలంబైన మనంబు గారణంబు. నిర్మలంబైన మనంబునకుఁ బంచేంద్రియ నిగ్రహంబు గారణంబు. పంచేంద్రియనిగ్రహంబు నకు శరీర శోషణంబైన తపంబు గారణంబు. తపంబునకు బాహ్యప్రపంచ

విముక్తియైన వైరాగ్యంబు గారణంబు. వైరాగ్యంబునకు సంగరాహిత్యంబు గారణంబు. ఇన్ని మార్గంబులు నీ కలియుగంబున నెవ్వరికి సిద్ధించును? నీకు శరణుసొచ్చి నామంబులు పఠియించిన నీవే దయదలంచెదవుగాక. శ్రీ వేంకటేశ్వరా!

8

గోవిందా! పుట్టిన యపుడే యే యే జాతి పక్షుల కాయా విధంబులం గూఁతలు వెట్ట నేర్పినవారెవ్వరు? మృగంబులు గర్భంబులలో నుండి వెడలి తల్లుల చన్నులంగుడువఁ గఱంగుటెట్లు? పశువులు కసువుమెసంగెడి చందంబెట్టిది? నానావిధ వృక్షంబులు మొలచినయపుడు తమ తమ యాకారములు పుష్పదళములు గలిగి తతికాలంబెఱింగి చెలంగుటెట్లు? అన్నియును నీ యాజ్ఞారూపంబులైన ప్రకృతిభావంబులె. మేమును నీ రీతినే నీ కల్పితములైన దేహంబులు మోచుచున్నవారము; మా నేర్పునేరములు, మా స్వభావంబులు, మా సంసారకృత్యంబులు నీ కల్పితములైన, నీ ప్రభావంబులే. మమ్ముఁ దప్పులెంచఁబనిలేదు. శ్రీ వేంకటేశ్వరా!

9

పరమాత్మా ! ప్రపన్నుండైన యతండా జీవితకాలంబు మీ లీలావిభూతితో మీ కళ్యాణగుణంబులనుభవించి భూమి పావనంబుగా సంచరించి, అర్చిరాది గమనంబునం బరమపదంబునం బొందెడునాఁడు నాభినుండి ప్రణవభూరి నినాదంబు చెలంగ నీ తోడంగూడి నిన్ను సేవించుకొని, హృదయగుహనుండి వెడలి, వాగాదీంద్రియంబులను మనంబుతోఁగూర్చి, మనంబుఁ బ్రాణంబులఁ దగిలించి, ప్రాణంబుల జీవునింగలపి, జీవుండైన తన్నుఁ బంచతన్మాత్రల నంటించి, యా జీవప్రకృతి నీ యందుం బాదుకొల్పి నీ యాధారంబున సుషుమ్నానాడి భేదించి, మూర్ధన్యనాడియైన బ్రహ్మరంధ్రంబున సూర్యకిరణంబులతో నిర్గమించి యగ్న్యహశ్శుక్లపక్షోదగయనాబ్దాభిమాని దేవత లనియెడి యాతివాహిక గణంబు లొండొకరిచేతి కందీయఁగా వాయువుఁ బ్రవేశించి సూర్యమండలంబు సొచ్చి, చంద్రమండలంబు సొచ్చి మెఱుంగైయున్న

విద్యుత్పురుషుని సహాయంబున వరుణేంద్ర బ్రహ్మలోకంబులు గడచి సువర్ణబ్రహ్మాండ కటాహంబు భేదించి పృథివ్యప్తేజోవాయ్వాకాశాహంకార మహత్తులనియెడి సప్తావరణంబులనుందాటి మూలప్రకృతి మీఱి విరజానది యుత్తరించి తేజోరాశియైన బ్రహ్మంబనియెడు నీ స్వరూపంబుం బ్రవేశించునట, ఎటువంటి క్రొత్తైన కథ వింటిమి. అహహా! శ్రీ వేంకటేశ్వరా!

10

మురహరా! ఆర్తులకు నభయంకరుండవు. సంసార సర్పదష్టులఁదేల్ప గరుడధ్వజుండవు. అజ్ఞానతిమిరస్థులకు సూర్యనారాయణుండవు. పాపమను మొసలిచేతఁబట్టువడిన వారి బాధలు మాన్పఁజక్రాయుధుండవు. దారిద్ర్య దావానలంబార్ప గంగాజనకుండవు. దేవతలపాలింటి కల్పవృక్షంబవైన యశ్వత్థనారాయణుండవు. యోగీశ్వరులపాలికి చింతామణివైన కౌస్తుభ వక్షుండవు. భక్తజనపాలకలక్ష్మీనాథుండవు. నీ ప్రతాపంబేమని వర్ణింపవచ్చు? నీ కల్యాణగుణంబులెన్నియని లెక్కపెట్టవచ్చు? నీ మహిమ లేమని తెలియవచ్చు? మేము మా నోరికొలందిఁగొంత చింతించెదము. చిత్తగింపవే శ్రీ వేంకటేశ్వరా!

11

గరుడధ్వజా! యేమని చెప్పెడిది నీ ప్రభావంబు? నీ నాభికమలంబునం బుట్టెనట; విరించి మీ మహిమం దెలియ శక్తుండుగాఁడట! నానా వేదంబుల నీ మహిమలు చెప్పునట; నీ మూర్తికడగుఱుతుం గానవట; రవిచంద్రులు నీ నయనంబులట; నీ యపార తేజోమహిమంబు లెఱుంగలేరట! ఇంద్రాది దేవతలు నీ యాజ్ఞాధారులట; యొక్కొక్కమాఱును నీతోఁ గినిసి నిన్నెదిరించ లేక నీ శరణు వేఁడుకొందురట; పంచమహాభూతంబులు నీ ప్రకృతి గుణంబులట; నీ స్వభావంబులట్టివి యని తెలుపఁజాలవట! సముద్రంబులు నీ పాన్పట; నీ గుణంబుల లోఁతెఱుంగవట! మునులు భవదీయ స్వరూప సూచకవాదులట; నీ మాయ దాఁటనోపరట! చరాచర జగత్తు నీ సృష్టియట; నిన్నుం జూపి చెప్పనోపదట! నా శక్తి యెంత? నేనెంత? నే నీ శ్రీపాదంబులు

గతియని యుండఁగా నీవే దయదలంచెదవుగాక! శ్రీ వేంకటేశ్వరా!

12

గోపికావల్లభా! నేఁదలపోయంగా ఫలియించిన మేలు, మఱియు నే వెదకంగా దొరకెడు పదార్థంబులు, నేఁగోరంగా వచ్చు లాభంబు, నేఁజదువంగాఁ దెలిసినయర్థంబు, నే గడియించుకొనంగా సిద్ధించిన ధనంబు, నా నేర్పువలనఁ దెచ్చుకొనియెడి సుఖంబు, నా చేతులఁజేసిన పుణ్యంబు, నా తపోబలిమిం గైకొనులోకంబు, నా పురాకృతఫలంబు, నా మనోరథంబు, నీవే. నా నుదుట బ్రహ్మదేవుండు వ్రాసినవ్రాలు, నే జన్మించిన జన్మకారణము, నా యంతరంగంబులో నున్న మూర్తి, నీవే సుమీ! నా కలిమి విన్నవించితి. శ్రీ వేంకటేశ్వరా!

13

పీతాంబరధరా! నీ సాలోక్యంబు నాకు నీ భూలోకంబుననే సిద్ధించియున్నది; సామీప్యంబు హృదయకమలంబున లభియించె; సారూప్యంబు నీ ధ్యానంబున నిలిచినది; సాయుజ్యంబు నిద్రాసమయంబునంగలదు; నీకు శరణుసొచ్చినం బాపవిముక్తి సేతునంటివి గావున జీవన్ముక్తి సమకూడె. నీవు నన్నెడబాయ కుండుటంజేసి సదానందానుభవంబు గలిగె. నీపై భక్తియొసంగినందువలన జన్మ శుద్ధియయ్యె. నాలుకకు మీ నామామృతం బొసగినకతన నమృతపానంబు దొరకె. మఱియు నీ దాసులసంగతిని యోగము నలవడె. ఇంక నిన్నడిగెడిదేమి? అన్నిటం గృతార్థుఁడనైతిని. శ్రీ వేంకటేశ్వరా!

14

శార్ఙ్గాయుధధరా! నిన్ను భజించి యేమియైననుం గోరి యడిగెద నంటినేని నీకంటె నుత్తమవస్తువులెక్కడ నున్నవి? నీయందే మూర్తిత్రయంబును, ద్వాదశాదిత్యులును, నేకాదశరుద్రులును, నవబ్రహ్మలును, నేకోనపంచాశ న్మరుత్తులును, వసువులును, దిక్పాలకులును, మునులును, సిద్ధగంధర్వపదంబు లును; అణిమాద్యష్టైశ్వర్యంబులును, చతుర్దశభువనంబులును, కులాచలదిగ్గజ మహానాగములును, సింధుగంగానదీ ముఖ్యతీర్థంబులును, సకల

సామ్రాజ్యంబులును నున్నవి. పరమపదంబున్నది. నీవు గలచోట నన్నియుం గలవు. నిన్ను నాత్మందలంచిన నాకు సకలసౌఖ్యంబులుం గలవు. శ్రీ వేంకటేశ్వరా!

15

నీలమేఘశ్యామలా! అణువులకు నణువవు; మహత్తులకు మహనీయుండవు; ప్రకృతిపురుషులకుం బరమాత్మవు; మూఁడు మూర్తులకు మూలమవు; చరాచరంబులకు సాక్షివి; ఊహించిచూచిన నొక్కండవే దేవుండవు; ఏర్పఱిచి చూచిన ననంతుండవు; తలఁచిన నభేద్యతత్వుడుఁడవు; విచారించిన నిర్గుణుండవు; వినం గణంగినఁ గల్యాణగుణుండవు; కన్నులంజూచిన సాకారమవు; స్వరూపవ్యాప్తిని నిరవద్యుండవు; స్వాతంత్ర్యంబున జీవచైతన్య మవు; భక్తిపరులకుఁ బ్రసన్నుండవు; తుది విచారించిన జగత్కర్తవు; ఇట్టి నీ గుఱుతు తెలియంగ వచ్చునయ్యా! పెక్కురూపంబులు గలవాఁడవు; పెక్కు నామంబులు గలవాఁడవు; వేదవాదులకును నగోచరుండవు; నిన్నుం జేపట్టి కొలువనేరము, నీవే కరుణించి కావవే శ్రీ వేంకటేశ్వరా!

16

కోనేటినిలయా! విరజానదిపర్యంతంబును విడువని ప్రాకృతదేహంబులు మోచిన జీవులు తమతమ సామర్థ్యంబుల జీవన్ముక్తులమయ్యెద మన నెట్లువచ్చు? ఇట్టి ప్రకృతి సంబంధంబున వచ్చిన యింద్రియంబులేల జయింపనిచ్చు? అందులకుఁ గారణంబైన మనస్సు నే రీతి నిర్మలంబగును? తన్మూలంబునం జేసినకర్మంబులేల శాంతింబొందు? నయిన నౌఁగాకేమి! ఎందులకు నేలా భయంబునొంద? నిందులకుఁగారణంబిన్నివిధంబులం బ్రవర్తిల్లెడు నీ మాయ. నిన్నుంగొల్చిన వారికి నీ మాయ నుపసంహరింప నేర్తువు. తాళముచే యొక వంక నుండఁగాఁ దలుపుతోఁబెనంగఁగా నేల? ఇది యెఱింగికదా మున్నిట్టి వారలు కొందఱు నీ దాసులయి నిన్నుం బొగడియు, నీకు శరణుసొచ్చియును మహాత్ములయిరి. ఏము నదియె యుపాయంబని యెఱుంగుకొంటిమి. శ్రీ వేంకటేశ్వరా!

17

అప్రమేయా! భువినెన్ని మాయోపాయంబులు గలిగిన నీ దాస్యమునకు నీడురావు. చేయవచ్చు బహువిధ పుణ్యంబులు; నీవు దేవుండవని తెలియు విజ్ఞానమునకు సరిగావు. నేరందగు యోగాభ్యాసంబులు; ఇవి నీ భక్తితో సరిగావు. ఉండుఁగాకేమి పెద్దతనంబులు కొందఱికిని; నీ శరణాగత ధర్మంబుతోఁబురుణింపరావు. వెలయుచున్నవి పెక్కు శబ్దంబులు; నీ తిరుమంత్రస్తోత్రంబువలె ఫలంబులొసగవు. ఇది యెఱుంగుదు. ఇంక నానా విద్యలు నీ సంకీర్తన విద్యంబోలవు. నిగుడెదరు ముప్పది మూఁడు గోట్ల దేవతలు; నీవంటి బలవంతులు గారు. నీవిచ్చు వరంబులకు హానిలేదు. నిన్నుఁగొలిచినవారి పదవులు ధ్రువపట్టములు. ఇది లోకదృష్టాంతము. నీ చరిత్రలు గణుతింప నలవిగావు. మఱియు నితర మార్గంబు లెండమావుల నీళ్లవంటివి; మిణుంగురుఁబురువుల ప్రకాశము వంటివి; కాకిబేగడల సొమ్ముంవంటివి; కప్పచిప్పలవెండి వంటివి. ఇట్టి భ్రమలం బొరలక నీ శ్రీపాదంబులే గతియని యున్నవారలు ధన్యులు. శ్రీ వేంకటేశ్వరా!

18

నారాయణా! పుట్టువులు హేయమూల మనంగా నూరక రోయుటేకాని యవి యెవ్వరికి నపకారకంబులని తెలియంబడవు. కర్మంబులు ఫలంబు లొసగునని చేయుటకాని యవి మాతో నొడంబడుటలేదు. సంసారభారంబున నూరక జడియుటకాని యది యెవ్వరికి నసహ్యంబని తోఁపదు. మోక్షంబు మంచిదనంగా నాసపడి వెదకుట కాని యది తొల్లి యనుభవించి చూచినదిగాదు. నీవు సర్వేశ్వరుండవనఁగా విని మ్రొక్కుటగాని నిన్ను నింతటి వాఁడవని తెలియనలవిగాదు. ఏమని విన్నవించెద? నా జ్ఞానంబనఁగా నెట్టిది? తొలి జన్మంబున నా మీఁదఁగటాక్షంబేపాటి పెట్టితివో యీ జన్మంబున నీ దాసుండంగాఁగలిగె. శ్రీ వేంకటేశ్వరా!

19

సకలలోకారాధ్యా! అన్నిచోటులనుండుదువు గావున మేమెచ్చట నుండి సంచరించి వచ్చినను నీయొద్ద నున్నవారమే; నీవు సకల లోకనాథుండవు

గావున నిన్నుం గొలిచిన వారమే; కన్నుల యెదుట నున్నరూపంబులెల్ల నీ శరీరంబు గావున నిన్ను సదా సేవించిన వారమే; మాలో నెప్పుడుఁ బాయకుండుదువు గావున నిన్నుందలంచిన వారమే. నేఁగొనియెడి యాహారంబులు నీవిచ్చినవి గావున నీ ప్రసాదోజ్జీవనమే; నేఁజేయుచున్న కృషిగోరక్షణ వాణిజ్యాదులు నీ లీలకుపయోగంబులు గావున నవి నీ పూజలే; నన్ను నీవు పుట్టించినవాడవు గావున నీ బాము నీవల్ల నీడేఱెడిదె. ఈ యర్థంబు మఱవ కాదరింపుమయ్యా! నే నెప్పుడు నీ సూత్రంబున నాడెడు బొమ్మను; నా విన్నపములు పదివేలు విన్నపములుగా విననవధరించి నన్నుం గరుణింపవే శ్రీ వేంకటేశ్వరా!

20

హయగ్రీవా! కేశవ, నారాయణ, మాధవ, గోవింద, విష్ణు, మధుసూదన, త్రివిక్రమ, వామన, శ్రీధర, హృషీకేశ, పద్మనాభ, దామోదర, సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, పురుషోత్తమ, అధోక్షజ, నారసింహ, అచ్యుత, జనార్దన, ఉపేంద్ర, హరి, శ్రీకృష్ణయనియెడి చతుర్వింశతి నామంబులు పాపహరంబులు; పుణ్యంబులకునికిపట్లు; నుతించువారికి వచన భూషణములు; కోరినవారికిఁగొంగుబంగారంబులు; జ్ఞానులకు సిద్ధ మంత్రంబులు; ఇహపరంబులకుఁగామధేను కల్పవృక్ష చింతామణులివి; శ్రీ వేంకటేశ్వరా!

21

ప్రహ్లాదవరదా! బదరికాశ్రమ నైమిశారణ్య సాలగ్రామపర్వతాయోధ్యా ప్రయాగ ద్వారావతీ పురుషోత్తమ సింహాచల శ్రీకూర్మాహోబల సేతు కుంభఘోణ తామ్రపర్ణీ శ్రీరంగ కాంచీ నారాయణ గిరులు మొదలగు పుణ్యక్షేత్రంబులు, నీ నూటయెనిమిది తిరుపతులు సేవించిన ఫలము నీ దాసులంగని యొకసారి నమస్కారంబు చేసినం బ్రసన్నుండవై యిత్తువు. నాలుగువేదంబులు, ఆఱు శాస్త్రంబులు, అష్టాదశపురాణంబులు చదివిన పుణ్యంబు 'నారాయణా' యనిన నొసగుదువు. అగ్నిష్టో మాతిరాత్ర వాజపేయ ద్వాదశాహ పౌండరీకాది

క్రతువులు గావించిన సుకృతంబు నీ శ్రీపాదంబులపై నొక తులసీదళంబు సమర్పించినఁ గలిగింతువు. తులాభార హిరణ్య గర్భాది దానంబుల ఫలంబు మీ దాసుల మనిన మాత్రంబ ప్రసాదింతువు. నీవు భక్తిసులభుండవు గావున నీ శరణార్థులకుం బ్రయాసంబులు లేవు;శ్రీ వేంకటేశ్వరా!

22

శ్రీజనార్దనా! శ్రీభూమీ నీళాసమేతా! శంఖచక్ర గదా ఖడ్గ శార్ఙ్గకాయుధధరా! చతుర్భుజా! శ్రీకౌస్తుభమణి శ్రీవత్స శోభితవక్షా! పీతాంబరధరా! మణికిరీట మకరకుండలాభరణా! వైజయంతీ వనమాలాలంకృతా! పుండరీకాక్షా! అనేక బాహూదరశిరః పాణిపాదోరు జంఘావయవా! విశ్వరూపా! అనంతగరుడ విష్వక్సేనాది నాయకా! సనకసనందన సనత్కుమార సనత్సుజాత సల్లాపా! నారద గానప్రియా! నీలమేఘశ్యామలా! చతురాననజనన నాభీసరోజా! గంగానదీ కారణ శ్రీపాదపద్మా! భక్తవత్సలా! వేదోద్ధారకా! వైకుంఠ పురవరాధీశ్వరా! అసురశిక్షకా! అమరరక్షకా! జగన్నివాసా! జయ జయ, నీకు ననంత నమస్కారంబులు సేసెద. అవధారు; శ్రీ వేంకటేశ్వరా!

23

గజేంద్రవరదా! నీవు మాకుంగలవని యొరులం దీవింతుఁగాని యా దీవనఫలము నొసగ శక్తుండనుగాను. నీవు నాయందుఁ బ్రవేశించి యున్నావని మ్రొక్కించుకొందుంగాని రాజసమున మ్రొక్కించుకొన్న వాఁడనుగాను. నీ దాసుండనని పెద్దలలో దొరలుచున్నవాఁడం గాని నా తపోమహత్త్వంబున నధికుండనని యహంకరించినవాడం గాను. నీవు మనుష్యునిం జేసి ప్రవేశింపఁ బుట్టితింగాని నా స్వతంత్రంబునఁ బుట్టినవాఁడను గాను. నేనెంత జడుండైన నెన్నివిధంబుల విడువందగునె నన్ను? శ్రీ వేంకటేశ్వరా!

24

ప్రద్యుమ్నా! నీ పాదంబులు మనంబునఁ దలఁచెదను; వాక్కునంగొంత నుతించెదను; నా చరణంబుల మీకుఁ బ్రదక్షిణంబు వచ్చి చేతులెత్తి మ్రొక్కెదను; నాకుంగలిగిన యుపాయంబులవియ; కాన బహువిధానంబులు పెంచి

కర్మంబులుచేసి మిమ్ము మెప్పించ శక్తుండఁగాను. మీకు దయ యుండ నతి ఘోరతపంబుచేసి హర్షించి వరంబులడుగనేర. ఉద్ధవునిరీతి గోపికలకు మీకు నెడమాటలాడి మిమ్ము నభిముఖునిఁ జేసికొన సమర్థుఁడంగాను, సుగ్రీవునిగతి సేనలం గూర్చుకొని మీ యవసరమునకుం గొలువ బలవంతుండంగాను. నా పురుషార్థం బీ పాటి. నన్నుఁజూచి 'వీఁడేల తగిలెదు' నని కలంగకు; పరుండు వానికి భూమి యాధారంబు; నదులకు సాగరంబే గతి; పక్షులకు వృక్షంబే వసియింపఁజోటు; సస్యములకు వర్షంబు; నాకు నీవు.శ్రీ వేంకటేశ్వరా!

25

సంకర్షణా! నీ మాయామాత్రంబున మానవులకు నీవు దారులోహపాషాణ మృణ్మయంబులైన రూపంబులు వహించుకొని గుళ్లలోపలను ఇంటింటివారి చేతను బూజలుగొని వారు గోరిన వరంబు లొసగుచున్నాఁడవు. ఏమియు నెఱుంగని వారికెంత సులభుండవై యున్నాఁడవు. నీ వితరణ గుణంబు నిన్నటువలెఁ జేసినదియో? ఈ గతిం గరుణించుట నీ వ్రతంబో? నీకది స్వభావగుణంబో? దీనులఁ గాచుట కీర్తియో? రామరామ! అరుదరుదు నీ మహత్త్వంబు! నీ చరిత్రంబు విని వెఱఁగయ్యెడు. మేలు మేలు! ఎట్లైన నింక నా జన్మములు ఫలించె; మనోరథంబు లీడేఱె. సంతోషంబు పరిపూర్ణంబయ్యె; శ్రీ వేంకటేశ్వరా!

26

దానవారీ! తొల్లి నే నుత్తమగుణంబులెఱుంగను, నా మీఁదం గృపపెట్టి పెద్దలు నన్నాచారవంతుండందురను నభిమానంబు రేఁచి నన్ను సాత్త్వికుంగాఁ జేసితివి. ఒరులు నన్నుం జెనకుదురోయని పిఱికితనంబుఁ బొడమించి శాంతునిఁగాఁ జేసితివి. కాంతలు ధనంబపహరింతురనియెడు లోభంబు పుట్టించి జితేంద్రియునిఁగాఁ జేసితివి. అలమటలంబొంది ధనంబార్జింప వేసటనొందించి విరక్తునిఁగాఁ జేసితివి. నరకభీతి నివారించుటకై నీ మీఁద భక్తి పుట్టించి నీ శరణు సొరంజేసితివి. ఈ రీతి ననాది సంసారసక్తుండనైన నన్ను నొక్కొక్క యుపాయంబున నీ కభిముఖునిఁగా దిద్దుకొంటివి. మఱి

యింక నేఁబ్రార్థించి నీకుం జేయు విన్నపము లేమియున్నవి? నీ దైవిక ప్రయత్నంబు ముందఱ నా మానుషప్రయత్నంబులుపచరింప సిగ్గయ్యెడిని. బాపురే! నిన్ను మెచ్చి నీకేమి యొసగెదము? నిన్నుం బొగడుటే మా చేతనైన పని; శ్రీ వేంకటేశ్వరా!

27

పురుషోత్తమా! వేదంబులు రత్నాకరంబులవంటివి; తమలోని యర్థంబులు బయలుపడనీయవు. పురాణంబులు గంటవేఁటకాండ్రవంటివి; నానార్థంబులు చాటిచెప్పిభ్రమియింపంజేయుఁగాని యొకట నిశ్చయంబు దేటపడవు. భాట్టప్రాభాకరాది శాస్త్రంబులు నన్యోన్యశత్రులవంటివి; ఒండొంటిఁ ద్వేషించుఁ గాని నీ మీఁది భక్తి బోధింపవు; దానంబు లింద్రజాలంబులవంటివి. ఒకటి పదియాత్రై యనుభవింపఁ జేయుఁగాని ముక్తికిందెరువుఁ జూపవు. ఇతర కర్మంబులు చేనిపంటలవంటివి; జన్మపరంపరకు హేతువులై దేహుల మొలపించుంగాని వైరాగ్యంబుఁ బొడమనీయవు. వీని చందంబులిట్టివి; ఏమిటం దెగు సంశయంబు? నిక్షేపంబు, వెట్టినవాఁడు చూపక కానంబడదు; నీవు సర్వజ్ఞుండవు; నాకు నుచితార్థంబులిట్టివని తెలుపఁగదవే; శ్రీ వేంకటేశ్వరా!

28

పరమపురుషా! నేను దుర్జనుండనని యెవ్వరు మఱుఁగుపడ విన్నపంబు సేయుదురో? యిప్పుడే నా నేరములు నేనే చెప్పుకొనియెద. మండాడు కొనియెద. తప్పుకొనియెద. అది యెట్లంటివేని; నేఁజేసిన పాపంబులు నన్నుంజుట్టుకొనియెనేని నీ నామోచ్చారణంబు చేసి తప్పించుకొనియెద. నీ చేఁతఁగల్పితంబులైన విషయంబులు బాధింపవచ్చెనేని నా మదిలో నీ పాదంబులు దలంచి నీ మఱుఁగున డాఁగెదను. పురాకృతకర్మంబులు నన్ను ననుభవింపవలయునని పట్టుకొనియెనేని నీ వాఁడనని బలిమింద్రోచెదను. యమకింకరులు నా తెరువు వచ్చిరేని నా భుజంబులనున్న శంఖ చక్రలాంఛనంబులు చూపి వెఱపించెదను. సంసారపాశంబులు నన్నుఁ దగిలెనేని నీ కథలు విని పరాకు చేసికొనియెదను. నీ మాయ నన్ను

ముంచుకొనియెనేని నీ దాసులకుం జెప్పి నీకు విన్నపంబు సేయించెద. నా యపరాధంబులు చిత్తంబునం బెట్టకుమీ; శ్రీ వేంకటేశ్వరా!

29

స్వామీ! నీవు రక్షింపఁదలంచిన బ్రహ్మశాపంబేమిసేయఁగలదు? ధ్రువునిఁ జిరకాలజీవునిఁజేసితివి. బ్రహ్మాస్త్రంబేమి సేయఁగలదు? పరీక్షితుని బ్రదికించితివి. బ్రహ్మమాయ యేమి సేయఁగలదు? గోవత్సబాలకుల నిర్మించితివి. మృత్యువేమిసేయఁగలదు? సాందీపని కొడుకులందెచ్చితివి. పాపంబేమి సేయఁగలదు? అజామిళు నుద్ధరించితివి. అన్నింట బలవంతుఁ డవగుట నీ చేఁతలం గానంబడియె. నీ దాసులైన వారికి నే భయంబు నొందకుండంగాతువు. నీ ప్రతాపంబేమని వర్ణింపవచ్చు? శ్రీ వేంకటేశ్వరా!

30

పుండరీకాక్షా! అజ్ఞాన జంతువులైన మేఁకపోతులింద్రాది దేవతలకుఁ బశుపురోడాశంబయిన సంబంధమునఁ దమ్ముంగాచు గొల్లవానితోఁగూడి స్వర్గాది భోగంబుల ననుభవించుట! రాజ్యలోభంబునఁ గ్రోధంబు పెంచి సమరరంగంబున నన్యోన్య హింసాపరులైన వీరపురుషులు సూర్యమండలంబు సొచ్చి పోయి దివ్యపదంబు లనుభవింతురట! కామాతురులైన సతులు పతులం బాయలేక కళేబరంబులు కౌఁగిలించుకొని యనలంబుఁబ్రవేశించి యుత్తమగతులం బొందుదురట! సమ్యగ్ జ్ఞానసంపన్నులై నీ దాసులై దేహంబులందు నీ లాంఛనంబులైన తప్త శంఖచక్రముద్రలం బరిశుద్ధులై, కామక్రోధ పశువుల జ్ఞానాగ్నిలో వేల్చి, తులసీయుక్తమైన నీ శ్రీపాదతీర్థ సోమపానంబునం బాపంబులు విదల్చి, నీ ప్రసాదమనియెడి పురోడాశంబు నారగించి, యాచార్యోక్తి ముఖంబున నీ తిరుమంత్ర యజమాన పాఠంబులు జపియించి, నీకుఁబ్రీతిగా శ్వేతమృత్తికా శ్రీచూర్ణ ధారణంబుఁజేసి, పద్మాక్ష తులసీమాలికలు పూని, నీపైఁ దలంపుం బెట్టుకొని నీ పూజాయాగంబు నిత్యంబును జేయు వైష్ణవోత్తముల భాగ్యంబులేమని వర్ణింపవచ్చు? శ్రీ వేంకటేశ్వరా!

31

పద్మనాభా! నీకు మ్రొక్కనెత్తిన కేలి నమస్కారంబు ముంజేతికంకణంబు; నీ లాంఛనంబులైన తిరుమణి పదంబుల జోడు మంగళసూత్రంబు; ఇతరంబు మాని నిన్నే కొల్చుట పాతివ్రత్యధర్మంబు; నీ దాసులసంగతి మెలంగుట కులాచార నియమము; నీపై భక్తి నిష్ఠకుంజొచ్చు టుంకువ ధనంబందుకొనుట; నీ దాస్యమే మానంబు; నీ కైంకర్యంబు సేయుట కాపురము సేయుట; నీ మూర్తి సేవించుటే సదానుభవంబు; నీ ముద్రలు ధరియించుటే చక్కఁదనంబు; ఆచార్యోపదేశంబే యావజ్జన్మసంపద; యని నిన్ను భజియించు వారలు శ్రీ వైష్ణవులు. ఇటువంటి వారలకు నీవు వరదుండవని వింటిమి; మేము వీరిలోనివారమే. నీ చిత్తంబునఁ బెట్టుమీ; శ్రీ వేంకటేశ్వరా!

32

కోటిసూర్యప్రకాశా! లీలావినోదంబులకు నీవు గడియించుకొనిన ద్రవ్యంబులు లవణేక్షు సురాదధి ఘృతక్షీరాదులు సముద్రంబులై యున్నవి; కాంచన రజత ముఖ్యలోహంబులు పర్వతంబులై యున్నవి; సకలధాన్యంబులు నిచ్చఁగ్రొత్త పంటలై రాసులగుచున్నవి; పద్మరాగ వైఢూర్య రత్నసంఘంబులు భూగర్భంబున నిక్షేపంబులై యున్నవి; పుణ్యనదులు నీ రాజ్యంబునకుఁ గట్టు కాలువలై యున్నవి; పుష్పఫలసమేతంబులు కాననంబులు నీ శృంగారపుఁ దోఁటలై యున్నవి; గజ వాజి రథ పదాతి సమూహంబులు పట్టణంబు లెందుఁ జూచిన నీ ఠాణంబులై యున్నవి; జగదేక కుటుంబివైన నీవు సంసారంబు సేయఁగాఁజూచి నోరూరుచున్నది. ఇతరులు మోక్షంబడుగనెట్లు సమ్మతించెదరు? నీతోడి కాపురంబు గోరెదరుగాక! వారివలనఁ దప్పేమి? శ్రీ వేంకటేశ్వరా!

33

బలిబంధనా! దేహధారులకు రాగద్వేషంబులుడుగ నెట్లు వచ్చు? బొందితో స్వర్గంబునకుఁబోయిన ధర్మరాజు నున్నతపదంబున నున్న దుర్యోధనాదులం జూచి కనలిపడియెనట; మేమనంగా నెంతవారము? దేవా! నీవు

పంచేంద్రియంబులు పఱియ విడిచి, ప్రాణుల నజ్ఞానమున ముంచియెత్తి భ్రమియింపంగా నీతో నెదిరించి వాని నణంపశక్తులమె? నీకు శరణని నీ నామసంకీర్తన చేయంగ నీ చిత్తము! మా భాగ్యము! ఎట్లు చేసిన నీ చేతిలోని వారమే! శ్రీ వేంకటేశ్వరా!

34

వేదవేద్యా! నీవు లోకవ్యాపారంబున నానా జీవులఁ బోషింపుచుండ నే నొక్కవంక నీ మూర్తి నా మనంబున భావించి చిక్కించుకొని నీతో బట్టబయలు మాటలాడుచు నానామనోరథంబులం గాలక్షేపంబు సేయుచున్నాఁడను. ఇది నీవు సేయు నుద్యోగంబునకుం బరాకుసేయుట గాదుగదా! కాదులే. విశ్వతోముఖుండవు గావున నందఱతో మాటలాడ నోపుదువు. పరిపూర్ణుండవు గావున నన్నిచోటుల నుండనోపుదువు. మాకపచారము లేదు. అనంతశక్తి ధరుండవు, ననేకమహిమల వాఁడవు, నపరిమితోదారగుణుండవుఁ గావున నిట్టి నీ మాహాత్మ్యంబునకు శరణంబు; శ్రీ వేంకటేశ్వరా!

35

దేవదేవా! నిన్ను నేఁబలుమాఱు దలఁచిన వీఁడేమి కోరి తలఁచుచున్నాఁడో యని నీ చిత్తంబున నుండునని యొకానొకసారి నిన్నుఁ దలంపుదును. మఱియును మేనిం బడలించి తపంబుసేసిన నంతరాత్మవైన నిన్ను బడలిక సోఁకునో యని యూరకుందును. పేరుకొని నిన్నుఁబిలిచిన నన్నిపనులు విడిచివత్తువో యని మౌనంబున నుండుదును. జగత్తున నీవుండుట భావించి చూచిన నిన్ను శోధించినట్లయ్యెడినో యని పరాకుచేసికొందును. నీ చరిత్రంబులు సారెసారెకు వినం గడంగిన రహస్యంబులు బయలఁబడునో యని యాలకింపను. నీ కొలువుసేసి పాదంబులకు మ్రొక్కంగా మందెమేల మయ్యెడినో యని యంతట నింతట నుండి సేవింతును. ఇది యెఱింగి నీవే దయంగావుము; శ్రీ వేంకటేశ్వరా!

36

వైకుంఠనాథా! హిరణ్యగర్భాదులకుఁ దండ్రివైన నిన్ను, సనకాదులకు నేలికవైన

నిన్ను, దివిజులకు రక్షకుండవైన నిన్ను, మునులకు వరదుండువైన నిన్ను, జ్ఞానులకుఁ బరదైవతంబవైన నిన్ను, జగంబులకు మూలకారణమైన నిన్ను యశోదానందగోపులు పుత్త్రుండవని పెంచిరి; గోపికాజనంబులు పతివని తలంచిరి; పాండవులు బావమఱఁదివని భావించిరి. వీరలటువంటి మమకారంబులనుభవించిరి. మఱికొందఱు ముచికుంద దధిభాండ కమలాకర భీష్మాదులు పరతత్త్వమైన నారాయణుండవని భజియించి బ్రహ్మపదంబునం బొందిరి. ఇన్ని విధంబులవారికి నీ వొక్కండవే గుఱి. ఎటువలె భావించిన నటువలె నౌదువు. వివేకింప నేర్చినవారి పాలిటి నిధానమవుదువు; శ్రీ వేంకటేశ్వరా!

37

సత్యసంకల్పా! ప్రపన్నులైనవారికి మీ దాసుల శ్రీపాదతీర్థంబు శిరసా వహించుట సకల పుణ్యనదీస్నానములు; త్రికాలంబుల నాచార్యవందనంబులు, సంధ్యావందనంబులు; అభ్యాగత శ్రీవైష్ణవుల నుపచరించిన వాక్యంబులు, గాయత్రీమంత్ర జపంబులు; పూర్వాచార్యోక్త స్వరూపగ్రంథానుసంధానంబులు, వేదపారాయణంబులు; జ్ఞానాగ్నియందుఁ గామక్రోధంబులనుసమిధల వేల్చుట యౌపాసనంబు; ఆర్తులైన వారికి శ్రీవైష్ణవమార్గంబు లుపదేశించుట లతిథి సత్కారంబులు; తాతముత్తాతలమాద్రి నుండుటే దేవ పితృ సంతర్పణంబులు; మీ తిరువారాధన సేయుటే సకలయజ్ఞంబులు చేయుట; వేదోక్తంబైన కర్మనియమంబులు ఫలంబులు నిటువలె సిద్ధించె. నిదియ పరమార్థంబు. నిన్ గొల్వవచ్చు; పాపముంబట్టి నిర్దహింపవచ్చు; నిన్ను ముట్టి మెప్పింపవచ్చునే! శ్రీ వేంకటేశ్వరా!

38

నిగమగోచరా! నా మనంబు ధ్యానయోగంబు సేయంగడంగినఁజండాల గార్దభ సూకర కాంతలు తలఁపున బాఱెడిని. అంతట నది విడిచి పురాణంబులు చదువం జూచినఁదాటకా శూర్పణఖా విరాధ కబంధరావణ కుంభకర్ణాది నామంబులు నోటం దొరలెడిని. అది మాని జపంబు

సేయంబూనిన నిద్రయు, నావులింతలు, నలసత్వంబులుఁ బొదలెడిని. అది చాలించి తీర్థయాత్రకుఁ గుతూహలినైన దుష్ట చోరవ్యాఘ్ర మకరాదిభయంబులు వణఁకం జేసెడిని. ఈ రీతుల నా ప్రయత్నంబులెక్కడకెక్కు? నేనొకటి దలంచిన వేఱొక్క చందంబున నీ మాయ భ్రమియింపుచున్నది. ఏ యుపాయంబున నిన్ను నా వశము చేసికొనియెద? నా చందము నాకు బోధింపవే; నీవు జగద్గురుండవు; నా మర్మము నీచేత నున్నది; శ్రీ వేంకటేశ్వరా!

39

నగధరా! తరులతాపాషాణాదులైన కొన్ని జీవశరీరంబులు నరపశుపక్షి మృగాదులైన కొన్ని జీవజంతువులకు నాహారంబులై యున్నవి. విచారించి చూచిన నెవ్వరి కెవ్వరు చుట్టములయ్యెదరు? ఋణానుబంధంబునం దగిలినవారు పుత్త్రమిత్త్రకళత్రాదులు; ప్రాకృతసుఖంబులకుఁ దోడైన వారలు వీరు. స్వామీ! జగదేకకుటుంబివి నీవు. మోక్షసుఖంబునకుం దోడైనవారు నీ దాసులు. ఇహపరలోకంబులకు సాధనంబులైన బంధువులు మీరు. మీ నామములు సకల దురిత నివారణములు; మీ యాయుధములు మాకు సర్వరక్షకములు; మీ పాదంబులపై భక్తి మాకు వజ్రపంజరము; శ్రీ వేంకటేశ్వరా!

40

విష్ణుమూర్తీ! నేనెంతమూఢకఠినచిత్తుండనైన నీవు నా మీఁదఁ గృపవెట్టిన సాత్త్వికుండ నగుదును; అది యెట్లంటివా? ఱాతిమీఁదఁ గడువ వెట్టినం గుదురుగాదె! కమరునం జవ్వాజి పూసినఁ బరిమళంబు పుట్టదే! చిల్కకుం జదువుచెప్పినఁ జదువనేరదే! అడవియిఱ్ఱికి వేఁట నేర్పినఁ బంపుసేయదే! ఇట్టు గావున నీవు నా మీఁద దయఁదలఁచి, తల్లి బిడ్డలం బిలిచి యాహారంబు వెట్టునట్లు, యజమానుండు దన పసులందోలి తెచ్చి యింటఁబోషించినరీతి, నన్ను నీ చిత్తంబున దయఁదలచి నీ కింకరునిగాఁ జేసికొనవే; శ్రీ వేంకటేశ్వరా!

41

గోవర్ధనోద్ధారా! నేను గరచరణాద్యవయవంబులు దాల్చి మాతృగర్భంబు నందుండి వెడలి పెరిగి బుద్ధినెఱింగి యీ జగంబులకుం గర్త యెవ్వండొకో

యని వెదకి వెదకి పురాణంబులవలన నీ వైభవంబులు విని నిన్నుంగనుంగొన శక్యంబుగాక యెవ్వండవొకొ యని విచారించి నిన్ను నెఱుంగ నలవిగాక తిరుమల వరుస వెంటంజని వేంకటాచలంబెక్కి గరుడస్తంభంబు చెంత జనులకు నీవొసగు వరంబులు సూచియుఁ, బాపవినాశనంబునఁ దీర్థంబులాడువారి పాపంబులు నీరై పాఱుటంజూచియు, ఆ కొండమీఁద వృశ్చికసర్పాది జంతువులు నిర్గతవిషంబులగుటంజూచియుఁ జోద్యంబు నొంది యచట నీ మూర్తి దర్శించి తొల్లింటి యజ్ఞానంబు విడిచి సందేహంబులు మాని నీవే యేలిక వనియు నే నీ బంటననియుందెలిసి శ్రీవైష్ణవుండనైతి రక్షింపవే; శ్రీ వేంకటేశ్వరా!

42

ఉపేంద్రా! నీవు నాకు దేవరవై నాలోనుండఁగా నే నీ దిక్కు సూడక యేకాంతంబని సంసారంబు చేసి బిడ్డలం గంటిని. అదియునుంగాక యేలికవైన నీవు నన్నుఁ జూచుచుండ బ్రమసి యెవ్వరుం గానరని చేయరాని పాపంబులు చేసితిని. మఱియు నీవు నాకుఁదోడవై రక్షకుండవై యుండఁగా మఱచి యొంటి నున్నవేళ నొక్కండనే యని సంశయించి భూతంబులకు వెఱచితిని. క్రమ్మఱ నీవు నా మనంబులోఁ బంచేంద్రియములలో విహరింపఁగా వెఱవక, మందెమేలమని యెంచక, మంచముపై నిద్రించితి. ఒక్కొక్కవేళఁ దలిదండ్రులైన మీరాత్మభోగంబుల నొసగుచు బాహ్యాంతరములం గాంచుచుండఁగాఁ గొంచించక సిగ్గువిడిచి మలమూత్రంబులు విసర్జించితి. ఎంచి చూచిన నా యపరాధంబులెన్నియైనం గలవు; అన్నియును నోర్చుకొనుము. నా తప్పులకుం బ్రాయశ్చిత్తంబుగా దండంబు పెట్టెద; శ్రీ వేంకటేశ్వరా!

43

చక్రపాణీ! నీ మాయలకు లోనై నేను వ్యసనంబులచేతంజిక్కినప్పుడు నీ బంటనని విడిపించుకొనుమీ! ఆశాపాశంబులు నన్ను నలువంకలకుం గుదియఁ దీసెనేని ప్రాంతవాఁడనని వెనుక వేసికొనుమీ. కామక్రోధాదులు సారెసారెకుఁ బట్టఁ గడంగెనేని నీ ముద్రలు మోచినవాఁడనని యడ్డంబు రమ్మీ! పురాకృతకర్మంబులు నన్నుఁ దగిలెనేని సంకీర్తన సేయువాఁడనని మన్నించి

రక్షించుకొనుమీ! నడుమ నడుమ నజ్ఞానంబు చిక్కించుకొనిన దానిం బరిహరించి నన్నుం జేపట్టుమీ! మనసుపట్టలేక మునుపే విన్నవించితి. నీవనాథ నాథుండవు; ఆర్తశరణ్యుండవు; సర్వభూత దయానిధివి; నిర్హేతుకబంధుండవు; నీవు నా హృదయంబులోనివాఁడవు; నాకు దిక్కు నీవే సుమీ; శ్రీ వేంకటేశ్వరా!

44

మాధవా! మీర ర్జుననకు సాక్షాత్కారమై యుండి భగవద్గీత లేడునూఱు గ్రంథంబులు బోధించితిరి. విశ్వరూపంబుసూపి ప్రమాణంబుచేసి మిమ్మెఱుంగు మని యుపదేశించితిరి. ఇంక మముబోఁటిజీవుల నెన్నిట బోధింపవలయునో యందులకే చింతించెదను. అవులే; ఇంకొక యుపాయంబు విచారించుకొంటి; తొల్లి వాల్మీకి 'రామా'యను రెండక్షరముల నుడివి బ్రహ్మర్షియై మీ కృపకుం బాత్రుండయ్యె. నారదుండు మీ సంకీర్తనంబు సేసి కృతార్థుఁడయ్యె. విభీషణుఁ డు మీకు శరణుసొచ్చి బ్రదికె. నాకు నిదియే మార్గంబు; శ్రీ వేంకటేశ్వరా!

45

నందనందనా! చేయంగల పాపంబులన్నియుఁజేసితి; నా కర్మంబే మనుచున్నదో యెఱుంగను. దేవర్షి పితృతర్పణంబులు సేయకుంటిని; యమకింకరులేమనుచున్నారో యెఱుంగను. ఎక్కడలేని యుద్యోగంబులు సేయుచున్నాఁడను; విధి యేమనుచున్నదో యెఱుంగను. అన్నపానాదిభోగంబు లనుభవించుచున్నాఁడను; చిత్రగుప్తుఁడేమి వ్రాయుచున్నాఁడో యెఱుంగను. బాల్యకౌమార యౌవన గతులంబెరుగుచున్నవాఁడను; కాలంబేమనుచున్నదో యెఱుంగను. ఇన్ని యపరాధంబులకు గుఱియైనవాఁడ నగుట నా భయము నివారింతువని నీ మఱుఁగుసొచ్చితి. చేయంగల విన్నపంబులెల్లఁ జేసికొంటి; నీ చిత్తంబెట్లున్నదో యెఱుంగను. శ్రీ వేంకటేశ్వరా!

46

ఆదిమూర్తీ! నేను భూలోకంబున నా కర్మంబులనుభవింపం బుట్టితిఁగాని నిన్ను గుఱుతెఱింగి కొలిచెదనని పుట్టినవాఁడను గాను. ఇంతలో నీవు నిర్హేతుకలీలం గరుణించి, నన్ను బంటుగా నేలితివి. నా భాగ్యంబులేమని

పొగడెద; నిన్నుం బొగడుటేకాక! నేనేమి తపంబు చేసితినో యది దలంపనేల? నీ మహిమ దలఁచుటగాక! నా బుద్ధి నేమి మెచ్చుట? నీ సంకల్పంబు మెచ్చుటగాక! దప్పిగొన్న యతండు జలముల వెదకుచుండ భాగీరథీజలంబబ్బి నట్లు, కృషికుండు తన చేను దున్నుచో నాఁగంటికొన బంగారుకొప్పెర దొరకినట్లు, పులిజూజంబాడెడువాఁడు ఊలేఱుతఱి మాణిక్యంబు చేకూడినట్లు నీవు నాకుందొరికితివి; శ్రీ వేంకటేశ్వరా!

47

మత్స్యావతారా! అవధారు! దేవ, నాలోని పాపపురుషుండు విజృంభించి తఱుముకొని రాఁగా నీ మఱుంగు సొచ్చితి. అంతలో నీ యభయదాన పురుషుండు వచ్చి యతనితో దారుణయుద్ధంబు సేయఁదొడంగెను. అరిషడ్వర్గంబులనియెడి చుక్కలు డుల్లె; తాపత్రయంబనియెడి పిడుగులు రాలె; చింతాసముద్రంబు గలంగె; నిర్దయయనెడి ధరిత్రి వణఁకె; దుర్గుణంబు లనియెడి దిక్కులు చలియించె; దురాశాపర్వతంబులు గ్రుంగె; అతిఘోర సమరంబునఁ బాపపురుషుండు నోడిపాఱె; మీ యభయ దానపురుషుండు గెలిచె; ఈ మేలువార్త మీకు విన్నవించితి; శ్రీ వేంకటేశ్వరా!

48

కమలనాభా! నే నీ వేగువాఁడనై విన్నపంబు సేయవచ్చితి; ఏకాంతంబున విన నవధరింపుము. భువిలో శరీరంబనియెడి మాయాపట్టణంబు గలదు. అందుకహంకారంబనియెడి రాజు; చలంబనియెడు ప్రధాని; విషయంబు లనియెడి కరితురంగంబులు; పాపంబులనియెడి వీరభటులు; కోరికలనియెడి కాపులు; రతిసుఖంబులనియెడి ధనధాన్య భండారంబులు గలవు. ఈ రీతిఁ గోటలోనివారలు ఆశలనియెడి నిశాసమయంబుల నేమఱి నిదురవోవు చుందురు. జ్ఞానంబనియెడి నీ యూడిగపు దొరతో నన్ను బుద్ధివైరాగ్య శమదమంబులనియెడి బలము వెంటఁగూర్చి యంపితేని ఆ కోటగొని యందు ఠాణంబుండి పగవారి నందఱను గెలిచి పట్టి తెచ్చి యప్పగించెదం బంపు వెట్టవే; శ్రీ వేంకటేశ్వరా!

49

సుదర్శనధరా! జీవులుసేసిన పుణ్యపాపంబులు చిత్రగుప్తులు వ్రాయుదురట; నామీఁద నేమి వ్రాయుదురో యెఱుంగను. నేఁ జేసిన పుణ్యంబులు మీకు సమర్పించితిని; పాపంబు సేయించిన యింద్రియంబుల మీ ముందటం బెట్టితి; మనంబు మీకు నప్పగించితి; భక్తి మీకుం గానుకగాఁబెట్టితి; శ్రీ వైష్ణవుండనై మీ దాసుల మఱుంగు సొచ్చితి. అన్నింట నా కొఱంతలు దీర్చుకొంటిని. ఇంక నామీఁదఁ జిత్రగుప్తులు నిలువలు వ్రాయంబనిలేదు. ఇందుకు సాక్షియు నీవె; ఎఱుకయు నీవె; విన్నవించితి. శ్రీ వేంకటేశ్వరా!

50

రంగధామా! నీవు నీటిపైఁ గొండలఁ దేలించిన బలవంతుండవని, క్రోఁతులచేత రాజ్యంబు సేయించిన నేర్పరివని, రాతికిం బ్రాణంబులిచ్చిన యుదారుండవని, కొండ గొడుగుగాఁ బట్టిన సత్త్వసంపన్నుండవని, ఒక గజముమాటవిని వచ్చి కాచిన భక్తసులభుండవని, ఆఁడుదాని మొఱాలకించిన దయాళుండవని, ప్రహ్లాదునిప్రతిజ్ఞ చెల్లించిన భక్తపరిపాలకుండవని, పదియాఱువేల నూటయెనమండ్రు దేవులకందఱ కన్నిరూపులై వినోదించిన నెఱజాణవని నీకు మ్రొక్కితి; నిన్నుంగొల్చితి; భవంబులం గెల్చితి; సంతోషంబున నృత్యంబాడెదను; శ్రీ వేంకటేశ్వరా!

51

రావణాంతకా! నీవు దేవసంరక్షణార్థమై పాయసంబులోఁ బ్రవేశించి కౌసల్యా గర్భంబున జన్మించి తాటకాహరణంబును, సుబాహురాక్షసవధయును, కౌశిక యజ్ఞ సంరక్షణంబును, అహల్యాశాపమోక్షణంబును, ధనుర్భంగంబును, సీతావివాహంబును జేసికొని పరశురాముఁడు మింటికిం గట్టిన త్రోవలు దెగనేసి దశరథుండు పట్టంబుగట్ట సమకట్టినఁగైకేయిచేతఁ బదునాలుగేండ్ల రణ్యావాసంబునకు మితి చేసికొనిన కారణంబేమి? అవులే; దశకంధరునికిఁ బదునాలుగేండ్లాయుశ్శేషము నాఁటికిఁ గలిగెఁ గాఁబోలును; తావత్పర్యంత మును, శూర్పణఖా నాసికాచ్ఛేదనంబును, మారీచ కబంధ ఖరదూషణాది హననంబును, వాలి నిబర్హణంబును, సుగ్రీవాదివరణంబును, వానర

నియోగంబును, సముద్రబంధనంబును జేసి యంతట రాక్షస సంహారంబుగావించి, లంక విభీషణునకిచ్చి సీతాసమేతుండవై యయోధ్యా పట్టంబుఁ గట్టికొంటివట! ఎంత కపటనాటకసూత్రధారివి? శ్రీ వేంకటేశ్వరా!

52

కేశవా! నీవు విరక్తులకు మోక్షసుఖంబవై యుందువు; ప్రాకృతులకు సంసారంబవై యుందువు; నిన్ను ధ్యానంబు సేయువారలకు సాకారంబవై యుందువు; ఇతరులకు ముువ్వురిలో నొక్కండవై యుందువు; మూఢులకు నవేద్యుండవై యుందువు; దనుజులకు నహంకారంబవై యుందువు; దేవతలకు బ్రహ్మపదంబవై యుందువు; ఈ రీతి వారివారికిఁ దగినట్లు నీరుకొలఁది తామరవై యుందువు. ఓపినవారికోపినంత భాగ్యంబవు; నీకు శరణన నేర్చినవారిని నీవే రక్షింతువు; నీ వలనఁ గొఱఁత లేదు; శ్రీ వేంకటేశ్వరా!

53

అచ్యుతా! మిమ్ము నేమియు నడుగ ననియెడు నహంకారంబు గలవాఁడఁ గాను; మీ పనుల యెడ నపరాధంబు లేకుండెడు నట్టు కొలుతు ననియెడు గర్వంబు గలవాడంగాను; మిమ్ము నమ్మితి నని సారెసారెకుం గొసరెడివాఁడఁగాను; మీకు విశ్వాసి నని యెమ్మెలఁబొరలెడివాఁడఁ గాను; వేదశాస్త్రంబు లెఱుంగుదునని పెద్దల ధిక్కరించెడువాఁడఁగాను; ఆశ్రమాచారంబులు చూపి యుత్తమలోకంబులు చొరఁబాఱి సరిగెల్పు నెఱపెడివాఁడఁగాను; మీ మీఁది భక్తిగలదని బలిమి చూపెడివాఁడఁగాను; శేషత్వపారతంత్ర్యముల మఱుఁగున నిల్చి మిమ్ము సేవించు మీ దాసానుదాసుండనని యెఱుంగుమా. శ్రీ వేంకటేశ్వరా!

54

భుజగేంద్రశయనా! లక్ష్మీసమేతులరై యేమేమి సేయుచుంటిరో మీ యవసరం బెఱుంగక మిమ్ముఁదలంపరాదు. రుక్మిణీదేవితో నెత్తంబు లాడెడువేళ ద్రౌపది 'కృష్ణా'యని తలంచిన నక్షయంబని పాచికలు వైచితిరట; కరీంద్రుండు మిమ్ముందలంచిన వైకుంఠభోగంబులటువెట్టి వచ్చితిరట; ప్రహ్లాదుండు కంబంబునం జూపెద ననినఁ జించుకొని వెడలితిరట. ఈ రీతి మీ చరిత్రంబులు

విన వెఱఁగయ్యెడిని. మీ వేళచూడక తలంచిన నపచారంబుగదా! మీయంత మీరెప్పుడు నన్ను మన్నించ విచ్చేయుదురో యని మీ శ్రీపాదపద్మంబులచప్పుడు నాలకింపుదును. మీకై నే నేవేళనైనను హృదయంపువాకిళ్లు గాచుచుండెద; శ్రీ వేంకటేశ్వరా!

55

పరంధామాధిపా! మీ మహిమ సముద్రమునకుఁగారుణ్యంబు జలంబు; మీ కల్యాణగుణంబులు తరంగంబులు; మీ నిగ్రహానుగ్రహంబులు తిమి తిమింగిలంబులు; మీ శ్రుతులు ఘోషంబులు; మీ గాంభీర్యంబులోఁతు; మీ ప్రతాపంబు బడబానలంబు; మీ కపటనాటక వ్యాపారంబులు మకరకచ్ఛపాది జంతువులు; ఇట్టి మీ మహిమ సముద్రంబు, మీ దాసులు మిమ్ముఁగూడి తరవఁగాను భక్తియను కామధేనువు వొడమెను; జ్ఞానంబనియెడి చంద్రోదయం బాయె; ఆనందంబనియెడి యైరావతంబు, సాత్త్వికంబనియెడి పంచతరువులు, అనంతనామంబులనియెడి యప్సరః స్త్రీలు; తిరుమంత్రంబనియెడి యమృతం బునుం బొడమె; మీ యష్టాక్షరామృత మనుభవించుచున్నాము; శ్రీ వేంకటేశ్వరా!

56

కాలాత్మకా! బ్రహ్మాండకోట్లఁ గుక్షింబెట్టుకొన్న నిన్ను గర్భంబున మోచెనట దేవకీదేవి; విశ్వరూపుండవైన నిన్నుఁ గౌఁగిలించుకొన్నారట గోపికలు; సర్వతోముఖుండవైన నిన్ను ముద్దాడెనట యశోద; అపరిమిత బ్రహ్మంబైన నీకు ద్వారకానగరంబు గట్టెనట విశ్వకర్మ; సర్వవ్యాపకుండవైన నీకు రథముఁ గడపెనట దారుకుండు; వేదాంతవేద్యుండవైన నీకుఁజదువు చెప్పెనట సాందీపుండు; ఇది యెటువంటి యద్భుతంబు; విన నగోచరంబయ్యెడిని. అట్లేకదా, నీకంటె నీ దాసులధికులౌట తేటపడె. శ్రీ వేంకటేశ్వరా!

57

జగదేకవీరా! నాయర్థాతురయత్నంబున నిన్ను 'దైవమా' యని దూఱి సొలసితి; ఐశ్వర్యగర్వంబుచేత మీ గుళ్లముందఱ వాహనంబు దిగనైతి; మీ సన్నిధిని దాంబూలచర్వణంబులు చేసితి; బాల్య యౌవన కౌమార గతులచేత మీకు

గ్రొక్కనైతి; మఱియును గొన్ని యేమి యపరాధంబులు చేసితినో? నేఁజేసిన యపరాధములకు క్షామకముగానిప్పుడే మీ తిరుమంత్రోచ్చారణంబు చేయుటచేతను చంచలత్వంబు విడిచి చిత్తము శాంతమునం బొందె. మీరే పరతత్త్వంబని తెలిసి శరణాగతుండనై మీ దాసులలోఁ జేరితిని; నేఁజేసిన యపరాధములకుఁ బరిహారముగా మిమ్ము నాకుంజాటిచెప్పిన యాచార్యుల శ్రీపాదతీర్థవిశేషములకుంజేయొగ్గెద; మీ దాసుల పాదరక్షలు మోచెద; మీ దాసానుదాసుల సేవకుండనయ్యెద; మీ దాసదాసీ జనంబులకు నీళ్లు మోసెద; మీ లెంకలకు లెంకతనంబునఁజొచ్చి యచ్చువేసికొనియెద; నా సర్వాపరాధంబులు క్షమింపవే; శ్రీ వేంకటేశ్వరా!

58

లంకాపహార! వైష్ణవజ్ఞానంబనియెడి యంజనంబుచేత నీవనియెడి నిధానం బెత్తికొంటి. అదియునుంగాక నీపై భక్తి యనియెడి నావచేత సంసార సముద్రంబు దాఁటి వైరాగ్యంబనియెడి పదార్థంబు నీకు సుంకంబు వెట్టక బలిమిం దెచ్చుకొంటిని. నీ పాదంబులమీఁది తులసీమాలికచేత నజరామర పదంబుఁజూరగొంటిని. ఇవి నా దుర్జనకృత్యంబులు; నీవు భూమీశుండవు. కనుకఁ నీవు నన్నుఁ బ్రమోదంబు సేయకయున్నప్పుడే విన్నవించితి. నేఁ జేసిన చేఁతలివి; ముందఱ నీ చిత్తంబెట్లుండునో? ఇదిగో నీకు విన్నవించితిని, మఱవక విన నవధరించి రక్షింపవే; శ్రీ వేంకటేశ్వరా!

59

ముచికుందప్రసన్నా! సంసారధర్మంబులనియెడు నంగళ్లలోపల నీతి సంగతులనియెడు వ్యవహారులు కోరికలనియెడు సరకులు పచరించుకొని అగ్గువతో నమ్మఁగా నేను బహుళంబుగా సంపాదించుకొంటిని. ఆ కోరికలను నొడిఁగట్టుకొని యనుభవించనే వేడుకయగుచున్నది. నిన్ను ధ్యానంబు సేయంజనదు. నా మనస్సు క్రొత్తకోడెవంటిది. జ్ఞానంబనియెడు కంబంబునఁ గట్టి వైరాగ్యంబనియెడు సాదుపసరముతో లంకెవైచి నీ కృషికి దిద్దుకొనవే; శ్రీ వేంకటేశ్వరా!

60

హిరణ్యగర్భా! నీకుఁబాన్పైన శేషుండు బ్రహ్మాండంబెత్తుకొనియె; నీకు వాహనం బయిన గరుత్మంతుండమృతంబుఁగొని చనియె; నీ కూఁతురైన గంగాభవాని హరుశిరస్సునెక్కె; ధ్రువుండు బ్రహ్మలోకంబతిక్రమించె; నారదుండు సురలకుఁ బోరువెట్టుచున్నాఁడు; రుక్మాంగదుండు యమలోకంబుంబాడుచేసె; శుకుండు వైరాగ్యంబు చూఱఁగొనియె; ఇందుచేతను నీ దాసులు నీకంటె నధికులౌట తేటపడియె; శ్రీ వేంకటేశ్వరా!

61

రామరామ! లోకంబెల్ల నొక పాదంబునఁ గొల్చితివట; నీ రూపంబేమని చెప్పుదును? అనంతవేదంబులు నిన్నుం బొగడునట! నీ గుణంబులెన్నియని యెన్నుదును? నీ రోమకూపంబుల నజాండకోట్లు నిండుకొన్నవట! నిన్ను నేమని వర్ణింతును? నీవు సర్వదేశ సర్వకాల పరిపూర్ణుండవై యుండఁగాను నీ ప్రభావంబేమని పొగడుదును? పురాణపురుషుండవట; నీ తుదమొదళ్లె ఱుంగువారెవ్వరు? నిన్నుఁ దెలియ నుద్యోగంబుఁ జేసెద. నా యాసలేమని చెప్పుదు? నంతయు నీ వెఱుంగుదువు; శ్రీ వేంకటేశ్వరా!

62

శరణాగతవజ్రపంజరా! నీవు లోకసంరక్షణార్థంబై నీ స్వతంత్రంబున నెత్తిన రామావతారంబున నీ శక్తిని నీవె యెఱుంగవని యందురు గొందఱు. హరువిల్లు నెక్కుపెట్టి విఱిచినదియును, పరశురాముఁడు గడియించిన స్వర్గసోపానం బులం దెగద్రేసినదియును, సుగ్రీవునికి వాలింజంపెదనని ప్రతిజ్ఞ చేసినదియును, శరణుసొచ్చిన విభీషణునకు మున్నుగా లంకారాజ్యంబునకుఁ బట్టంబు గట్టినదియును, సీతను వెదకంబోయిన వానరులలోన హనుమంతు చేతికి నుంగరం బొసంగినదియును, జలధిపై విల్లు దొడిగినదియును నీ భుజబలిమియకాదె! నీ ప్రతాపంబు నీవెఱుంగనిదేమి? నీవు సర్వజ్ఞుండవు. నిన్ను నెఱుంగనివారలె యజ్ఞులు గాక! శ్రీ వేంకటేశ్వరా!

63

కౌసల్యానందనా! ఈ మనుష్యజన్మంబు నీవె నా కొసంగి పుట్టించితివి. ఇది నా కిచ్చిన వారకపు శరీరము. ఇందుల యాభరణంబులు, నన్నపానాది భోగంబులు, నీ కరచరణాద్యవయవంబులు చేసిన పుణ్యపాపంబులు నీకె సెలవు. నే నేమిటివాఁడను? అణుమాత్రపు జీవుండను. ఈ తనువు నా మీఁద నదనంబు వెట్టితివి. రాచముద్రకుంబెట్టిన లంచంబు రాజునకు సమర్పణంబె కాదా! అది యెట్లంటివా? ఆత్మ నీవుండెడి నెలవు. నీ వున్నచోటను నూటయెనిమిది తిరుపతులును సకల పుణ్యక్షేత్రంబులును నుండును. నన్న జ్ఞానంబులంటనీయకు; శ్రీ వేంకటేశ్వరా!

64

సుగ్రీవరాజ్యస్థాపనా! నే నొకవేళ నీ దాస్యమనియెడి గజస్కంధమందా రూఢుండనై చరియింతు. మఱియొకపరి నీవు నాకుంగలవనియెడి విశ్వాసంబను తురంగంబునెక్కి యాడెదను. ఇంకొకప్పుడు మీ కథలు విని యానంద రథంబుపై విహరింతును. ఆ తర్వాతను వినయవిధేయవర్తనంబు లనియెడి చరణ త్రాణంబులతోడఁ బదాతినై మీ యవసరంబు గాచుకొని ముందఱఁ గొలువు చేయుదును. ఈ రీతి చతురంగబలంబులతోఁ దోడు సూపంగల బంట నీకు; నామీఁద నేమి యపరాధంబు గలిగిన నోర్చుకొనుము; శ్రీ వేంకటేశ్వరా!

65

ఆనందనిలయా! మిమ్ము దర్శించుసమయంబున నొక కానుక గావలసి యపూర్వవస్తువెట్టిదో యని వెదకి వెదకి మఱియుఁ గొందఱ నడుగంగాను, వారలొండేమి యడుగుచున్నాఁడవని హుంకారధిక్కారంబులచేత భర్జింపఁ గాను వారలం దిరిగి కోపింపక యందులకు నొదిఁగి శాంతి గైకొని వర్తించితి. అంత నీ కామక్రోధ విరహితంబయిన శాంతమే కా యుత్తమ వస్తువని నా మనోవీథిం గంటిని. అది నీకుఁ గానుకగాఁ దెచ్చితిని. అది యమూల్యము. తులాభార హిరణ్య గర్భాది మహాదానంబు లిందులకు సరిగావు. అష్టాంగ

యోగంబుల సిద్ధులు నిందులోనే యున్నవి. తపంబునఁబొందెడు మహిమయును దీన సిద్ధించును. నీవిందులకు సంతోషింతువని యిది మేలైన వస్తువు గనుక సర్వేశ్వరుండవయిన నీ ముందరంబెట్టక పోరాదని సమ్ముఖంబున నిల్పితిని. నా హృదయంబనియెడి భండారంబులోఁబెట్టి పదిలంబుగా దాఁచుకొనుము, కొనుము; శ్రీ వేంకటేశ్వరా!

66

జ్యోతిర్మయా! నా కాఁపురంబు నీకు విన్నవించెద; మా పెద్దలు గడియించిన పూర్వాచార్యోక్త గ్రంథంబులనియెడి వృత్తులు గలవు. అవి పలుమాఱు ద్రవ్వి త్రవ్వి నానాదేశంబుల శ్రీ వైష్ణవుల కృపలనియెడి పంటకాల్వలఁ బాఱించుకొని వ్యవసాయంబుసేసి ముందరగా నీ కైంకర్యమనియెడి మొలకలను విత్తి పైరుకొల్పి నీ యనుగ్రహమను కొల్చు పండించి మనస్సనియెడి కణఁజంబునం బెట్టితి. భాగవతధర్మంబులనియెడి పాఁడిపశువులను బరిపాలించు కొనుచుంటిని. నీ ధర్మంబున సుఖంబున్నాఁడను. దీన నిఁక నీ సారూప్యం బనియెడి ధనంబు గడించుకొనఁగలను; శ్రీ వేంకటేశ్వరా!

67

శంఖపాణీ! నా దేహంబొక నెత్తపుంబలక. నా పంచవింశతి తత్త్వంబులు సారెలు. నా యుచ్ఛ్వాసనిశ్వాసంబులు పాచికలు. నా పుణ్యపాపంబులు పన్నిదంబులొడ్డిన ద్రవ్యంబులు. ఈ రీతిఁ దన్నుకాడెడి జూజగాఁడను. నీ మాయతో నింతగాలము నాడియాడి యోడి మఱి యొక్కొక్క జన్మంబునను మగుడ సూడుగొని యీ యాటలె యాడుచున్నాఁడను. గెలుపెట్టిదో, యెప్పుడో యెఱుంగను. నీవు నన్నేలిన యేలికవు. బంటు జయించిన జయమేలికదె కదా! నాకుంగాను సూడువెట్టి గెలిపింపుమా! శ్రీ వేంకటేశ్వరా!

68

అభేద్యవిక్రమా! కన్నులు మూసిన లయంబును, దేఱిచూచిన జగంబును, మేలుకొనిన నందు జననంబును, బరస్త్రీగమనంబున నరకంబును, స్వపత్నీసంతానంబున స్వర్గనివాసంబును, క్రోధంబున రాక్షసత్వంబును,

ననాచారంబునఁ బాపంబును, నాచారంబునఁ బుణ్యంబును, నసత్యంబునఁ గీడును, సత్యంబున మేలును నీ రీతి నందఱకుఁ గానవచ్చు. మఱపు పుట్టించు చున్నది నీ మాయయే యని యీ యర్థంబెఱుంగుదురుగాని భ్రమియనివారు లేరు. ఇంతగాలంబున నే నెత్తిన జన్మంబులుం గోటానఁగోట్లు గలవు. అన్నియు సంసారంబునకే సమర్పణంబయ్యెఁగాని యిందులో నొక జన్మమైనను మీకు సమర్పణంబు గాదయ్యె. దేవా! యింక నా నేరంబులెన్నియని యెంచెద! గత జలసేతుబంధనంబు. అట నీ మాయ నిగ్రహించెదననిన నది యశక్తి దుర్జనత్వంబు. నా మూఢత్వంబు చూచి యీ జన్మంబున నీవే దయదలఁచి నన్ను దాసునిఁగాఁ జేసితివి. నీకుపకారంబు దక్కెను. నా మనోరథంబు నీ దేఱెను; శ్రీ వేంకటేశ్వరా!

69

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా! సకలప్రాణుల శరీరంబులు నీకు క్షేత్రంబులు. నీవు క్షేత్రజ్ఞుండవు. జీవులు నీ కమతీలు. ఇంద్రియంబులు నీకు నేరు కలపలు. ఇహపరసౌఖ్యంబులు కాఱువేసంగిపంటలు. దేహానుభవంబులు నీవు వెట్టెడి జీతంబులు. లోకులు చేసిన ధ్యానానుష్ఠానఫలంబులు కొల్చు భండారంబులు. ఈ రీతి ముందరికిని నందఱ హృదయంబులను జ్ఞానభక్తి వైరాగ్యంబులనియెడి బీజంబులు మొలవంబెట్టింపుము; తొల్లి బలభద్ర రాముండవై నాఁగలి ధరియించి దున్ని కాళింది కాలువలు దీర్చితివట! శ్రీ వేంకటేశ్వరా!

70

అసురకులసంహారకా! నేను జన్మంబెత్తి వయోమదోద్రేకంబున యుక్తా యుక్తంబులెంచక మనస్సుం బాఱవిడిచి నానాభోగంబులనుభవించి యందువలనఁబుణ్యపాపంబుల యిఱుకునం జిక్కి కర్మబద్ధుండనై విడిపించుకొన శక్తుండఁగాక బందెదొడ్డిం జిక్కిన పసరంబువలెను, పాశమునం బడిన మర్కటంబుపగిదిని, జోగిచేతం జిక్కిన సర్పంబురీతిం, బసిరికాయలోని కీటంబువలె, నుండి నీవు సర్వలోకనాథుండ వగుటంజేసి విన్నవించితిని. నే నీకుం దగులైనవాఁడనగుట నీవు నన్నుఁ గరుణించి నీ ముద్రవేసి నీ దాసునిఁ

గాఁ జేసికొంటివి. ఈ సంతోషంబున నిన్నెంతయుఁగొనియాడెద నోహో! దేవరా! శ్రీ వేంకటేశ్వరా!

71

అమృతమథనా! మహాపురుషులు మిమ్ముంగోరి యతి ఘోర తపంబులు సేయువేళలఁబక్షులు దేహంబులం గూళ్లం బెట్టునట! ఇటువంటి నియమంబున మిమ్ము నేనెట్లు ధ్యానంబుచేసి ప్రత్యక్షంబు సేసికొని మెప్పించెద? ఇంతలేసి పనులకు సమర్థుండనా? మీకుఁ జేతులెత్తి మ్రొక్కంగలవాఁడ నింతేకాని; తొల్లి మీరు రామావతారంబైనవేళ వనంబున సంచరించునప్పుడు, కృష్ణావతారంబైనవేళ నందవ్రజంబున సంచరించునప్పుడు పాషాణతృణగుల్మ లతాదులు మీ పాదంబులు సోఁకి పావనంబయ్యెనట! అవి యే తపంబులు చేసినవి? మాకు మీ శ్రీపాదములే గతి; శ్రీ వేంకటేశ్వరా!

72

వైజయంతీవనమాలికాధరా! ఈ బ్రహ్మాది దేవతల యైశ్వర్యంబులు నీ దేవుల కటాక్షవీక్షణంబులోఁగించిన్మాత్రంబువలనం బొడమినవి. మహాపురుషుల మాహాత్మ్యంబులు నీవిచ్చు వరంబులలో లవలేశంబులు. అన్ని సదువుల ప్రభావంబులు నారాయణాష్టాక్షరంబులలోని సహస్రాంశంబులు. ఉత్పత్తి స్థితిలయంబులు నీ మాయాశక్తి సంకల్పమాత్రంబులు. నీ మహామహిమలం దెలియ నెవ్వరివశము? అగోచరములు! తర్కవాదములకభేద్యుండవు; యుక్తుల కసాధ్యుండవు; భక్తులకు సులభుండవు; నిన్ను నీవే యెఱుంగుదువు గాక యితరులకు నెఱుంగఁదరమా; శ్రీ వేంకటేశ్వరా!

73

నరకాసురవైరీ! ఈ కల్పంబున బ్రహ్మదేవునికి నేఁబదియేండ్లు చెల్లెనట! అతని యొక్కదివసంబున స్వర్గంబునఁ బదునలువురు దేవేంద్రులేలుదురుట. ఇప్పుడేడవ దేవేంద్రుఁడేలుచున్నాఁడట. నేను నాఁటనుండి యెన్ని జన్మంబు లెత్తితినో? యేయే జాతులంబుట్టితినో? నేను మనుష్యుండనని చెప్పుకొను టెట్లు? పుట్టువులు వేఱుగాని యప్పటి జీవుండనే నేను. ఇప్పుడు బ్రాహ్మణ

జన్మంబునం బుట్టించి శ్రీ వైష్ణవునిం జేసి యేలితిరి. నా యంత నే నెఱింగి మీకు విన్నపంబు చేసినవాఁడఁగాను. నాకుఁగా వేఱొకరు మీతోఁ బంతంబాడి యొడంబఱచినవారు లేరు. మీయంతనే మీరు దయందలఁచి నన్నుం బావనంబు చేసితిరి. మీరు నిర్హేతుక దయానిధులౌట యిందులోనే విశదంబాయె; శ్రీ వేంకటేశ్వరా!

74

సోమకాసురభంజనా! భూమిమీఁద సస్యంబులు పండి నానాధాన్యంబులుఁ గొండలు కోట్లునై కుప్పలుపడుచున్నవి. సస్యంబులకు బీజంబులొక్కటియును ఫలంబులధికంబులునై యున్నవి.ఇంత సామర్థ్యం బా బీజముల కెక్కడిది? మీ మహిమకెకాక. మీరు గలుగుటకిది లోకదృష్టాంతంబు. మిమ్ము నితరు లెఱుంగరానియట్లు వీపు గానరాదాఁగెదరు. మీరెటువలె నుండినను, వేద శాస్త్రంబులు మిమ్ముఁజాటిచెప్పకేల మానెడిని? మహాత్ములైనవారు మిమ్ము నెఱింగి కొలువకేల మానెదరు? మీ కరుణ యిందఱమీఁదఁబాఱ కెట్లుండెడిని? మీ దివ్యతేజఃప్రకాశంబులెటువలె మూసిపెట్టవచ్చు? చాలుంజాలు నింక మీ వినోదంబులు బయలుపడెను. విభాండకునికిఁ బ్రత్యక్షంబైనయట్లు, ముచికుందునికిఁ బ్రత్యక్షంబైనయట్లు, ఉదంకునకుఁ బ్రత్యక్షంబైనట్లు నాకు మీరు ప్రత్యక్షంబుగండు శ్రీ వేంకటేశ్వరా!

75

అయోధ్యాపురాధీశ్వరా! యే రీతి మనస్సు పట్టుదునో యే చందంబున మెప్పింతునో యే రీతిఁ గృప నా మీఁదం బాఱునో యెటువలె నా కభిముఖము చేసికొందునో యే క్రమంబున మీకుఁజనవరినై బ్రదుకుదునో యని మానసంబునం గోరుచుందును. నీవు నా యంతరంగంబులోఁ జేరువనే యున్నాఁడవు. బ్రహ్మాదిదేవతలకు దుర్లభుండవైన నీవు నాకెట్లు సులభుండ వయ్యేవంచుఁ జాతకపక్షులు మేఘంబులలోని జలంబులకాసపడినయట్లు, ఆకాశంబున నున్న సూర్యునితోఁ గమలంబులు చుట్టఱికంబులు చేసినట్లు, చంద్రోదయంబునకు సముద్రంబు పొంగినట్లు, వెన్నెలకుఁ జంద్రకాంతంబులు గరఁగినట్లు నేను మీ దర్శనంబునకు వీక్షింపుచున్నాఁడ. అయితే నేమి కొఱంత?

ఊరకున్న కీటంబుఁదెచ్చి తుమ్మెద తనుఁ జేయుచున్నది. ఈ భ్రమరకీట న్యాయంబు దక్కింపనింక దేవరచిత్తము, నా భాగ్యము; శ్రీ వేంకటేశ్వరా!

76

వాసుదేవా! దేవకీనందనా! గోపాలమూర్తీ! లక్ష్మీమనోహరా! భూకాంతా ప్రియా! గోపికావల్లభా! రుక్మిణీప్రాణనాయకా! సత్యభామామనోహరా! జాంబవతీసుముఖా! కాళిందీసరససల్లాపా! మిత్రవిందాభోగాలోకైకరతా! భద్రాకుచకుంభవిహారా! నీ రాసగ్రహాది సరససత్కథా ప్రసంగంబులు భాగవతపురాణంబులు. ఈ కథలు విన్నవారికిఁబుణ్యంబు లనంతంబులై పరలోకసాధనంబులగునటే! యివి యెటువంటి విచిత్రంబులు! నీ కౌతుకక్రీడలు మోక్షసాధనంబులట! శ్రీ వేంకటేశ్వరా!

77

ధ్రువవరదా! నాకు నెటువలెఁ బ్రత్యక్షంబయ్యెదవో! విభుని రాకకుం గాచుకొన్న విరహిణిచందంబున మీ రాకకు నెదురు చూచుచున్నవాఁడ. చన్నుఁబాలకు దేవుఱు స్తనంధయునిఁబోలి మీ భుక్తశేషంబు వెదకుచున్నవాఁడ. పొలముననుండి మేసివచ్చు ధేనువు రాకకుఁగ్రేపుచందంబున మీ దేవుల కటాక్షంబునకు నేఁకారుచున్నవాఁడ. హంసతూలికాతల్పంబుమీఁద శయనించు రాజురీతి మీ పాదంబులకు సాష్టాంగము సేయం గాచుకొన్నవాఁడ; నివి నా గుణంబులు. అపేక్షించినవారి నుపేక్షింపరాదని శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. అది యట్లుండనిమ్ము. ఏలిక మన్నించు కొలఁదినేకాని బంటునకుంగొసరఁగా నడుగరాదు. నీవు నా హృదయంబున నెప్పుడును నేమఱకుమా! అన్నియు సమకూడెడు; శ్రీ వేంకటేశ్వరా!

78

హలాయుధధరా! మన్మథుండనియెడు నింద్రజాల విద్యలవాఁడు సుందర స్త్రీ పురుషులచేత నింద్రజాలవిద్యల నాడింపుచున్నవాఁడు. అన్యోన్యా వలోకంబుల కమల కల్హార పుష్పంబులు గురియింపుచున్నవాఁడు. మోహ సముద్రముల నాకర్షించి బట్టబయల యీఁదింపుచున్నాఁడు. తుఱుమునఁ

జీకట్లును ముఖంబునఁజంద్రోదయంబును గాత్రంబున మొయిలులేని వానలును పరస్పర విహారంబుల నగ్నిస్తంభనలును రతిబంధంబుల సిద్ధవిద్యలునుం జూపుచున్నవాఁడు. ఈ యాటలకు లోనై సమ్ముఖంబులనున్న జీవులము మిమ్ము నెఱుంగ వెఱంగందుచున్నవారము; గాని, నీ వీ మాయలకు లోనుగాక చిఱునవ్వుతో వీక్షింపుచున్నవాఁడవు. ఆతని కీ విద్యలు నేర్పిన గురుండవు నీవె కాఁబోలుదువు. నీకు వినోదంబైన నాయెఁగాని మమ్ము బ్రమియింపకువే; శ్రీ వేంకటేశ్వరా!

79

ఖరదూషణవైరీ! నీవు కల్పించిన వేదోక్తధర్మంబు లించుకంత దప్పక నడచెనా పాపంబులు చెందవు. అటమీఁద పరకాంతలు పరధనంబులు వేడుక పుట్టించుచు ముందఱఁ బొదలంగా జీవులము చంచలచిత్తులము గనుక నా పాపంబులం దగిలి చేయక మానలేము. చేసిన కర్మంబులు బలవంతంబులు. అనుభవింపక తీఱదు. దాన మాకు సౌఖ్యంబు గాదు. మేము గావించు నేరములు మా మీఁద నుండంగాను మీకు నేమి విన్నపంబు చేసెదము? మీ యాశ్రయమనియెడి వజ్రపంజరమున్నది. మీ నామస్మరణ మనియెడి ఖడ్గమున్నది. మీపై భక్తియనియెడి కవచమున్నది. మీ కృప యనియెడి సహాయంబున్నది. నా యాచార్యులచేత సకల మీ దురితములను గండలుగాఁ గొని తునియలుచేసి పాఱవేయించెదవో కాక నీవే మాపై దయదలంచెదవో; శ్రీ వేంకటేశ్వరా!

80

చాణూరమర్దనా! మిమ్ముం బేర్కొని పిలిచి యావాహనముచేసి మా యింటిలోపలఁ బీఁటపైఁబెట్టి పూజించుచున్నవాఁడను. సముద్రుని కర్ఘ్యపాద్యాచమనీయంబుల నిచ్చినట్లు మేరుపర్వతంబునకు భూషణంబులు పెట్టినట్లు మలయాచలంబునకు గంధంబొసంగినట్లు వసంతునికిఁబుష్పంబులు సమర్పించినట్లు కస్తూరిమృగంబునకు ధూపంబిచ్చినట్లు సూర్యునికి దీపారాధన చేసినట్లు అమృతప్రదుండవైన నీకు నైవేద్యంబిచ్చినట్లు నీ రీతి మిమ్ము నలంకరించి యర్చింపుచున్నవాఁడ. నా చేఁతలకు మీరేమని నవ్వుచున్నారో లజ్జింపక యుపచరింపుచున్నాఁడను. అయినంగానిమ్ము. తొల్లి మీరు కృష్ణావతారంబై యుండెడువేళ మిథిలానగరంబున శ్రుతదేవుండనియెడి బ్రాహ్మణుండు మిమ్మింటికిఁదోడ్కొనిపోయి పూజింపఁడె? మత్స్యావతారంబైన నాఁడు సత్యవ్రతుండను రాజు అర్ఘ్యము సమర్పించి మీ రూపు దర్శింపఁడె? కుబ్జ మీకు గంధంబు లొసంగి సౌందర్యంబు వొందదె? మాలాకారుండు పువ్వుల దండలొసంగి మీచే మన్ననలు చేకొనఁడె? విదురుండు విందువెట్టి వెలయఁడె? ఇవి చూచి మాకుఁ గొంచింపం బనిలేదు. నీవు భక్తసులభుండవు, మే మేపాటి యారాధించినం జేకొందువు. శ్రీ వేంకటేశ్వరా!

81

దేవచూడామణీ! నీ పట్టినవి శంఖచక్రంబులు, ఎక్కినది గరుడవాహనము, తాల్చినవి చతుర్భుజంబులు, నీవు కావించిన కృత్యంబులు కంస కాళియ ముర నరకాసుర మర్దనంబులు. ఇటువంటి నీవు నీలమేఘశ్యామవర్ణంబుతో విష్ణుస్వరూపుండవై నటియింపుచుండఁగాను నిన్నుఁజూచి దేవకీ వసుదేవులు నెటువలె బ్రమిసిరి? తపంబు సేయుచుండెడి వ్యాసవాల్మీకాది మునీంద్రులు మిమ్ముం జిక్కించుకొని మోక్షంబడుగ నే రీతి నేమఱిరి? శాస్త్రంబులు చదువుచుఁబరబ్రహ్మంబును వెదకెడి బ్రాహ్మణోత్తములైన విద్వాంసుల వివేకంబులెందు వోయె? బ్రహ్మేంద్రాది దేవతలు మిమ్ము సేవించి మీ సాయుజ్యంబుఁబొందరైరి. వారి భాగ్యంబు లెక్కడనుండె? అది యట్లుండనిమ్ము; అనాది దేవుండవై యిప్పుడిందఱ హృదయంబులలో నున్నాఁడవట! నిన్ను భావించి మఱచియున్నారము; శ్రీ వేంకటేశ్వరా!

82

వరాహావతారా! నిన్ను వెదకి వెదకి వేసారితిని. నీవు పుట్టించిన బ్రహ్మాండంబునకు నమస్కారంబు. అట్టి బ్రహ్మాండమునకు నాధారంబయిన నీ రోమకూపంబునకు దండంబు. అజాండములోని నీ విశ్వరూపంబునకు సాష్టాంగంబు. నీ తిరుపతులకు వందనంబు. చరాచరంబైన నీ సృష్టికి నభివాదనంబు. నీ రూపంబులయిన విగ్రహంబులకు మొడ్పుఁగేలు. నీ యంతర్యామిత్వంబునకు జోహారు. నీవున్న శేషాచలంబునకు వందనంబులు సేయుచున్నవాఁడ. అందున్న నీ మూర్తికి శరణు. నన్ను నీ కరుణాదృష్టి నవలోకింపుము. నా యజ్ఞానంబు చెఱుపుము. నీ పాదంబులపై భక్తి నా కెల్లపుడుం బాయకుండఁజేయుము. శ్రీ వేంకటేశ్వరా!

83

అమితకల్యాణగుణాకరా! జాతికులశీలవిత్తంబులచేత నాకు గర్వంబు రేఁపుచున్నది నా చిత్తంబు; దీనికి బుద్ధి చెప్పుము. నాకు వశంబుగాదు. లోకంబులో వర్తమానంబు విచారించి చూచిన దాసీజనంబులకుం జెల్లునే యహంకారంబు; షండునకు వచ్చునే కామోద్రేకంబు; కార్యాతురునకుఁ గూడునే లోభంబు; దీనున కున్నదే బలిమి; ఆఁకొన్న వాని కుండునే మదంబు; అశక్తునకు వెలయునే మత్సరంబు; ఇటువంటి వారికెల్లను వారివారికి నా యా గుణంబులు సహజంబులు చేసి యిప్పించితివి; ఇవియెల్ల నసంభవ బ్రహ్మచర్యంబులు. అందులకేమి? నాకు నీ దర్శనంబు చూపి నా స్వతంత్రంబున నా తపోరాజ్యంబీడేర్పుము. నీవెట్లు చేసిన నట్లౌను, నీవు నా లోపల నున్నాఁడవు. శ్రీ వేంకటేశ్వరా!

84

అధోక్షజా! ఎవ్వని రోమంబున నజాండకోట్లు వొడమె; నే మూర్తి నాభికమలంబున బ్రహ్మ జనించె; నే మహాదేవుని పేర "శ్రీమహావిష్ణో రాజ్ఞయా" యని మహాసంకల్పంబు చెల్లుచున్నది; ఏ వస్తువుఁబురాణపురుషుండని చెప్పెదరు; ఏ బలవంతుని దానవవైరి యంద్రు; ఏ ఘనుండు సముద్రంబుద్రచ్చి యమరులకమృతంబు పంచిపెట్టె; నే పురుషునకు ప్రహ్లాద నారద వసిష్ఠాదులు దాసులు; ఏ ఘనునకు సూర్యచంద్రులు కన్నులు; లక్ష్మీపతి యెవ్వండు; సర్వ రక్షకుండెవ్వండు; యజ్ఞకర్త యెవ్వండు; యజ్ఞభోక్త యెవ్వండు; మోక్షంబియ్యఁ గర్త యెవ్వండు; అతండవే నీవు. అట్టి నీకు ననంతనమస్కారములు సేసెద; చిత్తావధారు. శ్రీ వేంకటేశ్వరా!

85

యోగేశ్వరా! పరమజ్ఞానులైనవారికిఁ గామక్రోధలోభమోహమద మాత్సర్యంబులడంగవలయు. అవి యెటువలె నుడుగవచ్చు? ఎండ నుండిన యతండు నీడకుం బోవఁదలంచిన నదియె కోరిక యయ్యెడిని; ఈఁగ తన మీఁద వ్రాలినఁ జోఁపుకోఁగణంగిన నదియే క్రోధంబయ్యెడిని. తన మంత్ర మొరులకుఁ జెప్పకుండిన నదియె లోభంబయ్యెడిని. పరులు దండంబు

వెట్టినవేళ దీవించిన నదియె మోహంబయ్యెడిని; భిక్షాన్నంబు భుజియించి తృప్తిఁబొందిన నదియె మదంబయ్యెడిని; శిఖలోపలఁబేలు దిరుగం గ్రోఁకి కొనిన నదియె మాత్సర్యంబయ్యెడిని. ఈ ధర్మంబులెల్లఁ దప్పకుండ నడపెద నని యెంచి చూచిన నా వలన నన్నియుం దప్పులే; సర్వాపరాధంబులుంజేసి నీ మఱుఁగుఁ జొచ్చితి నన్నుంగావవే; శ్రీ వేంకటేశ్వరా!

86

సీతాపతీ! మీ యాకారంబు కనులఁజూడ నెవ్వరి వశము? మీ భక్త వాత్సల్యాది గుణంబులు దలంచుకొని కొంతదడవు జయవెట్టి మీ కల్పించిన జగత్తు చూచి కొంతదడవాశ్చర్యంబు నొంది సర్వమైనవారికి వరంబులొసంగెడి మీ యుదారత్వంబు కొంతదడవు చింతించి మెచ్చి యహల్యా ద్రౌపదీ ప్రహ్లాదాదులకుఁ బ్రసన్నులరైన మీ మహిమ కొంతదడవు దలపోసి పొగడి రావణ కుంభకర్ణ ముఖ్య దానవులఁ జెండాడిన మీ ప్రతాపంబు కొంతదడవు దలంచి విభీషణ హనుమత్ప్రభృతుల మన్నించిన మీ కీర్తి కొంతదడవు పెద్దలచే విని మీకుఁజేతులెత్తి మ్రొక్కి పరబ్రహ్మంబవై విలసిల్లు మీ ప్రభావంబు కొంతదడవు దలపోసి కొనియాడఁగలవారము. ఈ రీతిం గాలక్షేపంబు చేయఁగా మీరు మాకుఁబ్రత్యక్షంబైనట్లుండిరి. శ్రీ వేంకటేశ్వరా!

87

సర్వేశ్వరా! అవధారు; జగంబు నీ నాటకశాల; నేనెత్తిన తొలు జన్మంబులు నీ ముందర నాడెడి బహురూపంబులు; దార సుత బంధు జనంబులు మేళగాండ్రు; నిన్ను నుతించిన వేదశాస్త్ర పురాణంబులు తూర్యత్రయంబు. మా పాదప్రచారంబులు నాట్యంబుసేయు చేఁతలు; ఆడెడి మాటలు క్రియా భాషాంగంబులు; భోగవస్తువులు మీరు మెచ్చి యిచ్చిన యీవులు; ఈ రీతి నెంతగాలంబు మీకు వేడుక యంతగాలంబు నాడెదము. మీ కొలువు నర్తకులైనవారము మీకు వినోదము చేసికొని బ్రతుకవలయుఁగాని నెమ్మది మోక్షంబున నుండెదమనుట యే సంగతి? మీర దయదలంచి కృపచేసిన నపుడయ్యెడుఁగాక, యెఱుకగల యేలికఁగొల్చినవారికి నడుగ నేదిపని? ఇంక నన్నిట మన్నింపవే; శ్రీ వేంకటేశ్వరా!

88

మదనజనకా! మిమ్ము నే ధ్యానంబు సేయునెడ మీ యవయవ సౌందర్యంబు దలంప నేరకుండినను మీకు శతకోటి జన్మాధారమైన చక్కఁదనంబు దాఁచరాదు. మీ తిరుమేనికది సహజంబు. మీ పరాక్రమంబు నేఁబొగడ నేరకుండినను శంఖచక్రాద్యాయుధంబులు భుజంబుల ధరియింపవలయుఁ గాని మానరాదు. మిమ్ము నే శృంగారింప నేరకుండినను మీ కిరీట కుండల పీతాంబరాభరణంబులు లోకాలంకారంబులు గాకపోవు. శ్రీదేవియు భూదేవియు మీ యుభయపార్శ్వంబుల నుండ నేను మీ కైంకర్యంబు సేయ సమర్థుండఁ గాకుండినను అనంత గరుడ విష్వక్సేనాది పరివారంబులు మీ కొలువు సేయుదురు. ఇంక నప్రయత్నంబున మీ పేరు నుడివిన మీరు చనుదెంతురు. మీ వెంట నన్నియుఁ జనుదెంచును. మాకు బహువిచారంబుల నలయనేల? మిమ్ముఁ బేరుకొనుటే యన్నింటికి మూలము. నిత్యానుసంధానంబిందులనే కలిగె. శ్రీ వేంకటేశ్వరా!

89

ఈశ్వరేశ్వరా! చదువం జూచిన సంశయంబులె పుంఖానుపుంఖంబులై తోఁచును. చదువకూరకుండిన జ్ఞానంబు వొడమదు. మఱి నిన్నుఁ బలుదిక్కుల వెదకెదమని కన్నులం దెఱచిచూచిన లోకవ్యాపారంబులు భ్రమలం బెట్టెడిని. ఱెప్పలు మూసికొన్నను బలుచింతలు ముంచుకొనును. పుణ్యంబులు చేసియైన నిన్నుం గనియెదమనిన నవి బంధకంబయ్యెడిని. చేయకుండిన సర్వనాస్తికుండ నయ్యెద; నీ యర్థంబొరులతోడ నే యోజించి చూచిన బహుకుతర్కములు వొదలెడి;మానిన సర్వసిద్ధాంతంబులు దెగవు. జగంబు బహుసందేహ కారణంబు. తత్త్వంబేగతి నిశ్చయింపవచ్చు? కావున నేమి సేయంగా నేమి యగునో నీ దాసులు వోయినత్రోవ నడచి వారల యభిమానమునం బొదలి నీకు శరణంటిని; నీవే వహించుకొని నన్నుం గాచెదవు. శ్రీ వేంకటేశ్వరా!

90

శేషశయనా! నే నీమీఁద నే వలన నీ చిత్తంబువెట్టెద? నా యోగంబులు కాంతాసంయోగంబులు; నా నియమంబులు రేపుమాపు నన్నపానంబులు

గొనుటలు; నా నిత్యకర్మంబులు సంసారకృత్యంబులు; నా వ్రతంబులు రాత్రి నిద్రించుటలు; నా ధర్మంబులు శరీరభోగంబులు; నా పదవులు బాల్య కౌమార యౌవనావస్థలు; నా ఘటనలు పుణ్యపాపంబులు; నా వేదపాఠంబులన్యోన్య ధిక్కారంబులు; నా పంచయజ్ఞంబుల; పంచేంద్రియ వ్యాపారంబులు; ఇవి మా వర్తనలు; నిన్నెంచి చూచిన సకలలోకోన్నతుండవు; నిన్నుఁబరికించి చూచిన నంతర మహాంతరంబుల నాలోనుండి రక్షించుచున్నాఁడవు; నీ గుణంబులరుదయ్యెడి; శ్రీ వేంకటేశ్వరా!

91

నరహరీ! మొదలనే నోరు మాటలపుట్ట; మౌనంబెట్లు సిద్ధించు? వీనులు గిరిగుహలవంటివి. ఎవ్వరు మాటలాడినఁ బ్రతిధ్వనులవలె నాదింపుచుండు; అవి వినకుండ నెట్లుండవచ్చు? కన్నులు రూపంబులకు నద్దంబువలె నున్నవి. ఇందు సకలంబును ప్రతిఫలించుచుండఁగాఁ జూడకుండ నెట్లుండవచ్చు? నీ దేహంబు నాఁకలి దినదినము పీడింపఁగాఁ జవులుగొన కెట్లుండవచ్చు? ముక్కున నొక్కొక్కదినము పదియొక్క వేయున్నాఱునూఱుల యుచ్ఛ్వాసములు గలుగఁగా వాసనలు గ్రోలకెట్లుండవచ్చు? నన్నియు నే ననుభవించిన నేమి నీవు రక్షకుఁడవైయుండఁగా; నేను నీకు గుఱి; నీ పాదంబులు నాకు గుఱి; నన్ను నీవెల్ల విధంబుల రక్షింతువుగాక; శ్రీ వేంకటేశ్వరా!

92

ద్వారకావాసా! దేవుండవైన నీకు నా చర్మ మాంసాస్థిమయంబులైన కరంబుల మ్రొక్కుచున్నవాఁడను. పరమపావనంబైన నీ తిరుమంత్రము నా యెంగిలినోర నుడువుచున్నాఁడను. గోపికలు నీవు రహస్యంబున వినోదంబులు సలిపిన సుద్దులు నా వీనులను వినంగడంగెదను. ఏకాంతంబున లక్ష్మీసమేతుండవైన నిన్ను వేళయెఱుంగక సేవింతును. కోమలంబైన నీ తిరుమేను నాకఱకుం జూపులఁజూచెదను. నీ చిత్తంబు దెలియక యావాహనంబుచేసి పూజించెద; నిది యపచారమో యుపచారమో యెఱుంగ; నేమి చేసినను నీ దాసులకు నేరమెంచనిది నీ గుణము. నీవు కలవని వెఱవకుండ మందెమేలమున నపరాధములు చేసెద నోర్చుకొనుము; శ్రీ వేంకటేశ్వరా!

93

విట్ఠలేశ్వరా! సాహసంబెట్టిదో కాని నిన్ను నడుగరాని ఫలంబులడుగఁగోరెడు నా మనంబు. జిహ్వ నాకుందగని పదార్థంబులు నిన్నడుగ నిశ్చయింపుచున్నది. నా గుణంబభేద్యంబైన నీ మనస్సుశోధింపఁ గడంగెడు. నా బుద్ధి తెలియరాని రహస్యోద్యోగంబులు వెదకుచున్నది. నా హృదయంబు నందరాని పదంబులకు నాయత్తపడుచున్నది. నా వేడుక నా వలన నీకు నయ్యెడు భోగంబు విలోకించును. నన్ను నీవు సంతసంబునుం బాయక నానాభోగంబులిచ్చి యుపకారంబు లెంచుకొనఁజేసిన మేలెఱుంగనివాఁడ నపరాధిని; ఏమని విన్నపంబుచేసెదను? లోకజననియైన నీ దేవిం జూచియైనను కరుణానిధివైన నిన్నుఁ జూచుకొనియైనను నన్నుంగావవే; శ్రీ వేంకటేశ్వరా!

94

త్రివిక్రమా! మీరు సాలగ్రామ చక్రపాణి దేవపూజాశ్వత్థతులసీ సేవా గో బ్రాహ్మణవందన తీర్థస్నాన వేదపాఠ తపోయజ్ఞైకాదశీవ్రత దాన సంకీర్తనాదుల చేతం గృతార్థులు గండని జనులకుఁ బుణ్యంబుల చూఱలిచ్చితిరి. ఎదుటఁ గానవచ్చిన మీ మూర్తుల నాశ్రయింపనేరక కొందఱు కానరాని పరమ పదంబున నిన్నుఁ జూడఁగోరెదరు. అది మాకెంత దుర్లభంబు? ప్రత్యక్షంబైన మిమ్ముఁ గొలిచినఁ బరోక్షంబు మీరే యిచ్చెదరుగాక వేగిరింప నేటికి? మీరుభయ విభూతి నాయకులరు. మిమ్ము నింతశోధింప సమర్థుండనా? మీ దాస్యమే నేఁగోరంగలవాఁడఁగాక; శ్రీ వేంకటేశ్వరా!

95

నరసింహా! నేను భూలోకంబున నెనుబది నాలుగులక్షల జంతువుల గర్భంబు లందు వెడలిననేమి? నాకు నలయికలేదు. నీవు నాకంతరాత్మవై వెనువెంటఁ దిరుగంగా నీ శ్రీపాదంబు లెంత బడలెనోయని విచారించెద. అదియునుగాక మున్ను స్వర్గనరకాదిలోకంబుల సుఖదుఃఖంబులనుభవించెడి వేళలో నీవు నాలోనుండి నామీఁద దయ నేమనుచుంటివో యని తలంచెద. నే నుపవాస ములుండి శీతోష్ణంబుల సహించి తపంబులు సేయుతఱిని నీకు బడలిక

సోఁకదుగదా యని యూహించెద. నీకుఁ దిరువారాధన సేయుచో నాహ్వానంబు సేసి యారగింపుసేయు సమయంబున నేమి చవిగాకుండునో యా వేళ యెటువలె నుండునో యెఱుంగక కొంకెద. కొండంతవాని నిన్ను సూక్ష్మంబుగాఁ జేసికొని యాత్మలోఁ దలంపఁగా నీకుఁ గక్కసంబయ్యెడినో యని వెఱచెద; నా సర్వాపరాధంబులు క్షమింపవే; శ్రీ వేంకటేశ్వరా!

96

భీమవిక్రమా! జ్ఞానంబనియెడి శృంగారంపుఁదోఁటలోఁగామక్రోధంబు లనియెడి వరాహంబులు రెండు గుద్దలింపుచున్నవి. శమదమంబులనియెడి యోదంబులు ద్రవ్వి వానిం బడఁద్రోచెద నంటినా నా పూర్వజన్మ ప్రతి బంధంబులనియెడి భల్లూకంబులు రెండు నందులోనే ఘోషించుచున్నవి. నీ మీఁది యాశాపాశంబులనియెడు త్రాళ్లు దీసి వానింగట్టిత్రోయుము. తొల్లి నీవు మాయామృగంబునేసిన వేఁటకాఁడవు గనుక విన్నవించితి. శ్రీ వేంకటేశ్వరా!

97

త్రిదశవంద్యా! ఈ ప్రాణులనేకకాలంబులవారు బహు కల్పంబులం జేసిన బహువిధకర్మంబు లసంఖ్యంబులు గలవు. అనుభవింపక శక్యముగాదు. వంశంబులందొక్కరుండు శ్రీవైష్ణవుండైతేను కులకోట్లెల్లను గృతార్థులగుదురని పురాణంబులు సెప్పుచున్నవి. ఒక్కసారి మిమ్ము మనస్సునఁ దలంచిన దురవస్థలైన యాపదలు గడచునట! ఫలపుష్పంబులు మీ పాదంబులపై వేసిన నానా పుణ్యంబులు చేకూడునట! మీ మహిమలతివిచిత్రంబులు; చెఱువునీళ్లు చల్లి ఫలము గొన్నట్లు ధేనువులు తృణములమేసి దుగ్ధములు పిదుకునట్లు బిడ్డఁడు తల్లిదండ్రులతో ముద్దులంగురిసి సంరక్షణ సేయించు కొన్నట్లు పెద్దలకుఁ జేతులెత్తి మ్రొక్కి దీవనగొన్నట్లు నీ రీతి సులభోపాయంబుల మిమ్ము మెప్పించుకొని మీచే మెప్పులు పుచ్చుకొనియెదము. మాకుం బ్రసన్నుండవు గమ్ము; శ్రీ వేంకటేశ్వరా!

98

వాసుదేవా! నీవు సముద్రంబుపైఁదేరు వఱపి కులాచలంబులు క్రుంగఁ ద్రొక్కి చక్రవాళపర్వతంబు దాఁటి చీకటి నఱకి దివ్యతేజంబుచొచ్చి పోయి బ్రాహ్మణుని కొడుకును దెచ్చితివట! తలఁచినప్పుడె గరుడవాహనంబును శంఖచక్రాద్యాయుధంబులును రప్పించి యనేక భుజంబులతో వెలుఁ గొందుదువట! సూర్యునికిఁ జక్రంబు మఱుంగువెట్టి సైంధవుని సంహరింపించి తివట! గోవర్ధనోద్ధారణంబును ద్వారకా నిర్మాణంబును మొదలైన యతిమానుష కృత్యంబులెన్ని వలసినంగలవు. నీ మహిమలు చెప్పెద నన నవాఙ్మానస గోచరంబులవి. చాలదే నవనీతచోరత్వంబును, వత్సబాలహరణంబును, గోవత్సపరిపాలనంబును, దామోదరూలూఖలబంధనంబును, కుబ్జాప్రాణ నాయకత్వంబును; ఇవియే కీర్తులు నెగడించు; శ్రీ వేంకటేశ్వరా!

99

సీతావల్లభా! నా కవితాకన్యకు నీవు వరుండవు. దైవమానుషంబులు గణపొంత నములు. నా జిహ్వయే పెండ్లిపీఁట. నా మనస్సే తెర. నా సంతోషకళలే బాసికంబులు. నా భక్తియే కంకణంబు. అక్షరంబులే తలఁబ్రాలు. శబ్దంబులే వాద్యఘోషణంబులు. స్మృతిస్వరంబులే పేరంటాండ్రపాటలు. చూపులే మంగళహారతులు. నా వాక్యంబులే పువ్వుదండలు. నీ సహస్రనామములే బంధువులు. నీ యాత్మగుణంబులే శోభనద్రవ్యంబులుగాఁ గైకొని యీ రీతి వివాహంబైతివి. ఇంక నా కర్మబంధంబు లూడెఁగదే నీ విట్లు పాణిగ్రహణంబు చేసికొంటివిఁక నీ దేవులు నీవును చిరంజీవులై యుండి సంగీత సాహిత్య నానాలంకారాది పుత్రపౌత్రాభివృద్ధి వెలయుచు నీ దాసుల రక్షింపవే; శ్రీ వేంకటేశ్వరా!

100

శ్రీపురుషోత్తమా! కరిరాజుంగాచితివి. కొలువులోపల ద్రౌపదిమానంబు నిల్పితివి. ప్రహ్లాదునిమాట లాలించితివి. శరణుసొచ్చిన విభీషణుని రక్షించితివి. రావణకుంభకర్ణాదుల వధియించి లంక నేలించితివి. పాతాళంబు బలికి నొసగితివి. ధ్రువునికి ధ్రువంబుగాఁ బట్టంబు గృపచేసితివి. నిన్నెవ్వరెఱింగి నుతింతురు వారికి నీ పదవులిచ్చి రక్షింతువు. శ్రీ వేంకటేశ్వరా!

101

కరుణాకటాక్షా! ఎవ్వరెవ్వరి జన్మంబులు వారివారికి హితవులై తోఁచుచుండం జేసితివి. దేహత్యాగంబులు నిర్బంధములు వెడలిన తెఱంగున మనసులను సమ్మతింపఁజేసితివి. పాపమూలంబయిన క్రీడన సమయంబులు నన్నపానాదిరుచులు స్త్రీభోగంబులు సుఖంబులై తోఁచుచుండం జేసితివి. కర్మానుభవంబులైన పరలోక సౌఖ్యంబులు, తదనుగుణంబులైన దివ్యశరీరంబులు నిచ్చుచున్నాఁడవు. ఈ రీతి సర్వజంతుల కవ్యాజాంతర సుఖంబులు గలుగఁగా మాకు నెక్కడ నున్ననేమి? శ్రీ వేంకటేశ్వరా!

102

వేణునాదప్రియా! నేను బంటనైనందుకు నీకేమిగుఱి! నా నుతులవల్ల నీ కేమిలాభంబు గల్గె? మఱియు నే మ్రొక్కంగానైన ఫలము నీకేమిటికి? నిన్నుఁ గూర్చి యుపవాసతపంబులు చేయఁగా నీవు గట్టుకొనియెడిది యెంత? మా నియమ వ్రతంబులచేత జన్మంబులు మఱియును మొలపించుచున్నాఁడవు. జీవునికి జన్మమరణంబులు నిర్బంధంబులై తోచవు. ఇన్నిటికి నీవు కలుగంగా జంతువులకు సుఖదుఃఖంబు లనుభవింప సులభంబాయెను. నీవు దయానిధివి. నిన్నుం గొల్చిన వారికి నీవు కామధేను కల్పవృక్ష చింతామణులై ఫలియింపం గంటిమి. శ్రీ వేంకటేశ్వరా!

103

యజ్ఞరక్షకా! పాపంబు లూరకె యజ్ఞానులమై చేసితిమిగాక మీఁద దాఁచిపెట్టితిమా? పుణ్యంబులని కొన్ని వినోదించి నీ కృపంజేయంగా ననుభవించెదము గాక మేము ఫలంబులు మొలవంబెట్టితిమా? యీ రెండు మాలోనుండి చేయించంగాఁ జేసినసేఁతలు, అది మీరెఱింగి యుండియును నిష్ఠురము గట్టుకొనక దాక్షిణ్యంబున కర్మంబులనుచు మొదళ్లు కుదుళ్లు గదలించి మాయలు చేసెదరు. మీ దాసులైన వారు మిమ్ముఁ దలఁచిన మాత్రంబున దోషంబు లపహరించెదరు. మీరెట్లు చేసిన నట్లౌను; లోకంబున 'రాజానుమతో ధర్మ' యనియండ్రు; మీ యనుగ్రహంబు మాకు మంచిది రక్షింపవే; శ్రీ వేంకటేశ్వరా!

104

కాళింగమర్దనా! జ్ఞానంబును నమ్మి కర్మంబులు విడువంగా నీ యాజ్ఞనుల్లంఘించినట్లుగునో యని మనంబున శంక పుట్టెడిని. కాక విహిత కర్మంబులు చేసి చేసిన ఫలంబు నీకు సమర్పించెద నన నీవవాప్త సకల కాముండవు. ఇది నీకేమి ఖ్యాతిగా నొసంగెదనని సిగ్గయ్యెడిని. లోకదూషణంబులకు లొంగి కర్మంబులు సేయఁగా బంధకంబులయ్యెడినోయని చింత పుట్టెడిని. ఇందుల కొకమాట. కర్మంబులు జ్ఞానసాధనంబులంటివి. వేఱొకమాట జ్ఞాన మెక్కుడని యానతిచ్చితివి. లోకులకు రెండుమాటలు కర్మకాండ, జ్ఞానకాండల వలె నిశ్చయించితివి గాని యొకటి నిశ్చయింపవైతివి. ఇందుకు వివేకియైన పురుషుఁడు దనకెంత మాత్రమునకు నధికారము కలిగె నటువలెం జేసికొనియెడిని. నీ వలనం దప్పులేదు; శ్రీ వేంకటేశ్వరా!

105

శ్రీధరా! దేహధారియైనవాఁడు దివంబున సంసారమత్తుండై రమియించి రాత్రివేళ పగ లింటియాందోళనంబు కలలోపలంగని వెఱఁగునొంది సంసారం బిట్టిది గదా యని వైరాగ్యనిష్ఠుండనై యుండెదనని యొక పుణ్యక్షేత్రంబున వసియించి యచ్చట నొకానొకవేళఁ దొల్లి పుత్రమిత్రకళత్రాదులతో వినోదించిన చందంబు దలంచి యా మనోరథంబుల నోలలాడి మనస్సు కరఁగఁజొక్కి తెలిసిచూచి యెవ్వరింగానక బట్టబయలు భ్రమిసితిం గదా యని నిర్వేదనంబొరలుచుండు. నటుగావున గట్టిగా పట్టరాని దీమసం బిట్టిదెకదా! ఉల్లివాసన యంటిన పదార్థంబునఁ గస్తూరిపరిమళం బంటనేర్చునే? ప్రాకృతిక వాసన యందినవాఁడు మోక్షసుఖంబెట్లు వెదకు? మీ మాయాప్రపంచంబిట్టిది గెలువరాదు. మీరే దయఁజూడవలయు; శ్రీ వేంకటేశ్వరా!

106

అనిరుద్ధా! నిత్యంబును జీవులు నిద్రాసమయంబున నంతర్యామివై సంతుష్టుఁడవై యున్న నీయందుఁ బ్రవేశించి యందే నీవు సృష్టింపగాఁ గలలుగని మేలుకొని యింద్రియద్వారంబుల లోకవ్యాపారంబులు చూచి భ్రమయుదురుగాని

నీయందు నుండియు నిన్నెఱుంగరు. గర్భంబులలోనున్న శిశువులు తల్లుల రూపెఱుంగనియట్లు నిన్నుఁ దెలియనేరక చదువులలో వెదకుదురు. నీవున్న నెలవు తమ యంతఃకరణంబని యెఱుంగరు. నేమెటువలె నుండిన నేమి? నీవు పూసలలో దారమై యున్నాఁడవు. నీ సన్నిధానంబున నున్నవారిని నీవే కరుణింపవలయు; శ్రీ వేంకటేశ్వరా!

107

శ్రీహరీ! భువిలోన శునకసూకరాదుల వాని వాని జన్మంబులు సుఖంబు లౌనట్లుగా నడపుచున్నాఁడవు. నరకబాధలనుభవించు వారికి యాతనా దేహంబులలవరించి ఛేదన తాడనాదులచేఁ దదంగంబులు మఱియును దొలిపించుచు బాధ ననుభవింపఁ జేయుచున్నాఁడవు. శరీరంబులు నిర్బంధంబులు గావున నిన్నిటికిని నీవు గలుగంగా సుఖదుఃఖంబు లనుభవించుటలు సులభంబాయెను. నీవు దయానిధివి. నిన్నుఁ గొల్చినవారికి నీవు కామధేను కల్పవృక్ష చింతామణులై ఫలియించుట గంటిమి; శ్రీ వేంకటేశ్వరా!

108

శ్రీ కృష్ణా! నిన్ను గోపికావల్లభుండవని నియమంబున జపియించిన వారికిం బ్రసన్నుండవగుచున్నాఁడవు. అవులే; నీ జారత్వంబుందడవిన నీకు వేడుక పుట్టెడినో కాక నీ మర్మంబు దడవినవారల నుపచరించుటో కాక యిట్టి ప్రసంగంబులం దలంచిన మనస్సు కరగునో కాక యహల్యాజారుండవని నొడివిన నింద్రుండు మెచ్చుచో నీవును నుపేంద్రుండనని వంశానుచారంబైన వ్రతంబు జరపుటో తెలియరాదు. మాకు నిన్నింత శోధించి యడుగం బనియేమి? నీకు నిష్టంబు సేయుటే మాకుఁ బ్రయోజనంబు. నీకెంత కాముకత్వంబు ప్రియంబైనంబోలు! నేఁటనుండి మేము నిన్ను శ్రీ భూమినీళాసమేతుండవని, వ్రజాంగనా నాథుండవని, అష్టమహిషీ ప్రాణవిభుండవని, శతోత్తర షోడశ సహస్ర కాంతారమణుండవని నుతించెదము; శ్రీ వేంకటేశ్వరా!

109

భూపతీశా! భూలోకంబున నన్నుఁబలుమాఱు పుట్టించెదనని నీకేమైన వ్రతంబా? నాకు నన్ని వేడుకలు నొసంగెదననియెడు నుదారత్వగుణంబుగాక? నీ ప్రకృతి నన్ను సతతంబుఁ బాయకుండెడి; నా తోడిదిచలంబా, సకల భోగంబులు నన్ను ననుభవింపఁజేసెద ననియెడు మాతృవాత్సల్యంబుగాక? ఈ రీతి మీరు పాలించి సంసారసౌఖ్యంబులు ప్రసాదింపఁగా నుల్లంఘించి మోక్షంబు గోరెడు మంకుతనంబు నాకుఁదగదు. మీరు నియమించినట్లు నిచ్చలు మెలంగుటే నాకు ధర్మంబు. అయినంగాని యింకొక విన్నపంబు చేసికొనియెద, విన నవధరింపుము. నా మనంబులో మీరుండవలె, కన్నులను మీ మహోత్సవంబులఁ జూడవలె; వీనుల మీ కథలు వినంగావలె. నోటికి మీ కీర్తనంబు కృపచేయవలె. నిదియె నాకుఁ బరమపదంబు; శ్రీ వేంకటేశ్వరా!

110

శ్రీనివాసా! దేహంబులై పొదిగెడిది నీ మాయయట. అందులోని చైతన్యంబు నీవట. కోరికోరి సుఖదుఃఖంబులనుభవించువారు జీవులట. ఇన్ని చందంబులం గలిగెడు ఫలంబులు స్వర్గనరకంబులట. ఇవి యెన్నటికిఁదెగని కర్మ బంధంబులట. ఈ సంసారంబు చేసి కూడఁబెట్టంగా మిగిలిన లాభంబులు పుణ్యపాపంబులట. ఇవి నీకు లీలావినోదంబులట. దీనికి తుద యేది? మొదలేది? ఇటువలె ననాదియై సత్యమై జరగుచున్నది ప్రపంచంబు. ఈ యర్థంబుఁ దెలియఁదరముగాదు. ఇంక నేమని విన్నవించవచ్చు? మీ చిత్తంబు నా భాగ్యము! శ్రీ వేంకటేశ్వరా!

111

పరమేశ్వరా! నా శరీరంబు నాకు రథంబు. నా పుణ్యపాపంబులే గుఱ్ఱంబులు. నా యాసలే పగ్గంబులు. నా కామక్రోధంబులే యాయుధంబులుగాఁ గైకొని జన్మపరంపరల నిహపరలోకంబుల సంచరించిన విజయ పురుషుండ నేను. నీవు జగన్నాథుండవనఁగా విని యిప్పుడు నిన్నుం గొల్చితిని. సుజ్ఞానధనంబు జీతంబు పెట్టి యేలుము. ఇంతకాలంబు నీ మాయలంబరగిన మర్మజ్ఞుండ నేను నీకు సేవకుండనై యుండుట నీకు మేలు; శ్రీ వేంకటేశ్వరా!

112

రాధావల్లభా! సకల యజ్ఞంబులకంటె జ్ఞానయజ్ఞంబధికంబనియును, అందులఁగర్మఫలంబులన్నియు సమాప్తంబులై పోవుననియును, అది నీ వెఱుంగుమనియును, తత్త్వవేత్తలకు దండంబువెట్టి ప్రార్థించి యడిగితేను వారు నీ కీ జ్ఞానంబుపదేశించెదరనియును, ముందర నీ యాత్మలో నీవే యెఱుంగుదువనియును అర్జునునకు పెద్దలం జూపి చెప్పితివి మొదల; నా తర్వాత నీవే వహించుకొని అన్ని ధర్మంబులు నంటువెట్టి నాకు శరణుసొచ్చిన మాత్రాన నే రక్షింతునని సత్యంబుచేసి యిది యెవ్వరికిఁ జెప్పకుమని యితర తత్త్వము మాని నిన్నె కొలువంగట్టడచేసితివి. అటుగాన కేవలజ్ఞానులకుఁ గర్మంబులు చేయనిదోషంబులు లేవనుటాయెను. ద్విజాతులు నీ యాజ్ఞా కైంకర్యంబులు సేయుదురు. కాన యవియును వారలకు బంధకంబులుగావు. నీవు పెట్టినచిక్కు నీవే తీర్చితివి; శ్రీ వేంకటేశ్వరా!

113

పాంచజన్యధరా! అనాదికాలంబున నుండియు జీవులంబాయలేక ఆత్మలో నుండుదు వది యంతకంటెను లాభంబింక నేమి వెదకెడిది? జీవులంటిమా నిత్యులు. వారికై చింతింపవలదు. నీ లీలార్థంబైన శరీరంబులు మోచినవారలుం గావున ప్రాకృతవికారంబులైన సుఖదుఃఖములనుభవించిన మంచిదే. యేలినవారి పనులయెడం బంటునకు నేమి వాటిల్లిన నేలికకే కలవు. నీవే రక్షించెదవుగాక, అందులకు వెఱవఁబనిలేదు. నీవు గలవని నమ్మి నిర్భయత్వంబున నుదాసీనత్వంబున నుండవలసినది. నీ దాసులైన వైష్ణవులకు పరమపదంబు సిద్ధంబు. ఆధ్యులై మిమ్ము మఱచినవారికి సంసారమేగతి. ఇటువంటి లోకుల నీడువెట్టుకొనవలదు. ప్రసన్నులైనవారలకు నీవు రక్షకుండవు; శ్రీ వేంకటేశ్వరా!

114

పురాణపురుషా! అప్రతిహతప్రతాపుండవు. అవాప్త సకలకాముండవు. అఘటన ఘటనా సమర్థుండవు. అపార కృపానిధివి, అశరణశరణ్యుండవు. అసంఖ్యాత కల్యాణగుణుండవునైన నీ వబ్జభవాండంబు నీ పాదంబు గోట గీరిన నీరై పాఱెను. నీవు గావలయుననిన నర్జునుని ప్రతిజ్ఞకొఱకుఁ బగలురాత్రి యయ్యెను. ఇటువంటివి నీ మహిమలు. ఘంటాకర్ణుండు నెక్కడ మొఱలిడె? కుబేరుపట్టంబెక్కడఁ గరుణించితివి? సరయూ తీరంబున పరమపదంబు చూఱలిచ్చితివి. ఇప్పుడు శేషాచలంబునందు వరంబు లొసంగెదవు. నీవు గరుణించిన నీకసాధ్యంబేది. నీకిది సహజంబు; శ్రీ వేంకటేశ్వరా!

115

భక్తవత్సలా! కన్నులెదుట గోచరించినవన్నియును నీ రూపంబులే. శబ్దంబు లన్నియు నీ యనంతనామంబులే. జలంబులన్నియు నీ శ్రీపాదతీర్థంబులే. ఫలమూలాదులన్నియు నీ ప్రసాదంబులే. జీవకోట్లు నీ దాసులే. తలంపున నిల్చినవి నీ ధ్యానంబులే. చేతులఁ జేసినవన్నియు నీ కైంకర్యంబులే. జగంబు వైకుంఠంబే. యజ్ఞంబులు మహోత్సవంబులే. సకలసంపదలు నీ యుప కరణంబులే. ఇటువలె భావించియేకదా నీ భాగవతులు భవంబులు గెల్చిరి, ఇహపరములు చెందిరి; శ్రీ వేంకటేశ్వరా!

116

గదాధరా! బుద్ధిమంతుఁడైన యతండు దేహధారణమాత్రంబులు సుంతభోగంబులు గైకొని యితరంబు లేమియుఁగోరక అంతరంగంబునకు నిఖిలవస్తు లాభంబులు నీ పాదంబులేయని తలంచుకొని తృప్తిం బొంది యేకాంతంబునందే కాని సంసారంబు చేయుచుండి కాని నిన్ను ధ్యానంబు సేయుట యోగరహస్యంబు. ఇదియే తపంబు. ఇందులనే సకలసిద్ధులును సిద్ధించు. తొల్లిటి మును లీ రీతినే నిన్ను భజియించి ఘనులైరి. మఱికొంద ఱీ మార్గంబున నేమియుం గోరక మీ శరణుసొచ్చి మిమ్ముఁగొల్చి ముక్తులైరి. కావున మునుపడి సేవించు నుద్యోగంబులు జీవులవి, తర్వాత రక్షకత్వంబు నీది; శ్రీ వేంకటేశ్వరా!

117

త్రిగుణాతీతా! చతుర్భుజాకారా! కానరాని బ్రహ్మము నెవ్వరుఁ జూపలేరు. కానవచ్చియున్న నీ మాయ లెవ్వరు మాన్పలేరు. కలది భక్తసులభుండవని చదువులలో నిన్నుఁజెప్పంగాఁ జెవులు చల్లంగా వినుట యొకటి, కన్నుల పండువుగా నీ మూర్తులు దర్శించుట యొకటి, నీ రూపులు మనంబునఁ దలపోయుటొకటి, కరంబుల నీకు మ్రొక్కుటొకటి; నీ నామంబులు జపియించుటొకటి. ఇంతియకాని వేఱొక్కయుపాయంబు మఱిలేదు. విచారించిన నాత్మ పరమాత్మదర్శనంబులసాధ్యంబులు. కర్మంబులు కోరి చేసిన బంధంబులగు. కోరక చేసిన నిన్నుఁ గనుఁగొనుటకు; నన్ని చందంబుల మీకు శరణనుట మేలు; శ్రీ వేంకటేశ్వరా!

118

రుక్మిణీవల్లభా! మహాపాతకంబులు చేసిన జీవులు పాషాణంబులై వృక్షంబులై తృణగుల్మలతాదులై పుట్టుదురని చెప్పుదురు. జగంబంతయు నివియ నిండుకొనియున్నవి. బ్రహ్మాండంబును పాపంబు నిండుకొన్నది. చెప్పవే, యెట్లాయహల్య నీ పాదంబుసోకి పాషాణత్వంబుడిగి పావనంబయ్యె? నిటువంటి యీ చరాచరముల నంతర్యామివై నిండుక యుండఁగా నీ జీవులపాపంబులప్పుడే పోయిన బాధితానువృత్తి నున్నవియో కాక వారి నిర్బంధంబులు దోఁచకుండంజేసి మీ లీలకుం గైంకర్యంబు గొనుచున్నాఁ డవొ కాక మీ ధ్యానకల్పన ఘటియించుకొన్నాఁడవొ; శ్రీ వేంకటేశ్వరా!

119

దేవచూడామణీ! మీ స్వరూపంబు మితివెట్టి తెలియంగారాదు. తెలియకుండిన నాకు బ్రహ్మజ్ఞానంబు సిద్ధించుటెట్లు? శాస్త్రమార్గంబున యుక్తులు వెదకిన మీఁద మీఁదఁ బెరుగుచున్నవి గాని యవధిలేదు. మీ గరిమమెట్లు నిశ్చయింప వచ్చు? మీరుండుత్రోవతెఱుంగరానివని సందేహింప నేటికి? అన్నిట మీ దాసుండనని యుండుటే చాలు; నదియే సులభోపాయంబని నిశ్చయించి చెప్పితివి. మున్నిటిపెద్దలిందువలననే నీ చిత్తంబు గరఁగఁగొల్చిరి. ఇదే

పరతత్త్వజ్ఞానంబునకు మూలంబని నా మనంబున సన్నుతించి పతివ్రతా భావంబున దాస్యంబునకుఁ గంకణంబు కట్టుకొంటిని. ఇది నా విన్నపంబు; శ్రీ వేంకటేశ్వరా!

120

లక్ష్మీవల్లభా! నీ వజాండంబున కాధారకూర్మంబవట. మీఁదట నీ బంటు శేషుని ఫణంబులమీఁద సకలలోకంబులు నున్నవి. ఆదివరాహంబవైన నీ కొమ్మున భూమి నెలకొన్నది. మత్స్యావతారంబున నీచేత వేదంబు లుద్ధరింపఁ బడెను. సకలైశ్వర్యంబులకుం గారణంబయిన శ్రీదేవి నీ దేవి. సూర్యచంద్రులు నీ కన్నులు. మూఁడులోకంబులు నీ పాదంబునఁ గొల్చినవి. బ్రహ్మ నీ కొడుకు. ఇటువంటి బ్రహ్మాండంబులు నీ రోమ కూపంబుల ననంతంబులై యున్నవి. ఇటువంటి దైవంబులెవ్వరున్నారు?నీ కీర్తిప్రతాపంబుల కెదురేది? శ్రీ వేంకటేశ్వరా!

121

శ్రీ తులసీవల్లభా! ఇంద్రజాలములు చూపువాఁడు బట్టబయలు సముద్రంబుగా నీఁదును. దివాంధములు పగలు చీకటిగాఁ దలఁచును. భ్రమసినవాఁడు రజ్జువు సర్పంబుగాఁదెలియును. నీ మాయచేత మోహితుండైన వాఁడు నీ ప్రభావంబెఱుంగక తన సామర్థ్యంబులని యహంకరించును. నీ యవతారంబులు మానుషంబులుగా నెంచును. ఇటువంటి వారలకు నీ పరతత్త్వము తెలియదు. నీవు పుట్టించిన నాస్తికులైనవారి వినిపింప నెవ్వరితరము? మీరె కరుణించినప్పుడు మధురమయ్యెడుఁగాక! శ్రీ వేంకటేశ్వరా!

122

సామగానప్రియా! లోకరక్షణార్థంబు నీ వవధరించిన రామకృష్ణావ తారంబులను కర్మపాశబద్ధులైనవారు తమసాటిగాఁ దలఁతురు. వారు మీతో సరియేల యయ్యెదరు? సర్వోత్కృష్టుండవని యెఱుఁగనివారికది యేల రుచియించును? సర్పదష్టులైనవారికేమిదినినఁ జప్పనుండినట్లు మాయా

సర్పములు తలకెక్కిన తమ్ముతామెఱుంగక నిన్నుఁదమసాటి కెంచుకొంచున్నారు. కటకటా! యేమి యందు. సకలరక్షకుండవని మహాపురుషులు నిన్నుఁగూర్చి తపంబులుసేసి మహత్త్వంబులు వొందుచున్నారు. మీ ఘనతకిదియె దృష్టాంతంబని యెంచఁదగును; శ్రీ వేంకటేశ్వరా!

123

శ్రీవత్సలాంఛనా! నీవు బలవంతుండవు. ఎట్లుచేసిన నట్లగు. గౌతమీనది జలంబులకుం దగిలిన శాపంబు పరిహరింప శబరీస్నానతీర్థంబు గారణంబు చేసితివి. ఇదేమి చిత్రమో? బ్రహ్మర్షియైన దుర్వాసు నాపదమాన్ప నీ భక్తుండైన యంబరీషుని గుఱిచేసితివి. హీనాధిక్యంబులు విచారించిన నెంతకెంత యంతరము! మీ దాసులప్రభావంబు లిట్టివని లోకులకుం దెలిపితివి. ఏమని నుతియింతుము నీ మహిమ! శ్రీ వేంకటేశ్వరా!

124

తాటకాంతకా! నేను రాజస తామసగుణంబులం దగిలి మదోన్మత్తుండనై యున్నవాఁడ; నే బుద్ధిమంతుండ నౌట యెన్నఁడు? పూర్వజన్మంబున నే ననుభవించిన సుఖదుఃఖంబులు దలంచియైనను, గొంత చక్కటికి వచ్చెదనంటి నేని, జాతిస్మరత్వంబు లేదు. నరకబాధలఁ దలఁచుకొనియెద నంటినేని నవి నాఁడె మఱచితిని. భువిలోపల శునక సూకరాదులను సంసారబాధలం బడెడివారి తర్జనభర్జనాదులు చూచి విరక్తుండనయ్యెదనని నఁ బురాణవైరాగ్యంబె కాని దృఢంబు గాదు. నా మూఢత్వంబు విచారించెదవో! ఇన్నింటికిం బ్రేరేపకుండవు గనుక నీ మఱుంగు సొచ్చితిని. నీవె నన్ను శుద్ధసత్త్వ సంపన్నుఁ జేయవే; శ్రీ వేంకటేశ్వరా!

125

సుబాహుదైత్యమర్దనా! నేను మంత్రసిద్ధి పడయుట కొఱకుఁ గుత్తుక బంటి జలంబులలోపల నుండెదననుచు, ఋషియయ్యెడు కొఱకు వనంబులలోపలఁ దపంబుచేసెదననుచు, గాయసిద్ధివడయుకొఱకు సత్త్వౌషధంబులుచేసి సేవించెదననుచు, సిద్ధగంధర్వపదంబునం బొందెడు కొఱకు మహాయోగం

బులు సాధించెద ననుచు, ననేకోపాయంబుల యాశలంబొరలితిని నా వివేకం బేమని చెప్పెడిది? ఇవి యన్నియు నిర్బంధంబులైన బంధంబులెకాని, మోక్షమార్గంబునకుం బ్రయోజనపడవు. చిరంజీవుండనై యుండుదుఁ గదాయని యాసపడి యెన్నాళ్లుండినను, మీ మాయయైన జగత్తునఁ ద్రిమ్మటలే. కాని బ్రహ్మలోకంబు దాఁటరాదు. ఇందుల కింతపనియేల యిప్పుడు? బుద్ధిమంతుడనైతిని. మిమ్ముఁగొల్చి మీరే గతియనియుండంగా, మీరు వలసినట్లు చేసెదరు; శ్రీ వేంకటేశ్వరా!

126

యదుకులతిలకా! కర్మంబులుచేసి మిమ్ముం గనియెదమనిన నది ఘన తిమిరమధ్య దర్పణావలోకనంబు. చదువులు చదివి మిమ్ముఁబట్టెద మనిన నది బకబంధనప్రయాసంబు. తపంబుచేసి మిమ్ము వశంబుచేసికొనియెద మని తలంచిన నది శేషమస్తకమాణిక్య గ్రహణంబు. ఉపవాసవ్రతంబుల మిమ్ము నాదరించెద మనిన నది సముద్రసేతుబంధనంబు. దానంబు లొసంగి మిమ్ము నాకర్షించెదమనిన నది యాకాశపాశబంధనంబు. నీ వీ యుపాయంబులచేత నసాధ్యుండవు. నీవొక్క భక్తిచేతనే సాధ్యుండవు. ఇందుకు దృష్టాంతంబు మీకు శరణుసొచ్చిన ప్రహ్లాద నారద శుక భీష్మ విభీషణ కరి శబరీ గుహాక్రూర విదుర హనుమత్ప్రభృతులైన పరమభాగవతులు లోకంబులం ప్రఖ్యాతులయిరి. నిన్ను నొక్కని భజియించి నిశ్చింతనుండెదము; శ్రీ వేంకటేశ్వరా!

127

గోపాలబాలకా! నిన్ను నెఱుంగనిశుష్కజ్ఞానంబు పాషాణ కంటక క్రూరసర్ప వరాహ శార్దూల భల్లూకాక్రాంతంబైన యరణ్య మధ్యంబువంటిది. మీ దేవాలయంబులు లేనిచోట్లు కఠినకర్కశతిమిరదురవగాహ పిశాచశునకావాసం బుల వంటివి. మీకు విరహితంబులైన పూజలు నిబిడ నిర్ఘాత విద్యుత్పాత ఝంఝామారుతవర్షంబులైన సముద్రమధ్యంబుల వంటివి. మీ కథలు లేని పురాణశ్రవణంబులు భీకరాకార కాక ఘూక కంక గృధ్ర ఝిల్లీ పాషాణ గుహలలోని ప్రతిధ్వనులవంటివి. ఇవి యెల్లను మహాత్ములగువారు దలంపరు.

మిమ్ము నమ్మి సర్వశుభంబులు మీ యందె ఘటియించుకొందురు. వివేకు లయిన మీ దాసులకు నిదియె యుపాయంబు. శ్రీ వేంకటేశ్వరా!

128

పూతనాశిక్షకా! గ్రహణకాలంబునంజేసిన స్నానంబునకు గంగాస్నానంబు సరియని చెప్పుదురు. పుణ్యక్షేత్రంబుల నుండెడివారిని ఋషిసమానులని యంద్రు. సత్పురుషులైనవారి హస్తంబునంబెట్టిన సువర్ణంబు మేరుసమానంబని పలుకుదురు. కాలకృతంబులైన యనుష్ఠానంబులు సఫలంబులని వచియింతురు. అన్నిటి మాహాత్మ్యంబు మీ యందేయున్నది. గంగాజలంబు మీ పాదతీర్థంబు. ఋషిత్వంబు మీ దాస్యంబు. దానఫలంబైన సువర్ణంబు శ్రీమహాలక్ష్మి ప్రసాదంబు. అనుష్ఠానజపంబులు మీ నామస్మరణ సులభంబులు. ఇన్నియును మీ వలననే మాకు సిద్ధించె. ఇన్నిటం బరిపూర్ణులమై యున్నారము. వెన్న చేతఁబెట్టుకొని నేతికై వెదకనేమిటికి? పరుసవేది యింట నుండగా బంగారమడుగవలెనా? మాకు మీరు గలరు. ధన్యులమైతిమి శ్రీ వేంకటేశ్వరా!

129

లోకనాథా! నేను జ్ఞానంబెవరినైన నడిగి తెలిసికొనియెద నంటినేని శాస్త్రాధీనుండు బ్రాహ్మణుండు. గృహస్థుండు పుత్ర మిత్ర కళత్రాధీనుండు. రాజు రాష్ట్రాధీనుండు. ప్రధాని కార్యాధీనుండు. జపిత మంత్రాధీనుండు. తపస్వి దైవాధీనుండు. ఈ రీతిని వారువారు మనస్సులు తమ తమ కర్మంబు లందే యొడంబడ వర్తింతురు. కాని నిన్ను నొక్కనినే కొలిచితేను నీ వలన నన్నియుం గలవనియెడు విశ్వాసంబు వారికిఁగలుగ నేరదు. వారు నన్ను నెట్లు బోధించెదరు. విత్తొకటి వెట్టినఁ జెట్టు వేఱొక్కటి మొలచునా? అవి నీ కృత్యంబులు. నేను వైష్ణవుండను. ఆచార్యాధీనుండను. నీవు భాగవతాధీనుండవు. నన్నుం గరుణాదృష్టి నవలోకింపవే శ్రీ వేంకటేశ్వరా!

130

ఆదిమధ్యాంతరహితా! ఆకాశంబున భూమిం బురుడింప వచ్చును. అనంతమైన నీ మహిమకు నీడు లేదు. సముద్రంబునెంచి మేరుపర్వతంబుఁ బోలించవచ్చు. నీ కరుణాసముద్రంబునకు సరిచెప్ప నలవిగాదు. సూర్యుని

తోడఁ జంద్రుని జోడు చెప్పవచ్చును. నీ కోటిసూర్య తేజంబునకుం బ్రతిలేదు. బడబాగ్ని నగ్నిదేవునిఁబోల్పవచ్చును. నీ ప్రతాపాగ్నికి సాటి యుపమింపరాదు. చుక్కలను జ్యోతిశ్శాస్త్రంబుల లెక్కింపవచ్చునుగాని యపారంబైన నీ నామంబుల ప్రభావంబులకు నేమియు మితివెట్టరాదు. ఏకోదకంబైనపుడు నీవొక్కడవే నారాయణుండవై యుండుదువట నీకు నీవే యీడు. నిన్నెంతని కొనియాడుదుము. అందఱకు నీవొక్కరుండవే గతి. శ్రీ వేంకటేశ్వరా!

131

భక్త చింతామణీ! నేను విలాససంకల్ప బాధితుండనై యజ్ఞానంబనియెడియగాథ జలంబులలోన మాయావర్షాగమనంబునం దపంబు సేయుచున్నవాఁడ. అంగనాలింగనాకాశమధ్యంబుననుండి వదన చంద్రునిపై దృష్టినిలిపి యూర్ధ్వ బాహుండనై తపస్సు చేయుచున్నవాఁడ. అష్టాశీతిబంధంబుల యాసనంబుల నుండి మదనదైవతాగమంబున నిట్టూర్పులన్ ప్రాణాయామంబులం దపంబు చేయుచున్నవాఁడ. క్రోధాగ్ని పాతకేంధనంబులు దరికొల్పి తపంబు సేయుచున్నవాడ. ద్రవ్యార్జన చింతాది కామ్యకర్మఫలాహారినై తపంబు సేయుచున్నాఁడ. ఆశాపర్వతంబు మీఁద నతిదైన్యసూచ్యగ్రంబునం దపంబు సేయుచున్నవాఁడ. సంసారంబనియెడి పుణ్యక్షేత్రంబునను పుత్రదారాదులనెడి సాకారులగు నిధులు కన్నులెదుటం జూచి చూచి ధ్యానయోగంబుతోడుతఁ దపంబు సేయుచున్నవాఁడ. విచారించి చూచితే యిన్ని చందంబులనుండెడి వాఁడవు నీవే. ఈ తపంబులన్నియు గల్పించిన వాడవు నీవే. గురుండవు దైవంబవు రక్షకుండవు నీవే. మమ్ముఁ గరుణింపుము. శ్రీ వేంకటేశ్వరా!

132

దయానిధీ! నీవు మన్నించి భాండారంబు దెఱచి భూరిదానంబు లొసగఁగా సకల వైష్ణవులును నీపై భక్తిసంపదను తమ తమ యాత్మమందిరంబులలోన బాతర పెట్టుకొనిరి. నీ నుతులు మూటగట్టి వదనసౌధంబులలోన తూగవేసి కొనిరి. నీ నామాంకితంబులు దేహముతో లంకించి తిరుమణి గుఱుతులు వేసికొనిరి. నీ మూర్తిధ్యానంబు మనస్సనియెడి గోడలనంటించిరి. నీ

పూజాంగంబులు పిడికిళ్లఁ బట్టుకొని యున్నవారు. నేను వారిలోని వాఁడనే. నీ కృపాదృష్టి మాపై గురిసె. ఇంక మాకు ననావృష్టి దోషంబు లేదు. నీ ధర్మంబున పరిణామంబున నుండెదము. శ్రీ వేంకటేశ్వరా!

133

విజయప్రకాశా! కార్యాతురుండనై మందెమేలంబున మాటిమాటికి నిన్నుఁ దలంపుచున్నవాఁడను. నిన్నుఁదలంచి చూచితేను బ్రహ్మదేవునిలోని సామర్థ్యంబు నీవ. ఇంద్రునిలోని యైశ్వర్యంబు నీవ. సూర్యునిలోని తేజంబు నీవ. చంద్రునిలోని కళలు నీవ. వాయువులోని వేగంబవు నీవ. సకల దేవతలలోని ప్రాభవంబులు నీవ. అన్ని తీర్థంబులలోని పుణ్యంబులు ప్రభావంబులు నీవ. యజ్ఞదాన కర్మానుష్ఠానంబులు నీవ. ఇటువంటి నిన్ను సాధించనెట్లువచ్చును. నేను మనుష్య మాత్రదేహిని. మీరెంత నేనెంత, ఊరకే మిమ్ముఁగొలిచిన బంటనని పెద్దఱికంబులకుఁజెప్పుకొనియెదనుగాక, మిమ్ముఁ గనుఁగొన నెంత సమర్థుఁడను. నా యగ్గలికకు నేను నన్ను నవ్వుకొనుచున్నవాఁడను. నా యాస చూచి నన్నుఁ దయదలంచి యేలుకొనవే శ్రీ వేంకటేశ్వరా!

134

మధుకైటభాంతకా! జంతువులము మేము. ఆహార నిద్రలతో నోలలాడుచున్నయెడ నిన్ను నొకానొకపరి మా పాలింటి దైవమవని తలంచుచున్నారము. మా జ్ఞానంబులల్పంబులు ననాచారబహుళంబులు నయినట్లున్నవి. మా యునికి పెక్కురంగులచెట్లలో నొక జిల్లేడుఁజెట్టువలె నున్నది. బంటులకు నీవేమి చేసెదవో! నేము మిమ్ము సదా సేవింపనేరమి చింతింపుచున్నారము. నిన్ను నిర్హేతుక దయానిధివని పెద్దలు చెప్పుదురు. నీ బిరుదులు దలంచుకొని మాపై కృపాకటాక్షము దయసేయుము శ్రీ వేంకటేశ్వరా!

135

విభీషణస్థాపకా! ఈ మనుష్యలోకంబున రవిచంద్ర గ్రహ తారకంబులవలన నుదయాస్తమయంబులును పూర్వదక్షిణ పశ్చిమోత్తరంబులును నేర్పడియున్నవి. ఇంద్రాదులకు దేవమానంబున నివియే శతగుణంబులై యున్నవి. అట మీద

బ్రహ్మకు బ్రహ్మమానంబున ననంత గుణితంబులై యున్నవి. ఇందులకు జ్యోతిశ్శాస్త్రంబునంజెప్పెడి కాలంబునకు నేకవాక్యతc గల్పించి యేలాగున సరిపఱిచి చెప్పవచ్చును. శాస్త్రంబులు కల్లనరాదు. అయితే వీనికతంబున నీవే గాలాత్ముండవై ఇక్కడనక్కడ నిన్ని చందంబులతోడcజూపెడి నీ స్వతంత్రంబు గానంబడియెను. జగత్తంతయును నీ మహిమనే యున్నదను నిశ్చయము తేటతెల్లమాయెను. సర్వంబు నీ కల్పితంబై చెల్లుబడియవుట, నిశ్చయంబు. పుట్టించుటకు, రక్షించుటకు నీవొక్కరుండవే కర్తవు. పరమేశ్వరుండవు. అఘటనా ఘటన సామర్థ్యంబు నీక కలదు. నీ చేంతలు పొగడుచున్నారము శ్రీ వేంకటేశ్వరా!

136

ఉద్ధవ వినుతా! సర్వమైనవారికి నీవాహారంబు గొనువేళను ఆయా పదార్థంబులరుచులు జిహ్వాలకొకరీతివె. తరుణీ సంగమంబులు నొక్క చందంబులె, వీనుల వినియెడి వినికియును నొక్క జాడయె. ముక్కులా ఘ్రాణించు పరిమళంబును నేత్రంబులం జూచిన తెలివియును నొక్క తీరె. విచారించితే అనుభవంబులయెడ నేకసూత్రంబె అవుచున్నది. ఓహో! నీ ఘటన యత్యాశ్చర్యంబు, అన్నిట నేర్పరివౌదు శ్రీ వేంకటేశ్వరా!

137

కంసమర్దనా! నీవు ఆదివిష్ణుండవు. నీ యాత్మసంభవుండైన బ్రహ్మదేవుం డపరవిష్ణుండు. అతనిచేత సృజింపcబడ్డవారందఱు వైష్ణవులే, "సర్వం విష్ణుమయం జగత్" అందురుగావున నందఱును మీ యధీనులే. వారి వారి పూర్వజన్మానుగుణ్యంబునం గొందఱు శైవులగుదురు. కొందఱు మాయావాదు లగుదురు. అందులకు నింక నొక్క విశేషంబుగలదు. దేవతాంతర మతాంతర సాధనాంతర ప్రయోజనాంతరములు విడిచి తదేకనిష్ఠులై మిమ్ముc గొలిచినవారు పరమవైష్ణవులు. విదురుని యంతరంగులు. ఇతర మతంబుల వారు నిన్నెఱింగిన నెఱుంగకుండిన సకల దేవతలును నీ యంశసంభవులు

గనుక నా దేవతలcగొల్చినవారును నీవారే శ్రీ వేంకటేశ్వరా!

138

అహల్యాశాపవిమోచనా! నీవు సర్వంబునకు నాధారంబని వేదంబులు చెప్పుచున్నవి. నీకు నాధారంబెయ్యదియో యెఱుంగను. నీ వొక్కండవే పరబ్రహ్మవట! పురాణంబులు సెప్పెడి. తక్కిన మూర్తిభేదంబులెవ్వరెవరో యెఱుంగను. నీవేమిటం బొరయనివాcడవట! ఈ ప్రపంచం బెవ్వరికొఱకుc బ్రకాశింపుచున్నయదియో కానcబడదు. ఇవి యన్నియును విచారించి చూతమనిన నీవభేద్యుండవు. ఇటువంటి నీ మహిమకు నేము నాశ్చర్యంబు నొందుట గాని యొక యర్థంబు నిశ్చయింప నలవిగాదంటిని. తిలలోని తైలంబు విధంబునc, గాష్ఠంబులోని యనలంబు చందంబునc, బుష్పంబులోని పరిమళంబుపోలిక, బీజంబులలోని వృక్షంబుల కైవడి నీ రీతి జగంబులలోన నీవును, నీలోన జగంబులును; బాహ్యాంతరంబుల నీవు పరిపూర్ణుండవై యున్నాcడవు. నీవు వలసినట్లుండుము. నీకు శరణని బ్రతికెదము. శ్రీ వేంకటేశ్వరా!

139

కల్క్యవతారా! మిమ్ముcగొలిచిన సాధుజనంబులకు వరదహస్తంబును, భయపడ్డ దీనులకు నభయహస్తంబును జూపుకొని సాకారమై నిలుచున్న వాcడవు. శత్రుసంహారార్థంబై యొక శైలచక్రంబును విజయఘోషంబులందఱ కును నెఱిcగించుకొఱకు నొకచేత శంఖంబును బెట్టుకొని యున్నాcడవు. ఇంక నే మూహించి యాసపడి వెదకెడిదేమున్నది? కోరకే తొల్లి సర్వార్థంబులు నొసగ నంతర్యామివై కాచుకొని యున్నాcడవు. వెదకంబోయిన తీగ ముంజేతc దగిలినట్లు, వేడcబోయిన యర్థంబు వేడుకవచ్చినట్లు, ఆడcబోయిన తీర్థంబెదురుగా వచ్చినట్లు, తొల్లి చేయని పుణ్యఫలంబులు చేతికివచ్చినట్లు సకల తిరుపతులం బొడచూపుచున్నాcడవు. సకలమైనవారికి బ్రదుకుcద్రోవలు నీవుండిన యాకారంబు చెప్పుచున్నది. శ్రీ వేంకటేశ్వరా!

140

రవిచంద్రలోచనా! మా వేడుకకు నీ ప్రత్యక్షంబుఁ గోరెదము గాక నీవు ప్రత్యక్షంబయిన నెట్లు కనుఁగొన నోపుదుము. నీవు కోటిసూర్య ప్రకాశుండవట. ఒక సూర్యుండు దృష్టులకు మిఱుమిట్లు గొల్పెడిని నీవెట్లు గోచరించెదవో యద్భుతంబు. శ్రీ వేంకటాద్రి మీద నీ రూపంబు దర్శించితిమి. మాకు నిదియె బ్రహ్మసాక్షాత్కారంబు శ్రీ వేంకటేశ్వరా!

141

జగత్ ప్రాణా! బ్రహ్మచర్యంబుననుండి సాధించు ఫలమును, గృహస్థాశ్రమం బునంజేసి చెందెడి పుణ్యంబును, వానప్రస్థధర్మంబునం గట్టుకొనియెడి విశేషంబును, యతినిష్ఠచేతఁ బొందెడి యానందంబును నీ దాస్యంబునన సాధించుకొంటిని, నానా వేదంబులం జదివిన యాధిక్యంబును నీ నామోచ్చా రణంబునఁ గలిగించుకొంటిని. అఖిలలోకంబుల సౌఖ్యంబులు మీ గుడిపంచనే దొరకించుకొంటిని. అమరత్వంబు వైష్ణవత్వంబునం గైకొంటిని. అన్ని తీర్థంబుల స్నానంబులును గంగాస్నానములో నిలిచినట్లు, మంత్రజపంబులెల్లను బ్రణవంబులోఁ జిక్కినట్లు తపంబుల మాహాత్మ్యంబులు భక్తిచేతం దక్కినట్లు నీ కృపవలన నాకు సంభవించెలే శ్రీ వేంకటేశ్వరా!

142

కూర్మావతారా! బ్రహ్మాండంబొకటి, బ్రహ్మలు తొమ్మండ్రు, రుద్రులు పదునొకం డ్రు, దేవతలు ముప్పదిమూఁడుఁగోట్లు. ఇందఱిలో నెవ్వరి ననుసరించెదము. అందఱకును మూలకారణంబైన యాదిమూర్తివి నీవని నిన్ను నొక్కనిం గొలిచితిమి. ఇంక నిందఱును దృష్టులై మాకుఁ బ్రసన్నమయ్యెదరు. అట్లేగదా వృక్షంబునకు మొదటఁ బోసిన నీరు కొనలకెక్కి తనివిఁబొంది ఫలించు; నటువలెనే మీ చేత నిర్మింపఁబడిన దేవతలందఱును మిమ్ముఁజూచి మాకుఁ బ్రసన్న మయ్యెదరు. బహుమార్గంబులం దగిలితేను మనస్సు చలియించును. ఏకాగ్రబుద్ధిని మిమ్ము సేవించెదము, శ్రీ వేంకటేశ్వరా!

143

సముద్రసేతుబంధనా! నీ వలన నీ సంకల్పరూపంబైన ప్రకృతియును బ్రకృతివలన మహత్తును, మహత్తువలన నహంకారంబును, నహంకారంబు వలన మనస్సును, మనస్సువలన సకలేంద్రియంబులును, బంచతన్మాత్రలు జనించె. ఆ తన్మాత్రంబులవలన పంచమహాభూతంబులును బొడమె. కూడ నిరువదినాలుగు తత్వంబులయ్యె. ఆ యిరువది నాలుగు తత్త్వంబులైన జీవులలో నీవు వేంచేసియుండి ప్రకృతి భోగంబులన్నియు ననుభవింపఁ జేయుచున్నాఁడవు. నీవు ప్రాణబంధుండవై లోకంబులేలుచున్నాఁడవు. నిన్ను వేడుకొనియెదము. నీకుఁ బ్రియంబుఁ జెప్పెదము. గురుముఖంబునను నీ కృపవలనను స్వామివని నిన్ను నెఱింగి కొంటిమి. నీవు పెట్టినచెట్టు నీవే యాదేర్పవలయును. తరువాతి బుద్ధులు నీవే యనుగ్రహించి మమ్ముఁ గృతార్థులం జేయవే శ్రీ వేంకటేశ్వరా!

144

వాలినిగ్రహణా! నీపై భక్తిఁజేయునదెల్ల నన్ను నీవు రక్షింతువనియెడి స్వకార్యంబు కొఱకే. నీవు మమ్ముఁబాయక యంతర్యామియై యుండెడి దంతయును నీవు మాకుఁజేసిన పరమోపకారంబే. నే నస్వతంత్రుఁడ. నీవు స్వతంత్రుఁడవు. నే నగుణుండ. నీవు గుణాతీతుండవు. నే నశక్తుండ. నీవు సర్వశక్తిధరుండవు. నే నిన్ను ధరించుకొననోప. నీవు నన్ను ధరింపనోపుదువు. నా నేరుపునేరములెంచం బనిలేదు. నీ కీర్తిప్రతాపంబులెంచుకొని నీ మహిమలు మెఱసి నన్నుఁ బోషించుట నీకుంబుణ్యము. ఎలుఁగుబంటికి జూలు వ్రేగనరాదు. తీగెకుఁగాయ భారమనరాదు. కామధేనువునకుఁ గొమ్ములు వేసటనరాదు. మా చిరభారంబులు నీవే వహించుకొనవే శ్రీ వేంకటేశ్వరా!

145

మారీచహరణా! నీవు ధర్మసంస్థాపనంబు సేయునెపంబువలన ననంతావ తారంబులై యపరాధంబులు సేసిరని దుర్జనులైన రావణాదులను

సంహరించితివి. ఊరకున్న జీవులచేతను బాపంబులు సేయింపనేల? వారిని రాక్షసులుగాఁ బుట్టింపనేల? నీవు జన్మంబు నొందనేల? మొదలనే సుజ్ఞానులం జేసిన నీకేమి వెలితియయ్యెడిని. నీవు స్వతంత్రుండవు. నీవు లేక జగంబులోనఁ దృణంబు సలింపదని యంద్రు. నిన్ను మీఱిన పనులేమియున్నవి. నీవు తప్పుసేయవనుతలంపున మేమొకటియెంచుకొంటిమి. దేవతిర్యఙ్మనుష్య స్థావరాదులకు నీయవతారంబులు సేవించి బ్రతుకుండనియెడి యుపకారంబు గాఁబోలు నియ్యది. శ్రీ వేంకటేశ్వరా!

146

శ్రీమన్నారాయణమూర్తీ ! శ్రీరంగంబునకుఁ బుణ్యజనుల వెంట నేఁబోయి కావేరీనదిలో స్నానంబుఁజేసి పాపంబులు విదిల్చి రంగనగరంబుఁ జేరంబోయి సప్తప్రాకారంబులు గడచి యాపిమ్మట మీ తిరుకోవిల సొచ్చి గారుడ స్తంభంబునకు సాష్టాంగనమస్కారంబుసేసి యనేక సువర్ణ నిర్మిత శోభనా లంకారంబైన తోరణంబులు దాటి పసిండి కవాటంబులకుం బన్నిద్దఱాళ్వా రులకుం బ్రణమిల్లి యనంతభూషణంబైన మీ గర్భగృహద్వారమందు నిలిచి జయవిజయుల సేవించి సహస్రఫణిఫణామాలాలంకృతంబైన భోగీంద్రు మీఁదఁ బవ్వళించియున్న నీలమేఘవర్ణంబైన నీ యాకారం బారఁజూచి నీ శిరస్సున మరకతమాణిక్య పద్మరాగ వజ్రవైడూర్య గోమేధిక పుష్యరాగోన్నతంబైన కిరీటంబును, గర్ణయుగ్మంబున ముత్యపుఁజౌకట్లును, మకరకుండలంబుల మెఱుపుకాంతులును, తిరుమణి శ్రీచూర్ణంబులమరునుదురును, గంధ కస్తూరి కర్పూరంబులలందిన వక్షంబును, వైజయంతీ వనమాలికయును, జతుర్భుజంబుల రత్నఖచితంబులైన భుజకీర్తులును, హారకేయూర కంకణకటకాంగుళీ యకములును, బసిఁడిజన్నిదంబును, బంగారు కంఠహారంబును, బాదంబునఁ బసిఁడిగజ్జెలును, నవరత్నమయభూషణంబైన దక్షిణహస్తంబును, దలక్రింద వామహస్తంబును, నాజానుబాహుయుగళంబు మధ్యమున, నురముననున్న శ్రీ మహాలక్ష్మి పరకాంతవోలె నీ పాదంబులొత్తుచుండఁ బదివేలకోట్ల సూర్యప్రభలు గలిగిన దివ్యమంగళ

విగ్రహంబైన నీ యౌదార్యంబు నా కన్నుల కఱవు దీఱంజూఱి రోమాంకిత పులకాంకిత శరీరుండనై నీ దివ్యపాదపద్మంబులు నా హృదయ కమలంబున నిలుపుకొని మ్రొక్కి కొనియాడి నీవు సకలలోక కర్తవని, యచ్యుతేశ్వరుండవని, యష్టభుజనారసింహుండ వని, యుత్పత్తిస్థితిలయంబులకధికారివని, శంఖచక్రగదాఖడ్గ ప్రముఖ బాహుండవని, యలమేలు మంగాపతివని, నిన్నుఁ గొలిచితిమి, మమ్ముఁగాచి రక్షింపవే శ్రీ వేంకటేశ్వరా!

147

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా! ఆది మధ్యాంతరహితా! అంబుజాసనాది వంద్యా! శ్రీయలమేలుమంగా మనోహరా! నీ నామంబులనంతంబులట! నీ జన్మంబులవాఙ్మానసగోచరంబులట! నీ గుణములెవ్వరుఁదెలియ సమర్థులు గారట! నీ నాభికమలంబునంబుట్టిన బ్రహ్మ నాళంబునుంగానక శతవర్షంబులు తిరిగి నీ నామస్మరణంబున నిన్నుఁగనెనట! అయితే యిఁక నొకటి కలదు. నీ దాసులు నిన్ను విశేషించిన విశేషములేమని విన్నవించెదను. మాటి మాటికి నీ నామంబులు విన్నవించెదను. విన నవధరింపుము. శ్రీపురుషోత్తమా! శ్రీకూర్మము, లోలార్కము, వైకుంఠము, రంగనాథము, సర్పవరము, కనకగిరి, కనకాంబరగిరి, గోవర్ధనగిరి, యంజనగిరి, హస్తిగిరి, యాళ్వారులగిరి, పండరంగగిరి, గరుడగిరి, మంగళగిరి, నీలగిరి, రామగిరి, హేమగిరి, వేంకటగిరి, శ్వేతద్వీపము, హిరణ్యాద్రి, కుంతాద్రి, వృషభాద్రి, మదనాద్రి, ఘటికాచలము, శ్రీరంగము, ప్రమోదూతము, సత్యలోకము, ఆకాశనగరము, శబరీప్రకాశము, ద్వీపాంతరము, పంపాతీరము, ఉత్పల్లాపదము, అగస్త్యాశ్రమము,శరణాగతము, కదళీవనము, క్షీరాబ్ధి, బదరికాశ్రమము, నారాయణాశ్రమము, నైమిశారణ్యము, వింధ్యారణ్యము, మహారణ్యము, సుబ్రహ్మణ్యము, బృందావనము, భక్తిస్థలము, కపిస్థలము, పాదస్థలము, శ్రీనివాసస్థలము, అవంతి, వజ్రము, కాళికాహృదయము, గయ, గంగాసాగరము, చక్రవర్ధనము, సాగరసంగము, చిత్రకూటము, మణికూటము, హరిక్షేత్రము, కురుక్షేత్రము, అహోబలము, శ్రీవైష్ణవము,

హిమవంతము, చూర్ణప్రతీకము, కపిలము, హాటకము, నిఖిలసాగరము, మయూరము, శ్రీమద్వారము, కురుకాయకము, భద్రనందనము, రవిమండలము, ఆదిశంఖము, పూనమంబరము, భీమశంఖము, మర్ధాచలము, వృద్ధాచలము, నాసికాత్ర్యంబకము, హరిహరేశ్వరము, అళఘరి, చెన్నకేశ్వరి, శ్వేతాద్రి, తోతాద్రి, శ్రీరామము, శ్రీరాఘవము, దివాభవము, పాతాళము, శక్తిసాగరము, అగ్నిపురము, వటారణ్యము, అనంతము, కుంభకోణము, అయోధ్య, ప్రయాగ, ద్వారకావతి, జింహిల,తామ్రవర్ణి, కంచి, సింహాచలము మొదలైన యీ నూటయెనిమిది తిరుపతులయందవతరించితి వని వింటిని. ఆ తిరుపతులఁజూచి సేవించ సమర్థుండఁగాను, ఇన్ని తిరుపతుల సేవాఫలంబులు నాకు నీ నీ సహాయమేగతి శ్రీ వేంకటేశ్వరా!

148

ఉభయవిభూతి నాయకా! ఉభయవిభూతులలో, నిత్యవిభూతి, మూఁడు లక్షల ముప్పదిరెండువేల యామడ దాటఁగా, నవ్వల నండజ బ్రహ్మాండంబు దాటఁగా నవ్వల నమరావతీ పట్టణంబు, నమరావతీ పట్టణంబు దాటగా నావల సూర్యమండలంబు, సూర్యమండలంబు దాటగా నావలఁ జంద్రమండలంబు, చంద్రమండలంబు దాటగా నావల నక్షత్రమండలంబు, నక్షత్రమండలంబు దాటగా నావల బ్రహ్మలోకంబు, బ్రహ్మలోకంబు దాటగా నావలఁ గారణవైకుంఠంబు, కారణవైకుంఠంబు దాటగా నావలం బ్రకృతి. ప్రకృతి దాటగా నావల విరజానది. విరజానది దాటగా నావలఁ బరమపదంబు. పరమపదంబు దాటగా నావల నష్టాక్షరి యనెడి కొలను గలదు. ఆ కొలని లోపలఁగమలంబు గలదు. ఆ కమలంబులోపల నతి విస్తారమైన మంటపంబు గలదు. ఆ మంటపంబు లోపల వేయి శిరస్సులు, రెండువేల జిహ్వలుగల యాదిశేషుండు గొడుగై, పానుపై యుండఁగా, భగవానులు పవ్వళించియుండఁగా, శ్రీమహాదేవియు, శ్రీమహాలక్ష్మియుఁ బాదంబులొత్తుచుండఁగాను, భగవానుల సన్నిధిని భాగవతులు తిరుకొట్టూరు నంబియుఁ, దిరుమలనంబియుఁ, బెరియనంబియుఁ, దిరుకచ్చి నంబియు,

మార్నూరు నంబియు, నీ యయిదుగురును మూఁడువేళలఁబసిండిపువ్వులఁ బూజసేయంగా భగవానులేమనుచున్నారు. నా దాసులు నిర్భయులు. నా దాసులద్వయాధికారులు. నా దాసులు వేదాంత వేద్యులు. నా దాసుల నే నెఱుంగుటకాని నన్నెఱుంగుట కూడదు. భాగవతాపచారంబు పడ్డట్టాయెనా యాకాశంబు పగిలిన నదుకవచ్చును. భూమి పగిలినఁ బొదుఁగవచ్చును. సముద్రంబు పొరలినఁ గట్టవచ్చును. కాని యిటుకూడదు. భాగవతాప చారంబు దగ్ధ పటలంబు, అని వేదశ్రుతులు చాటుచున్నవి. వరవరముని మంత్రంబను విత్తనంబుఁదెచ్చి, పరమపదంబను పాదిగట్టి, చల్లఁగా నీ తిరుమంత్రంబులను పన్నీట జలకమార్చి కాలువలు దిద్ది యష్టాక్షరి యనెడి మొలక మొలపించి స్వరవేదమంత్రంబనెడి తీగఁబాఱించిన, పరిపూర్ణ కటాక్షంబనెడి పువ్వుపూచి, కాయగాచి, పండుపండి, ఫలమంది, పంచసంస్కార పరుండగుట నిన్ను నే గుఱుతెఱుంగుట. 'అస్మద్గురుభ్యో నమః' అనియెడి మంత్రంబుఁబోల మంత్రంబు లేదు. పూర్వాచార్యులఁ బోలమఱి యాచార్యులు లేరు. పరమరహస్యంబుఁబోల మఱి రహస్యంబు లేదు. శ్రీ మహావిష్ణువుఁ బోల మఱి దైవంబు లేదు. ఇట్లు నాకెఱింగింపవే శ్రీ వేంకటేశ్వరా!

149

ఆదిమధ్యాంతరహితా! అంబుజాసనాదివంద్యా! వేదవేదాంతవేద్యా! అవధారు! దేవా! నా విన్నపమొకటి కలదు. విన నవధరింపుము. అతిఘోర సంసారాంధకారంబనియెడి యడవిలోపల నా యజ్ఞాన జన్మజీవుండనియెడి గజంబున్నది. అది యెటువలె నున్నదంటివా? ఆశామోహంబులనియెడి గజసమూహంబులంగూడి పంచేంద్రియ విషయభోగాదులందగిలి కామక్రోధంబులంజిక్కి, తాపత్రయంబులచే ముందు వెనుకలు గానలేక యీషణత్రయంబనియెడి ఘోరవనదుర్గ గహనంబులం దగిలి రేయింబగళ్లు మితిలేని తిమిరంబునం జిక్కి, సన్మార్గసంచారంబు గానలేకయున్నది. అట్టి గజంబును బట్టితెచ్చుటకు నొక్క యుపాయంబు గలదు. అది యెట్లన్నను నీ యనుమతియను దివ్యపాశంబున నీ విజ్ఞానంబనియెడి వెంట యేనుఁగుతోఁ గూడఁబెనవేసి, నీ కృపాకటాక్షంబనియెడి సూత్రంబున బంధించి, యరి

షడ్వర్గంబులనియెడి యాశాపాశంబులనూన్చి, నీపై భక్తి యనియెడు కంబంబునంగట్టి, నీ నామోచ్చారణ రహస్యార్థంబనియెడి మేపు మేపించి, నీ తిరుమంత్రంబనియెడి జలంబుఁబెట్టించి, భవజరారోగ హరంబైన యాచార్య తళిగె ప్రసాదంబను కవళంబు మేపి, ద్వయంబనియెడి జూలు గట్టించి, యష్టాక్షరంబనియెడి ఘంటలు గట్టించి, రామానుజ సిద్ధాంతంబనియెడు మురజఁగట్టించి, కృష్ణరాహుత్తుండనియెడి మావంతు నెక్కించి భాగవత సజ్జారంబునంగట్టి, యితర కింకరదోష హరంబనియెడి తులసిదండలు దిష్టిదండలుగాఁబూన్చి, యితరంబనియెడి భారినిగళంబు విడిపించి, నీ చరమార్థంబనియెడి యంకుశంబుఁ జేతఁబట్టి యిట్టట్టు కదలనీయక, నీ తద్దాస సంసర్గ గతులకు లీలావినోదంబుగా నెక్కుడు శత్రుక్షయమిచ్చి, క్షేమంబు పాలించుకొఱకునై పదునాలుగు దొంతర చెఱువులు దాటించి, యావల బహుపాపహరంబైన విరజానదిలో స్నానపానాదులుసేయించి, పరిశుద్ధాత్మునిఁగాఁ జేసి శంఖచక్రపీతాంబర వనమాలికా భరితునింగాఁ జేసి, యిందిరా స్తన్యపానంబనియెడి యుగ్గు వెట్టించి, సాలోక్య సామీప్య సారూప్య సాయుజ్య పదవులిత్తువని సర్వలోకజనులు కొనియాడఁగాఁ బాడగాఁ బేరుకొనఁగా విని నీవలమేలుమంగా లక్ష్మీసమేతుండవు గావున నీకనంతంబులైన విన్నపములు చేసికొని కొనియాడెదను. పాడెదను. శ్రీ వేంకటేశ్వరా!

150

అలమేలుమంగాపతీ! అవధారు! దేవా! దేవా! చిత్తావధారు! నా విన్నపంబు విన నవధరింపుము. నిరాకారంబై వాయువు స్వరూపంబై యున్న జీవుని మాతృగర్భంబనియెడు నిరవుననుంచి శుక్లపక్షంబున శుక్లశోణితరూపంబున బదరీఫలప్రమాణంబునఁజేసి, ద్వితీయ మాసంబునఁగుక్కుటాండ స్వరూపంబునఁజేసి, తృతీయ మాసంబున మయూరాండ స్వరూపంబునఁజేసి, చతుర్థ మాసంబున నారికేళ ప్రమాణంబునఁజేసి, పంచమ మాసంబున శోణితాండరూపంబునఁ జేసి, షాణ్మాసంబునఁబంచతంత్రంబులతోఁగూడిన దశవాయువుల స్వరూపంబైయున్న లింగశరీరంబున నున్న కర్మజీవునిందెచ్చి తదీయ సూక్ష్మతనువందుఁ జొరఁదోలి మాంసశోణితంబు లాహారంబులు

సేసితివట! సప్తమ మాసంబున జీవునిఁ దత్వజ్ఞానపరునిఁజేసితివట! అష్టమ మాసంబున జీవుండు గృతమిట్టి కర్మంబులుం జేసితినని తన పాపంబులు గుర్తించుచు నవమమాసంబున నారాయణ ధ్యానపరుండగుచుఁ గరములఁ గర్ణంబులు మూసి, దశమమాసంబున ధరణిపై నుదయించి యజ్ఞానాంధకారంబనియెడి తిమిరంబుచేతఁ గప్పంబడి, కొన్ని వర్షంబులు స్తన్యపానంబునఁ గొన్ని వర్షంబులన్నప్రాశనంబున , భక్ష్యభోజ్యలేహ్య చోష్య పానీయంబులచేతఁ బరితృప్తుండై యీ విధంబున ద్వాదశవర్షంబులు నజ్ఞాన కృత్యంబులఁజేయుచు షోడశవర్షంబునఁ బంచేంద్రియంబులఁ బ్రబలుచు రాగమదమాత్సర్యంబున మత్తగజగమనుండగుచు జాతివర్ణంబులు చింతింపక వర్ణాశ్రమ ధర్మంబుల వరుసలుదప్పి జీవుండు హింసాపరుండగుచు నేకవింశతివర్షంబుననుండి సంసారాంధకారంబునం దగిలి పుత్రేషణ దారేషణ ధనేషణంబులనియెడి యీషణత్రయంబునం జిక్కుపడి నిన్నుఁగానకయుండు. పంచాశద్వర్షంబుననుండి జవసత్త్వములుడిగి జరాభారసంస్థలితుండైయుండు. పంచసప్తతి వర్షంబుననుండి శ్లేష్మసంకలితుండై యంధకత్వంబును బధిరత్వంబును నుదాసీనత్వంబును నుచ్ఛిష్టత్వంబును, గను. వాతపైత్యశ్లేష్మ సంకలితంబైన ద్వంద్వరోగంబులచేత మగ్నతఁబొంది శతవర్షంబులలో హతుండై యిహలోకంబునఁ గళేబరంబు విడిచి యాతనా శరీరధారుండగుచు యమలోకంబున కేఁగి యతిఘోర మహాఘోర బాధలనియెడి నరకబాధలఁ గుందుచు నసిపత్త్రవనంబులనియెడు వనభూములం గడుదుఃఖాత్ముండై తిరుగుడు వడుచుండునట. ఇవ్విధంబంతయు నే విని భయపడి, మీ యమిత కళ్యాణ గుణంబులు కొనియాడఁ దొడంగితి. నన్నుఁగృపఁజూచి రక్షింపవే శ్రీ వేంకటేశ్వరా!

151

దేవనారాయణా! పరబ్రహ్మస్వరూపా! అఖిలాండకోటిబ్రహ్మాండనాయకా! పురాణపురుషోత్తమా! పుండరీకవంద్యా! కపటనాటక సూత్రధారీ! అగణితమహిమావతారా! సకలకల్యాణగుణవర్ణితా! సకలజగదాధారా! ఆశ్రితకల్పభూజా! శరణాగతవజ్రపంజరా! కారుణ్యావతారనిధీ! భుక్తిముక్తి

ఫలదాయకా! శంఖచక్రగదా శార్‌ఙ్గాయుధధరా! కోదండదీక్షాదిగురూ! దశరథ రాజతనయా! కౌసల్యాగర్భరత్నాకరసుధాకరా! భరతాగ్రజా! సౌమిత్రిభక్తి ప్రియా! శత్రుఘ్ననిరంతర సేవితా! భక్తపరాధీనా! ఇక్ష్వాకు కులతిలకా! పక్షీంద్ర వాహనా! దేవాదిదేవా! తాటకాప్రాణాపహరణా! విశ్వామిత్రయజ్ఞప్రతిపాలకా! యజ్ఞకర్తా! యజ్ఞభోక్తా! 'సర్వం విష్ణుమయం జగత్' శ్రుతినికరప్రవేశితా! అహల్యాశాపవిమోచనా! పురహరకార్ముకఖండనా! సీతావివాహా! పరశురామ పరాక్రమహరణా! చిత్రకూటాచల నివాసా! విరాధదైత్యసంహారకా! శరభంగదర్శనా! దండకారణ్యనిలయా! శూర్పణఖా నాసికాచ్ఛేదనా! ఖరదూషణ త్రిశిరాది చతుర్దశసహస్ర దానవ శిరశ్ఛేదనా! మారీచ మాయామృగ వేఁటకాఱా! యోజనబాహు ఖండనా! జటాయు ముక్తిదాయకా! శబరీప్రసన్నా! పంచవటీ తీరనివాసా! ఆంజనేయ ప్రియాలంకారా! మాల్యవత్ ప్రవేశా! వాలి నిగ్రహణా! లవణాంబుధి హల్లకల్లోలా! దక్షిణసింధు రాజబంధనా! విభీషణ రాజ్యస్థాపనాచార్యా! సువేలాద్రి ప్రవేశా! కుంభ నికుంభ మకరాక్ష ధూమ్రాక్ష విరూపాక్షాతికాయ మహాకాయ కంపనాకంపన ప్రహస్త రక్తవర్ణాగ్నివర్ణ సర్పరోమ వృశ్చికరోమాది రాక్షస శిరశ్ఛేదనా! ఇంద్రజిత్తుతల గొండుగండా! రావణగిరివజ్రాయుధా! పంక్తికంఠ శిరశ్ఛేదనా! కుంభకర్ణాపహారా! ఛప్పన్నదేశ నిశ్చలపాలకా! శ్రీ రాఘవేశ్వరా! అవధారు! శ్రీ వేంకటేశ్వరా!

152

అర్జునసఖా! నీవు నిర్వచించిన పుణ్యంబుచేసిన దేవతల కూర్ధ్వలోకంబును, పాపంబుచేసిన రాక్షసులకు నధోలోకంబును, పుణ్యపాప మిశ్రితులయిన మనుష్యులకు మర్త్యలోకంబైన భూలోకంబును, సుజ్ఞానులయినవారికిఁ బరమపదంబును గట్టడచేసి యొసంగి త్రిలోకబంధుండవై యున్నాఁడవు. ఎవ్వరికి నపకారము చేయువాఁడవు గావు. వారు వారు తమతమ నేర్పునేరముల మిమ్ముఁగొందఱు మెప్పించి బ్రతికెడివారును, గొందఱు మీతో విరోధించి పొలయువారును. ఇంతేకాని మీరు లోకోపకారులు. మీ ప్రభావంబు తెలియనివారు మిమ్ము దూరుదురు. ఎఱిఁగిన మహాత్ములు మిమ్ముఁ బొగడుదురు. పక్షాపరపక్షంబులు మీకు లేవు. ఇందులకు వేదశాస్త్రపురాణేతిహాసంబులు సాక్షులు. మీ దాసులయినవారు మీకుఁగా నే ప్రమాణంబయినం జేసెదరు. పంపువెట్టుకొనుము. శ్రీ వేంకటేశ్వరా!

153

అనంతకల్యాణ గుణనిధీ! నీవు భక్తవత్సలుఁడవనుటకు సందేహమేలా? అందులకుఁ బ్రహ్లాదుండే సాక్షి. శరణాగత వజ్రపంజర బిరుదుకు సందేహంబేలా? అందుకు విభీషణుండే సాక్షి. దురితదూరుండవనుటకుఁ దర్కవాదంబులేలా? అందుకహల్యయే సాక్షి. నీ యుదారగుణంబున కనుమానంబేల? ఇందుకుఁ బాంచాలియే సాక్షి. ఆర్తజనపరాయణుండవగుటకు శంకయేలా? ఇందులకుఁ గరిరాజే సాక్షి. అగణితములయిన వేదనల నవసాదించుటకు సత్యంబులేలా? అందుకు ధ్రువుండే సాక్షి. ఇవన్నియు నీ మహిత ప్రభావంబగుట యెఱింగి నీ నామోచ్చారణకే శరణు సొచ్చితిని. శ్రీ వేంకటేశ్వరా!

154

ఇంద్రాదివినుతా! నీ శరణాగతి ప్రభావంబు నెఱుంగునట గౌతమ మహాముని. నీ నామకీర్తన యెఱుంగునట పార్వతి. నీ జిహ్వారుచి యెఱుంగునట విదురుండు. నీ మనోభావంబెఱుంగునట శ్రీకాంతామణి. నీ మహత్త్వం బెఱుంగునట ధనంజయుండు. నీ యఖిలవిద్యా విశేషంబు నెఱుంగునట వేణునాదంబు. నీ యలంకారంబెఱుంగునట కౌస్తుభ శ్రీ తులశీవనమాలికలు. నీ జవంబెఱుంగునట వైనతేయుండు. నీ భుజబల పరాక్రమంబెఱుంగునట శార్‌ఙ్గ గదా ప్రముఖ దివ్యాయుధంబులు. నీ రూపవిభ్రమంబెఱుంగుదురట గోపాంగనలు. నీ భుజావిశేషంబునెఱుంగునట వామదేవుండు. నీ భక్త వాత్సల్యంబు వైష్ణవ భాగవతోత్తములెఱుంగుదురట! నీ శౌర్యశాంత మహిమలు వైకుంఠసన్నిధానులెఱుంగుదురట! పూతనా హిరణ్యాక్ష రావణ కుంభకర్ణ జయవిజయాదులు నీ తేజంబెఱుంగుదురట! నిన్ను నుతియింప సహస్ర జిహ్వుండైనను నేరండట! శ్రీ వేంకటేశ్వరా!

155

స్వామీ! నా రక్తమాంసంబుల కొలందియే మదంబు; మదంబుకొలందియే యింద్రియంబులు; యింద్రియంబుల కొలందియే యాకారంబు; దీన ముదిమి ముంచుకొనిన నే నొరులకుఁ బ్రయోజనపడను. నా యత్నంబున కితరు లొడంబడకున్నఁ దామస భావంబులు తోచును. అంతట నా శరీరపోషణ బుద్ధియు, దేవతాభక్తియుఁ బాపరహితచింతయుఁ బుణ్య సంగ్రహమును

యథాయథలగును. నా నేరములేమని చెప్పుదును. నీవే దయతలంచిన నీడేరుదుముగాక! శ్రీ వేంకటేశ్వరా!

156

స్వస్తిసమస్తలోక విస్తారా! పురాణ పురుషోత్తమా! శ్రీ లక్ష్మీకళత్రా! కుంకుమాంకిత వక్షస్థల గాంభీర్యా! సనకసనందన సనత్కుమార సనత్సుజాత నారదాది మునీంద్రవందితా! బలివిభీషణ ప్రహ్లాదార్జునాంబరీష రుక్మాంగద గజేంద్ర గుహ భృగు మృడ భారద్వాజ మార్కండేయ గౌతమ దుర్వాస వ్యాస వాల్మీక్యాది మునిగణసేవితా! శ్రుతిప్రియపూజితా! బ్రహ్మాదిసుర గణవందితా! మృత్యుంజయా! త్రిమూర్త్యాత్మకా! ఇంద్రాగ్ని యమ నిర్‌ృతి వరుణ వాయు కుబేరేశానాఖ్యాష్టదిక్పాలకేశ్వరా! క్షీరాబ్ధిశయనా! ఉత్సాహోజ్వలాలంకారబింబా! సమంచిత నవరత్న ఖచిత పాంచజన్య జ్వాలాభిరామా! మత్స్య కూర్మ వరాహ నారసింహ వామన శ్రీరామ రామకృష్ణ బౌద్ధ కల్క్యాద్యవతారా! బలిబంధనా! త్రివిక్రమమూర్తీ! జమదగ్ని రామావతారా! శంఖచక్రగదాశార్ఙ్గశరాసననందకాయుధధరా! కోదండపాణీ! వేదాంతవేద్యా! మణిమయ మకుటా! పుండరీకాక్షా! శ్రీపుణ్యకోటివరదా! కావేటిరంగనాథా! శ్రీ వేంకటేశ్వరా!

157

హాటకగర్భజనకా! వేదవ్యాసవాల్మీక్యాదిమునీశ్వరులు నిన్ను సేవించి చిక్కించుకొని మోక్షంబడుగక యే రీతి నేమటిరో? శాస్త్రంబులు సదువుటతోఁ బరబ్రహ్మంబును వెదకెడి బ్రాహ్మణోత్తములైన విద్వాంసుల వివేకంబులెందుఁ బోయెనో? బ్రహ్మాది దేవతలు నిన్ను సేవించి నీ సాయుజ్యంబు వొందరైరే! వారి భాగ్యంబులెందుఁబోయెనో? అది యట్లుండనిమ్ము. ఆది దేవుండైన నీ విప్పుడందఱ హృదయంబుల నున్నావట! నిన్ను భావించి వలచి యున్నారము శ్రీ వేంకటేశ్వరా!

158

కరుణావరుణాలయా! అతిప్రజ్ఞావిలసితము, అత్యంతమనోహరము, జీవనదీ ప్రవాహంబు చందంబున నెడతెగక కల్పాంతంబుదాఁకఁ బాఱుచుండు నదియు నీ లీలావిభూతిమయమునగు నీ విశ్వమును బ్రవ్యక్తంబుగాఁ దోపించుచు

జీవుల బ్రమయింపుచునో దేవా! కర్తవైన నీవేల యవ్యక్తుండవై యంతర్యామివై యందకపొందక యడఁగి యుంటివన్నా! అగపడినచో నార్తులయలజడి హెచ్చగునని వెఱపా? వారికి నీవుగాక దిక్కెవ్వరు? నోటిమాట చెవి వినునంతలో నార్తులమొఱ నీవాలకింతువట! ధూర్తులకెంతకు నందరానంత దూరముననుందువట, ఆర్తతకెంతటి యోగ్యతనతికించితివి! ఇంత దయతో మమ్ముఁగాచుచున్న నినుఁగన్నుల కరవుదీరఁగనుఁగొనఁగోరుకొను చున్నారము. ఈ మనుగడనే మా కోర్కిఁగడతేర్పవయ్యా శ్రీ వేంకటేశ్వరా!

159

ఆదిశేషశయనా! ఉపవాసవ్రతంబుల నిన్ను సాధించెద మంటిమా యది సముద్రసేతుబంధనంబు. నీవే యుపాయంబుల చేతను నసాధ్యుండవు, ఇందుకు దృష్టాంతంబుగ నీ శరణంబు సొచ్చి ప్రహ్లాద నారద శుక భీష్మ విభీషణ కరి శబర్యక్రూర విదుర హనుమత్ప్రభృతులైన భాగవతులు లోకంబులఁ బ్రఖ్యాతులైరి. ఇది మాకు దృష్టాంతంబని నిన్ను నొక్కని భజియించి నిశ్చింతంబున నుండెదము శ్రీ వేంకటేశ్వరా!

160

కరుణాకటాక్షా! నీ వుభయ సేనామధ్యంబున నిరాయుధుండవై యర్జునునకు సారథ్యంబు సేయునాఁడు నీ దాసుండైన భీష్ముండు నీ చేతఁజక్రంబు నెత్తించె. నీ కూఁతురైన గంగాభవాని హరుని జటామకుటంబెక్కె. నీకుఁ బాన్పైన శేషుండు బ్రహ్మాండంబు నెత్తికెత్తుకొనియె. నీకు వాహనంబైన ఖగేంద్రుం డింద్రాదుల నోడించి యమృతంబుఁగొనియె. నీకు దాసుండైన ధ్రువుండు బ్రహ్మలోకంబు నాక్రమించె. నారదుడు దేవాసురులకుం బోరువెట్టుచున్నాఁడు. రుక్మాంగదుండు యమలోకంబుఁబాడుసేసె. శుకుండు ముక్తిఁజూరగొనియె. నీకు బంటైన యాంజనేయుండమరులకభేద్యమైన లంకానగరంబు దహనంబుసేసె. నీకు భక్తుండైన కుచేలుండు పిడికెడటుకులు సమర్పించి సంపదలనుభవించె. ఈ రీతి నీ దాసులు నీవిచ్చిన సలిగను నీకంటెఁబెచ్చు పెరుగుచున్నారు. నీ దాసులకిచ్చిన చనవులును నీ సేవాప్రభావంబులును

లోకంబునం జెల్లుబడియై చెల్లుచుండఁ జేసితివి. నీ కింకరుల చరిత్రంబులును, నీ యుదారత్వంబును వినియు నిన్నుఁ బొగడుచున్నారము శ్రీ వేంకటేశ్వరా!

161

దేవా! బ్రహ్మరుద్రాది దేవతలైన దేవతాగణంబులు రాక్షసుల ఖండించిన హింసాకర్మంబులంటవట! అప్సరోగణంబుల వలసి నట్లనుభవించిన వ్యభిచారంబులు లేవట! సోమపాన పురోడాశ భక్షణంబులు పుణ్యంబు లయ్యెనట! ప్రసన్నులైన మీ దాసులకు నేమిచేసిన దోషంబులేల కలిగెడిని. అందఱికిని నీవు గల్పించిన సాధారణ సహజ కర్మంబులవి. ఇందఱికి నీ వంతర్యామివి. నీవు విరహితంబుగాఁజేసెడి కృత్యంబులెందున్నవి. పుణ్యపాపంబులు సెప్పెడి పురాణంబులు మహర్షులకు సుప్రతంబిచ్చిన నీ కింకరులకు దురితంబులు లేవని యప్పణ యియ్యవే శ్రీ వేంకటేశ్వరా!

162

స్వామీ! అయస్కాంతంబునకు ముఖంబు చేసి చూచిన సూదులతి త్వరితంబు నంటుకొనినయట్లు స్త్రీలకుఁబురుషులకు నన్యోన్యావలోకంబునకు నంటుకొనం జేయుచున్నది నీ మాయ. అది యెట్టు తప్పించు కొనవచ్చును? తింత్రిణీశలాటువులు బాలకు నోరూర్చినట్లు సువర్ణంబునకుఁజిత్తంబులాసపడం జేయుచున్నది నీ ప్రభావంబు. ఇది యెట్లుగాదని త్రోయవచ్చు. దొంగిలించుక పోవంగాఁదలవరులు పాశంబులఁగట్టితెచ్చి ద్రవ్యంబులు దొంగల మెడఁ గట్టి యేఁగించినట్లు చేసిన కర్మంబు లనుభవింపం జేయుచున్న నీ సామర్థ్యంబు నే రీతిఁ దప్పించుకొనవచ్చు? ఇంక నీ జీవుల కే చందంబుగా నిక్కట్లు దీరి కడతేరవచ్చు? అమృతపుఁగుండ యొద్దనుండఁగాను నాఁకట నలయనేమిటికి? నీవు నాకుఁ గలవు. నీ పాదంబులు గొలిచి బ్రతికెదను. శ్రీ వేంకటేశ్వరా!

163

నాగకంకణ చాపఖండనా! తాను దొలుజన్మంబునం జేయు కర్మంబు లనుభవింపక పోరాదు. అది మాకు శక్యంబుగాదు. మేము గావించిన నేరంబులు మా మీద నుండఁగాను నీకు నేమని విన్నవించుకొనియెదము. నీ దాస్యంబను వజ్రపంజరమున్నది. నీ నామస్మరణంబులనియెడి

ఖడ్గంబులున్నవి. నీవే మాపై దయఁదలంచి విచారించెదవు. శ్రీ వేంకటేశ్వరా!

164

అమృతమథనా! మహర్షులు మిమ్ముఁ గోరి యతిఘోరతపంబుఁజేతురు. పక్షులు దేహంబుల గూళ్లువెట్టి నఖశిఖపర్యంతమును జీమల పుట్టలఁబెట్టు నట! ఇటువంటి నియమంబులు చేసికొని నిన్నెట్లు ధ్యానంబుఁజేసి మెప్పించెదము. ఈ మార్గంబులు మా వంటివారికి నతిదుర్లభంబులు. నీకుఁ జేతులెత్తి మ్రొక్కంగలవార మింతియగాని యింతలేసి పనులకు సమర్థులము గాము. నిన్ను నొడంబఱచి యొక విన్నపంబుఁ జేసెదము. నిన్నుఁ దెలియక మాయకు లోనైనంతగాలంబు నీ లీలకు లోనైనవారము. తెలిసితిమేని నీ దాసులయ్యెదము. అటుగావున యీ రెండు తెఱంగుల నీ వారమే. ఈ విధంబుననుండి నీవు చేసిన చేఁతలయ్యె. నన్ను నీవెప్పుడైన రక్షింపక తప్పదు. నీకు నాకు స్వామిభృత్య న్యాయంబు తప్పదు. సిద్ధంబు. ఇట నీ నామంబును మఱవనివాఁడను. తొల్లి నీవు రామావతారంబున విశ్వామిత్ర యజ్ఞ సంరక్షణంబుఁజేసి జనకునింటికిఁబోవుత్రోవను నహల్యయు దృణగుల్మ లతాదులు నీ పాదంబులు సోకి పావనంబయ్యెనట! అవి యే తపంబులఁ జేసినవి. మాకును నీ పాదంబులే గతి. శ్రీ వేంకటేశ్వరా!

165

మాయాశరీరధారీ! కామాతురుండైన జీవుండు నీ పాదంబుఁ దలంచెనేని యా కాంతదేహంబకాని ప్రకాశమానంబైన నీ పాదంబు తన మనంబు లోపలికి రాదు. తాఁదొల్లిఁజూచిన రూపభావంబు లోపలికిఁ జూచిన విరహంబుఁ బుట్టించుఁగాని ఫలంబులేదు. దీనికి బాహ్యంబులైన యింద్రియ ద్వారంబులు వెలుపలికి సాధనంబులు. తన మనస్సే తన్నుఁ లోనికింద్రిప్పు. అటుగావున నీ సాధనంబులచేతను వెలుపల నీ మూర్తులు దర్శించి యా రూపంబులు తన మనంబున ధరించి నిన్నుఁ గనుగొనుచుండెనేని బ్రహ్మానుభవమై విలసిల్లి ఫలియించును. ఇవి రెండును నీ మహిమలే. వివేకించి నేర్చినవారికి యరచేతిలోనిది ముక్తి. శ్రీ వేంకటేశ్వరా!

166

రమాకళత్రా! నీవు విరజానదీతీరంబున వైకుంఠనగర వాసుండవై ముక్తారత్న వజ్రవైడూర్య గోమేధిక పుష్యరాగ మరకత మాణిక్యాద్యలంకార శోభితంబైన మేడమాడుగులయందు మాణిక్య శోభితంబైన సహస్ర ఫణంబులఁ బ్రజ్వరిల్లెడు నాదిశేషుండు నీకుఁ బానుపై శోభిల్లఁగా, శ్రీదేవి భూదేవి నీళాదేవులు నీకుఁ గైంకర్యంబులు చేయఁగా, శంఖచక్ర గదా శార్ఙ్గ కోదండా ద్యాయుధంబులు రూపములు ధరియించి సేవసేయంగా, విష్వక్సేన వైనతేయాదు లుభయ చామరంబులు వేయగా, సనక సనందన సనత్కుమార సనత్సుజాతాది భక్తులు సేవింపంగాఁ, దుంబురు నారదాదులు నిరతముఁబాడంగా, నప్సరసలు నృత్యములు సలుపంగాఁ, గిన్నర గంధర్వగీర్వాణయక్షపన్నగ గుహ్యకులు స్తుతులు సేయంగాఁబరమేష్ఠి ఫాలలోచన పాకశాసని వైశ్వానర యమ వరుణ వాయు నిరృతి కుబేరేశానాఖ్యాష్టదిక్పాలకులును, నవబ్రహ్మలు, నేకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, అష్టవసువులు, సప్తమరుత్తులు, చిత్రగుప్తులును, నవగ్రహంబులును, సప్తసాగరంబులును, సప్తనదులును, సప్తకులపర్వతంబులును, కృతయుగాదిచతుర్యుగకన్యలును, వినయ విధేయతలం గొలువఁగా, సాలోక్య సామీప్య సారూప్య సాయుజ్యంబులం బొందిన పుణ్యపురుషులు మీ పురంబున మెండై చెలంగుచుండ నవనిధులు, నైరావతోచ్చైశ్శ్రవ కామధేను కల్పవృక్ష చింతామణ్యాదులచే నయిన యష్టైశ్వర్యంబులు శోభిల్లఁగాఁ, బేరోలగంబునఁ బెద్దకొలువై కూర్చుండి మనవి చనవులు పాలింపుచు, నభయ ప్రదానంబు లిచ్చుచు మందస్మిత వదనార విందుండవై యుండియు, సర్వజీవ దయా పరత్వంబున ననంతరూపంబులు దాల్తువట! మత్స్యావతారంబున సోమకాసురు మర్దించి వేదంబులు బ్రహ్మకు నొసంగితివట! కూర్మావతారంబున మందరగిరి మోసి నీ దాసులయిన సురలకు సకలైశ్వర్యంబులు సమకూర్చితివట! వరాహావతారుండవై హిరణ్యాక్షు మర్దించి పృథివిఁ జాపచందంబునఁబఱపితివట! నరహరిరూపంబుఁదాల్చి హిరణ్యకశిపు మర్దించి నీ భక్తుఁడైన ప్రహ్లాదుఁ గాచితివట! వామనావతారంబున బలిని బంధించి పాతాళంబునకుఁ ద్రోచితివట! పరశురామావతారంబునఁ గార్తవీర్యార్జునాదిచ్ఛప్పన్న దేశరాజుల మర్దించి వారలకళేబరంబులు స్వర్గ

సోపానంబులుచేసి పితృదేవతల మోక్షానకు నిలిపితివట! రామావతారుండవై తాటకా ప్రాణాపహరణంబును, విశ్వామిత్ర యజ్ఞపరిపాలనంబును, నహల్యాశాపవిమోచనంబును, శ్రీకంఠచాప ఖండనంబును, సీతా వివాహంబును, భార్గవగర్వాపహరణంబును, యౌవరాజ్య విఘ్నంబును, గుహ సంభాషణంబును, జటావల్కల ధారణంబును, భరద్వాజ సంతోషణంబును, జిత్రకూటాద్రి నిలయంబును, భరతునకుఁ బాదుకాద్వయం బొసంగి మన్నించుటయును, విరాధవధయును, శరభంగుం గాచుటయును, నత్ర్యనసూయలచేతఁ బూజుల నందుటయును, నగస్త్య సుతీక్ష్ణమతంగాది సకల మునివరుల యాశ్రమంబులం బ్రవేశించుటయును, మునుల కభయప్రదానంబు లొసంగుటయును, బంచవటీతీరంబున నుండి శూర్పనఖా నాసికాచ్ఛేదంబును, ఖరదూషణాది చతుర్దశ సహస్రదాన వాపహరణంబును, మారీచమారణంబును, జటాయువుకు మోక్ష మిచ్చుటయును, గబంధవధయును, శబరిచేఁ బూజలందుటయును, వాలిమర్ద నంబును, సుగ్రీవునికిఁ గిష్కింధాపట్టంబుఁగట్టుటయును, దర్భశయనంబును, గంధినాథు నపతుదికిఁ దెచ్చుటయును, సేతుబంధనంబును, సువేలాద్రి నిలయంబును, రావణ కుంభకర్ణ మేఘనా దాతికాయ మహాకాయ ధూమ్రాక్ష యూపాక్ష శోణితాక్ష మకరాక్ష ఖడ్గరోమ వృశ్చికరోమ సర్పరోమాగ్నివర్ణ కంపనా కంపన ప్రహస్తాది సకల రాక్షసప్రాణాపహరణంబును, విభీషణ లంకా సామ్రాజ్య పట్టాభిషేకంబును, బుష్పకారూఢులై వచ్చి యయోధ్యాది పత్యంబును నేకాదశసహస్రవర్షంబులు పాలించుటలును, హలధరావతారంబున దుష్ట రాక్షస సంహరణంబును, గృష్ణావతారంబున బాలక్రీడావినోదంబులును, గోపాలకత్వంబును, బూతనా శకటాసుర కుక్కుటాసుర ధేనుకాసుర బకాసుర వత్సాసురాది దుష్టరాక్షసు గర్వాపహరణంబును, గోవర్ధనగిరి యెత్తుటయును, గో నిర్మితంబును గోపాంగనా జారత్వంబును, గంస శిశుపాల నరకాసుర బాణాసురాది దుష్టనిగ్రహంబును, ద్వారకా నిర్మితంబును, నర్జున సారథిత్వంబును దుర్యోధనకులాంతకంబును, విదురా క్రూర ముచికుందాది భక్తజన కటాక్షవీక్షణంబును, గల్క్యవతారంబున దుష్ట నిగ్రహంబును, శిష్టప్రతిపాలనంబును, వర్ణాశ్రమ ధర్మంబులు నిర్ణయించు

టయును, నిట్ల యుగయుగంబుల నవతారంబులెత్తి ధర్మంబు నిర్వహించు టయును, సర్వజీవ దయాపరత్వంబునఁ దామ్ర శిలా మృణ్మయ దారువులందుఁ నుండి భక్తుల రక్షించుటయు, మఱియు గృహే గృహే తిరువారాధన, రూపంబులై వెలసి భక్తులఁగటాక్షింపుచుండుటయు జరపుదువనిన నీ ప్రభావంబులేమని వర్ణింపవచ్చును. అణురేణుతృణకాష్ఠ పరిపూర్ణుండవై నిండియుండుదువట! ఇటువంటి నీ ప్రతాపంబులు విని యిందును నొక యుపాయంబుఁ జింతించితిని. సకల జీవులయందును బరిపూర్ణుడవు కనుక, నా యందు నీ వుండుటం జేసి నా చేయు కృత్యాకృత్యములు నీవే చేయుటగా, నీకే ప్రీతియని నిశ్చయించి, యన్ని నేరములను నీ మీఁదనే మోపి నేను తేరకాఁడ నయితిని. **'కర్తా భోక్తా జనార్దన'** యను శ్రుతివచనము ప్రకారమునఁ జేకొని, నన్నుఁ గటాక్షవీక్షణంబుల నీ దాసానుదాసునిఁగా నెంచి రక్షింపుము. శ్రీ వేంకటేశ్వరా!

శ్రీ వేంకటేశ్వర ప్రభాతస్తవము

శ్రీ గురుండర్థితో శేషాద్రియందు
యోగనిద్రాకేళి నున్న యత్తఱిని
వనజాసనాది దేవతలేఁగుదెంచి
వినుతించిరప్పుడవ్విధ మెట్టిదనిన
శ్రీకర! వేంకటక్షితిధరావాస!
నాగేంద్రనుత రమానాథ మేల్కనుము
వసుదేవదేవకీ వరగర్భజాత
కిసలయాధర రామ కృష్ణ మేల్కనుము
తపము పెంపున యశోదానందులకును
గృపతోడ శిశువైన కృష్ణ మేల్కనుము
పూతనాకైతవస్ఫురితదుర్వార
చైతన్యహరణ ప్రశస్త మేల్కనుము
అతిముఱి శకటాసురాంగంబు లీల
విఱుఁగఁదన్నిన యదువీర మేల్కనుము
సుడిగాలిరాకాసి స్రుక్కడంగించి
గెడపిన కెదు బాలకృష్ణ మేల్కనుము
మద్దులఁగూల్చి యున్మదవృత్తి మెఱయు
ముద్దుల గోపాలమూర్తి మేల్కనుము
అద్రిరూపంబైన యఘదైత్యుఁ జంపి
రౌద్రంబు నెఱయు భూరమణ మేల్కనుము
ఆననంబునఁ దల్లి కఖిలలోకములు
పూని చూపిన యాదిపురుష మేల్కనుము
ఖరధేనుకాసురక్రకచ! మేల్కనుము
వరగర్వఘనబకవైరి! మేల్కనుము

చతురాననుఁడు వత్సమితి నొంచినను
బ్రతియొనర్చిన పరబ్రహ్మ! మేల్కనుము

కాళియఫణిఫణాంగణ నృత్యరంగ
లాలితచరణవిలాస! మేల్కనుము

అతులకుబ్జా మనోహరుఁడ! మేల్కనుము

చతురమాలాకారశరణ! మేల్కనుము

వనజాక్ష! యక్రూరవరద! మేల్కనుము

వినయవాక్యోద్ధవవినుత! మేల్కనుము

భుజవిక్రమక్రమ స్ఫూర్తిమై భోజ
గజముఁ జంపిన బాహుగర్వ! మేల్కనుము

జెట్టిపోరను గిట్టి చీరి చాణూరు
చట్టలువాపిన శౌరి! మేల్కనుము

కురుసైన్యవిదళనాకుంతితోత్సాహ
భరితపాండవపక్షపాత! మేల్కనుము

చండ భారత రణచాతుర్య ధుర్య
గాండీవిసారథ్యకరణ! మేల్కనుము

బలభేది భేదించి పారిజాతంబు
నిలకుఁ దెచ్చిన జగదీశ! మేల్కనుము

బాణబాణాసనోద్భట భీమబాణ
పాణిఖండన! చక్రపాణి! మేల్కనుము

రాజసూయమున శూరతఁ జైద్యుఁ దునిమి
పూజలందిన జగత్పూజ్య! మేల్కనుము

మురనరకాసుర ముఖ్యదానవులఁ
బొరిగొన్న యదురాజపుత్త్ర! మేల్కనుము

వీరకౌరవసభ విశ్వరూపంబు
ధీరతఁజూపిన దేవ! మేల్కనుము

ఇంపునఁ బృథుకంబు లిడిన కుచేలు
సంపన్నుఁజేసిన చతుర! మేల్కనుము

దారుణ భూభార తరణావతార
భూరిప్రతాపవిస్ఫురణ! మేల్కనుము

సదమలానంద! నిశ్చయములకంద!
విదురుని వింద! గోవింద! మేల్కనుము

భోజకన్యాముఖాంభోజద్విరేఫ
రాజీవ నయనాభిరామ! మేల్కనుము

వరరూపవతి జాంబవతితోడి రతుల
నిరతిమై నోలాడు నిపుణ! మేల్కనుము

మంజుల సత్యభామా మనస్సంగ
రంజితగాత్ర సంరంభ! మేల్కనుము

లలితకాళిందీ విలాస కల్లోల
కలిత కేళీలోల ఘనుఁడ! మేల్కనుము

సారసుదంతా భుజకుముద హార
చారుప్రభాపూర చంద్ర! మేల్కనుము

నేత్రరాగ విశేష నిచితప్రతోష
మిత్రవిందారసోన్మేష! మేల్కనుము

భద్రానఖాంకుర బాల చంద్రాంక
ముద్రితభుజతటీమూల! మేల్కనుము

లక్షణాపరిరంభ లక్షితోదార
వక్షోవిశాల కవాట! మేల్కనుము

వేడుకఁ బదియాఱువేల కామినులఁ
గూడి పాయని పెండ్లికొడుక! మేల్కనుము

కలిత నక్రగ్రాహగంభీర జలధి
వలయితద్వారకావాస! మేల్కనుము

జలదనీల శ్యామ! జగదభిరామ!
వెలయ మేల్కను మంచు విన్నవించుటయు
వీనులఁ గదిసిన వెలిదమ్మికన్నుఁ
గోనల నమృతంబు గురియ మేల్కాంచి
సరసిజాక్షుఁడు దేవసంఘంబుమీఁద
కరుణాకటాక్ష వీక్షణము నిగుడ్చి
శ్రీవేంకటాచలశిఖరమధ్యమున
సౌవర్ణమణిమయ సౌధంబులోన
పూగచంపకకుందపున్నాగవకుళ
నాగరంగప్రసూన విరాజమాన
తరులతాపరివేష్టితంబైన యట్టి
నిరుపమ కోనేటినిర్మలాంబువుల
తిరుమజ్జనంబాడి దివ్యాంబరంబు
ధరియించి దివ్యగంధము మేనఁదాల్చి
నవరత్నమయ భూషణంబులు వెట్టి
వివిధసౌరభముల విరులోలి ముడిచి
ధారుణీసురులకు దానంబు లొసఁగి
చేరి యక్షతములు శిరసునఁదాల్చి
వినుతులు గావింప విబుధసన్మునుల
మనవులు విని వారి మన్నించి మించి
యగణితరత్న సింహాసనారూఢుఁ
డగుచు మేరువుమీఁది యభ్రంబువోలె
గరకంకణోజ్జ్వల క్వణనంబులెసఁగ
సరసిజముఖులు వెంజామరల్ వీవ
బంగారుగుదియల పడవాళ్లు వరల

నారదవీణా నినాదంబులెసఁగ
చారణమునిసిద్ధ సంఘంబు గొలువ
నానాప్సరస్సతుల్ నాట్యముల్ సేయ
మానవేశులు మహామహులు సేవింప
ఘనతర నిత్యభోగంబులు వెలయ
జనులకెల్ల మహాప్రసాదంబు లొనరఁ
గోరినవారికిఁ గోర్కు లీడేర
నీ రీతి జగముల నేలుచునుండు
నని భక్తిఁదాళ్లపాకాన్నమాచార్యు
తనయుండు తిమ్మయ తగఁబ్రస్తుతించె.

శ్రీ వేంకటేశ్వర వచనముల ముద్రణము సాగుచుండఁగా, రాజకీయ ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో నీ ప్రభాతస్తవమును గుర్తించి, యేకకవి కృతియని, యిందు దీనిని గూడఁ బ్రకటించితిని.

వేటూరి ప్రభాకరశాస్త్రి.

వచనసంఖ్య	రాగతాళము
1	గుజ్జరి (ఏకతాళి)
2.	శంకరాభరణము (తివడ)
3	శ్రీరాగము (ఏకతాళి)
4.	రామక్రియ (రూపకము)
5	లలిత (జంపె)
6	భూపాల (తివడ)
7	మాళవిగౌళ (ఏకతాళి)
8	మాళవిగౌళ (తివడ)
9	నాట (రూపకము)
10	నాట(తివడ)
11	సామంతం (జంపె)
12	బౌళి (జంపె)
26	మలహరి (తివడ)
27	భూపాలము (రూపకము)
28	సాళంగనాట (తివడ)
29	సాళంగనాట (ఏకతాళి)
30	వరాళి (తివడ)
31	బౌళి (తివడ)
32	ముఖారి (జంపె)
33	నాదనామక్రియ (జంపె)
34	నాదనామక్రియ (ఏకతాళి)
35	శ్రీరాగం (తివడ)
36	శ్రీరాగం (జంపె)
37	నారాయణి (తివడ)
38	సాళంగనాట (పల్లవి)
39	గుండక్రియ (తివడ)
40	సామంతం (తివడ)
41	దేశాక్షి (జంపె)
42	ముఖారి (రూపకము)
43	కాంభోజి (తివడ)
44	పాడి (ఏకతాళి)
45	ఆహిరినాట (రూపకము)
46	శుద్ధవసంతం (తివడ)
50	హిందోళవసంతం (తివడ)
52	దేశాక్షి (తివడ)
53	ధన్యాసి (తివడ)
85	మాళవి
86	దేశాక్షి (రూపకము)
87	ధన్యాసి (ఏకతాళి)
88	ధన్యాసి (జంపె)
89	బౌళి (ఏకతాళి)
90	కన్నడబంగాళం (తివడ)
91	లలిత (తివడ)
92	దేవగాంధారి (జంపె)
93	హిందోళవసంతం (జంపె)
94	మలహరి (ఏకతాళి)
95	భూపాల (జంపె)

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం ద్వారా ప్రచురింపబడిన గ్రంథములు

1.	తెలుగుమెఱుగులు	2008
2.	కావ్యమంజరి	2008
3.	అన్నమాచార్యచరిత్రపీఠిక	2008
4.	సింహావలోకనము	2009
5.	పూలవిందు	2010
6.	ప్రజ్ఞాప్రభాకరము–గురుపూజ	2011
7.	వేటూరిప్రభాకరశాస్త్రి వాఙ్మయసూచిక	2012
8.	కేయూరబాహుచరిత్ర	2012
9.	శ్రీ వేంకటేశ్వర స్తుతిరత్నమాల	2013
10.	వేటూరివారి పీఠికలు మొదటిభాగం	2013
11.	వేటూరివారి పీఠికలు రెండవభాగం	2013
12.	చాటుపద్యమణిమంజరి 1వ భాగము.	2013
13.	చాటుపద్యమణిమంజరి 2వ భాగము.	2013
14.	సుభద్రా కళ్యాణము	2013
15.	సుగ్రీవ విజయము.	2013
16.	బసవపురాణము (బసవోదాహరణమును అనుబంధంగా)	2013
17.	శ్రీ వేంకటేశ్వర లఘుకృతులు.	2013